నవయుగ కవిచక్రవర్తి, పద్మభూషణ

జాషువ రచనలు

మొదటి సంపుటం

గబ్బిలం

SHOUT
SHARE
IT

నవయుగ కవిచక్రవర్తి, పద్మభూషణ్
జాషువ రచనలు

మొదటి సంపుటం

గబ్బిలం

సివిల్ సర్వీసెస్, గ్రూప్ - I, II
మొదలగు పరీక్షలకు, సాహితీప్రియులకు
ఉపయోగపడే పుస్తకం.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాద్ - 500 001. ఆం.ప్ర.

Navayuga Kavichakravarthi, Padmabhushan - Jashuva Rachanalu - Vol. I – GABBILAM

ప్రచురణ నెం. : 2350/19 R

ప్రతులు : 1000

గత ముద్రణలు : 1996, 1998, 1999

వి.పి.హెచ్. ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 2004

వి.పి.హెచ్. ద్వితీయ ముద్రణ : డిశంబర్, 2004

© JASHUVA FOUNDATION.

వెల: రూ.25-00

ప్రతులకు : **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,**
విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాద్-500 001.
E-mail: visalaandhraph@yahoo.com
విశాలాంధ్ర బుక్ హౌస్,
(అబిడ్స్, సుల్తాన్‌బజార్) హైదరాబాద్,
విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు,
తిరుపతి, హన్మకొండ, అనంతపురం, కాకినాడ.

హెచ్చరిక: ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగాగానీ, కొంతగానీ కాపీరైట్ హోల్డరు/ ప్రచురణకర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా, కాపీరైట్ చట్టరీత్యా నేరం.

టైప్ సెట్టింగ్: ట్వంటీఫస్ట్ సెంచరీ, దిల్‌సుఖ్‌నగర్. ఫోన్: 24066986
ముద్రణ: **శ్రీ శతాంజలి గ్రాఫిక్స్,** హిమాయత్‌నగర్, హైదరాబాద్.

దళిత చేతన కేతనం

ఆంధ్రదేశంలో ఏ రకమైన ఉద్యమాలూ ఉధృతరూపం ధరించని కాలంలో, "ఘనద్రురాచార సాకారమగ్నమై ప్రజాబాహుళ్య మొడ్డున బడకముందటి" కాలంలో, పందొమ్మిదో శతాబ్దం చివరి దశకంలో జాషువా జన్మించాడు. జాతీయవాదం ఇచ్చిన ఉత్సాహం, అందులోని పాయగా ముందుకొచ్చిన సంస్కరణవాదం ఇచ్చిన స్ఫూర్తి - గాంధీజీ నాయకత్వాన రాబోయే కాలంలో దేశంలోని కులమత వివక్షత, ఆర్థిక అసమానతలు తొలగిపోగలవన్న నమ్మకాన్ని జాషువాలో కల్గించాయి. రాజకీయ భావాల్లో మితవాద దృక్పథం అనుసరించినా; కవితా తీవ్రవాద వీరావేశంతో అతివాద భావాలపట్ల ఆకర్షితుడయ్యాడు.

అగ్రవర్ణ దురహంకారాలను చవిచూసిన జాషువా సౌమ్య పదజాలంతోనే వాటిని ఎదిరించాడు. ఓ సందర్భంలో ఆయనే చెప్పినట్లు "నాకు గురువులు ఇద్దరు - పేదరికం, కులమత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది..." అన్నది ఆయన కవిగా, వ్యక్తిగా వీరాద్రూప ప్రదర్శనకు నేపథ్యాలు. 1925కు ముందటి జాషువా రచనలను ఆవిర్భవించబోయే మహాకవి జాషువాకు పూర్వరంగంగా భావించవచ్చు. భావకవిత్వ యుగంలో రాసినప్పటికీ విలక్షణా భావజాలంతో, వస్తు నిర్వహణా నైపుణ్యంతో దుష్ట సమాజం మీద ప్రళయనృత్యం చేశాడు. ఆగామి సమాజాన్ని సుందరంగా భావించి ఆహ్వానించాడు. భావకవిత, అవధాన కవితల్లో మునిగితేలాడు. నాటి సమకాలిక కవులందరిలాగానే రాష్ట్రాభిమానం, దేశాభిమానం కవితల నిండా ప్రోదిచేస్తూ అక్కడే ఆగక విశ్వనరుడుగా ఎదిగాడు.

ఆ కాలంలోనే ఆర్థికమాంద్యం ఒడుదుడుకులతో, రెండో ప్రపంచ యుద్ధ ప్రభావంతో అతలాకుతలమవుతున్న తన చుట్టూ ఉన్న సమాజాన్ని చూశాడు. కారణాలేవైనా తాపీ ధర్మారావుగారి ప్రోద్బలంతో యుద్ధ ప్రచారశాఖలో చేరారు. జస్టిసు పార్టీ అభిప్రాయాలను మన్నించారు.

సరిగ్గా ఇదే కాలంలో సోషలిజం గాలులు తెలుగునాట వీయడం ఆరంభించాయి. మేధావుల మెదళ్ళు పదునుదేరడం మొదలయ్యాయి.

సంఘటిత శ్రామికశక్తుల పోరాటాలూ, విజయాలూ, వైఫల్యాలూ, సరికొత్త ఆర్థిక సామాజికాంశాలకు ఊపిరులూదుతున్నాయి. పాత సామాజిక భావనల కుదుళ్ళు కదలబారడం ఆరంభమైనాయి. జాషువా కవిత్వం మీద వీటన్నిటి ప్రభావాన్నీ పసిగట్టగలం. సామాజికాంశాలతో ఆర్థికాంశాలను గూడా జోడించి చెప్పడం గుర్తించగలం. వీరి ఖండకావ్యాలన్నీ వీటికి దాఖలాలు.

ముఖ్యంగా 1943లో ఫిబ్రవరిలో ఆంధ్ర అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ తెనాలిలో తాపీ ధర్మారావు అధ్యక్షతన జరిగింది.

ధర్మారావు, జాషువా ఇద్దరూ యుద్ధ ప్రచారశాఖ నెల్లూరులో పనిచేస్తున్న కాలం అది. కనుక ఈ మహాసభల వివరాలూ అభ్యుదయ రచయితల ధ్యేయం - శ్రామికశక్తుల పక్షపాతం అన్న విషయం తాపీ ద్వారా జాషువా గ్రహించే ఉంటారు. ఇవన్నీ దృఢంగా నాటుకున్న జాషువా 1943 ఏప్రియల్‌లో రాసిన కాందిశీకుడన్న కావ్యంలో

> "కొడవటి టొక్కెమున్ తలను గూరిచి కార్మిక కర్షకాళితో
> నడుము బిగించె నీయుగమునందొక నూతన సామ్యవాదమ
> న్గడబిడ! దాని దెబ్బకు కకావికలైనది జర్మనీ
> జడనిధి, నేటి మారుపు లసంఖ్యము లంచితముల్ విచిత్రముల్.

అన్న స్పష్టమైన అభిప్రాయానికొచ్చాడు.

దీనికి ముందున్న సంప్రదాయ సాహిత్య స్థితి కాస్త గమనించాలి. 1934 నుండీ రాస్తున్న విశ్వనాథ వేయిపడగలు నవల ప్రథమ ముద్రణ 1939. అప్పట్లో ఆంధ్రపత్రిక ధారావాహికంగా ప్రచురించి ప్రచారం ఇచ్చింది. వేయి పడగల హైందవ నాగరాజును జాషువా మౌనంగా సహించలేదు. వర్ణ ధర్మాల ఉక్కుచట్రం అమలును ఆకాంక్షించే శక్తుల నెదిరించటం కర్తవ్యంగా భావించాడు. జాతీయోద్యమంలో భాగంగా ముందుకొచ్చిన సంస్కరణ ఉద్యమం ఇలాటి శక్తులవల్ల వెనకడుగును వేసే ప్రమాదం ముంచుకురాగలదని పసిగట్టే - జాషువా 1941లో గబ్బిలం వెలువర్చాడు. 20వ శతాబ్దంలో వచ్చిన ఆధునిక తెలుగు కావ్యాల్లో విశిష్టమైంది గబ్బిలం. ఖండకావ్య రచనలో సుమారు 22 సంవత్సరాలు పదునెక్కిన కలం సృష్టించిన అద్భుత ప్రతీకాత్మక కళాఖండం గబ్బిలం.

ఖండకావ్య ప్రక్రియకు, ఊపిరులూది జవం జీవంతో తొణికిసలాడేలా చేసి ఆధునికాంధ్ర సాహిత్యంలో ప్రతిష్ఠాకరమైన స్థానం సంపాదించి పెట్టినవాడు జాషువా.

సామాజిక అసమానతలపై ఏవగింపు, సంస్కరణల ఫలాలు చేతికి అందగలవన్న ఆశ రగుల్కొంటున్న తరుణంలో వర్ణాశ్రమ ధర్మాల పరిరక్షణను సమర్థించే లక్షణాలు ముందుకొస్తున్నవైనం జాషువాను కలవరపరచాయి. హక్కుల సాధనకు ఉద్యమించే తరుణం ఆసన్నమైందని భావించాడు. హరిజనులుగా పిలవబడుతున్న వారిలో చైతన్యం రగిల్చి ఉద్యమించేలా చేసి దళితుల్లో ఆత్మగౌరవ సాధనకై తపించాలని ఊహించాడు. పీడకవర్గాల ముక్కుగుద్ది హక్కుల సాధనా దిశగా సాగిన మహాప్రస్థానంలో జాషువా ఎత్తిన అనల పతాకం గబ్బిలం. ఆగామి యుగంలో దళిత సూర్యుడి శిరసు నుంచిన అగ్ని కిరీటం గబ్బిలం.

జాషువా కావ్యాలన్నీ 3 సంపుటాల్లో నేటి తరానికి అందుబాటులోకి తేవాలన్న విశాలాంధ్ర ప్రచురణాలయం సంకల్పానికి జాషువా ఫౌండేషన్‌వారూ, హేమలతా లవణంగారూ అంగీకరించి తోడ్పడినందుకు కృతజ్ఞులం. గతంలో జాషువా శతజయంతి నివాళిగా విశాలాంధ్ర ప్రచురణాలయం పలువురు ప్రముఖుల వ్యాసాలతో డా॥ యస్వీ సత్యనారాయణగారు సంకలనం చేసిన 'జాషువా సాహితీ ప్రస్థానం' (1995) ప్రచురించింది.

జాషువాగారే అన్నట్టు "సుకవి జీవించె ప్రజల నాలుకలయందు" అన్నది నిజమైనా - మా వంతు బాధ్యతా నిర్వహణలో భాగంగా ఈ మొదటి సంపుటిని పాఠకుల కందిస్తున్నాం. మిగిలిన సంపుటాలు త్వరలో రానున్నాయి.

సాహిత్యాభిమానులందరూ మా ప్రయత్నాన్ని హర్షిస్తూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

డా॥ ఏటుకూరి ప్రసాద్
సంపాదకుడు,
విశాలాంధ్ర ప్రచురణాలయం.

ఫిబ్రవరి, 2004.

జాషువ రచనలు
మూడు సంపుటాల్లో...

	రూ.
1వ సంపుటం	
గబ్బిలం	25
2వ సంపుటం	త్వరలో
స్వప్నకథ, పిరదౌసి, ముంతాజ్‌మహల్, కాందిశీకుడు, బాపూజీ, నేతాజి.	
3వ సంపుటం	త్వరలో
స్వయంవరం, కొత్తలోకం, క్రీస్తుచరిత్ర, ముసాఫరులు, నా కథ రెండు భాగాలు, నాగార్జునసాగర్.	

ప్రతులకు: **విశాలాంధ్ర బుక్ హౌస్‌లు** మరియు
ప్రముఖ పుస్తక విక్రేతలు.

విజ్ఞప్తి

సహృదయులారా!

కాళిదాసుని మేఘసందేశము మనస్సులో నుంచుకొని నే నీ కావ్యమును రచించితిని. గ్రంథనామము గబ్బిలము. శ్రోతల కిది కటువుగా దోచవచ్చును. కానీ అందలి కథానాయకుడు ప్రణయ సందేశము నంపును. ఇతడంపునది తుకతుకనుడుకు నక్రసందేశము. అతని శిక్షాకాలపరిమితి యొక సంవత్సరము. ఇతని శిక్ష ఆజన్మాంతము. తరతరములు. దీని కవధి లేదు. అతడు మన్మథాగ్నితప్తుడు, ఇతడు క్షుధాగ్ని పీడితుడు.

'నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్రహృదయంబు గూడ కొంతవసరంబు'

అని యితడు వాపోవును. కులీనులగు రాజులకువలె హంసలు, చిలకలు మున్నగు నుత్తమ పక్షీదూతలితనికి జిక్కుట అసంభవము. కావున నిట్టిడుల జీర్ణకుటీరములలో నిరంతరము దర్శన మిచ్చు గబ్బిలము నితనికి సందేశహారిగా బరిగ్రహించితిని. రసజ్ఞుల కిందలి యౌచితి సులభగ్రాహ్యము. ఇంట బ్రవేశించి దీపమార్పిన గబ్బిలమును జూచి తన కన్నీటి కథ నీశ్వరునితో చెప్పమని వీడు ప్రార్థించెగాని నిజమున కతని యుద్దేశ్యము దేశారాధన. కైలాస యానమునకు నాపన్నిన త్రోవ కొంత వక్రతకు గురియైనది. ఇది దోషము కాదనుకొందును. ఈ కృతి రసజ్ఞ లోకాదరణ నందిన నా శ్రమ ఫలోన్ముఖము కాగలదు.

నేనీ గ్రంథమును ముగించు నవసరమున గుంటూరు జిల్లా బోర్డు ప్రెసిడెంటుగారును, దేశభక్తులును, కళాభిమానులునగు శ్రీ కల్లూరి చంద్రమౌళి చౌదరిగారు మా యూరు దయచేసి గ్రంథము నామూలాగ్రముగా విని పతిత్వము వహించుట కంగీకరించుట నా యదృష్టము. వారికి నా నమస్కారములు. వారికి నేను కృతజ్ఞుడను.

రెండవ భాగానికి తొలిపలుకు

గబ్బిలము కైలాసమునకు సందేశం తీసికొనిపోయి చిరకాలమైనది. మనపేదవాఁడెదరు తెన్నులు చూడసాగినాడు. వాని సందేశ ఫలితంగా

నాల్గుమూలల నుండి ప్రసన్న వాయువులు వీవసాగినవి. దేవాలయ ప్రవేశం, హరిజనోద్ధరణమని, గాంధీజీ చరకా ఝుంకరణము శ్రవణశుభ గంగాగానము చేసినది. సర్వసమత్వ మను మంత్రరాజాన్ని భరతదేశం వల్లెవేయసాగింది. అరుంధతీ సుతుని నిరాశాకాశంలో, ఆశాతటిల్లతలు మోసులెత్తినయి. తన చిరకాల దాస్య క్లేశాన్ని విస్మరించినాడు. గబ్బిలం తిరిగి దర్శనమిచ్చింది. ప్రపుల్ల వదనుడై తీయని స్వాగతమిచ్చాడు. పండా, కాయా యని ప్రశ్నించినాడు. పండై నదనిప్రకృతి ప్రత్యుత్తర మిచ్చినది. ఆత్మదేశం, ఆత్మభారతాంధ్రజాతిలో గల అనైకమత్యం స్వార్థలుబ్ధత, బహుకుల మతావేశ వ్యాధిపీడ, కాబట్టినితనం నేడవని లోని తీరని వేదనలు తన దాస్యముక్తితోడుగా దేశానర్థకములైన అనేక విషమ సమస్యలతనిని కారింపసాగినయి. తన యిష్టదేవత తన జాతికి కేతన చిహ్నమైన గబ్బిలానికతడు మరికొన్ని చింతాసందేశాలను చెప్పుకొన సాగినాడు. గబ్బిలమా మూలాగ్రంగా ఆలకించింది. నోరులేని పక్షి మారుపలుకుటకు శక్తి చాలని ప్రాణి ఏమని యోదార్పు గలదు? ప్రదక్షణించి కన్నీరుకార్చి, శివాలయానికి తరలిపోయినది. అతని వాక్కులు చావులేనివై, వాయుమార్గమున ప్రతిధ్వనించు చున్నవి. గణబద్ధములైనవి. రెండవ గబ్బిలమను కావ్యమైనిలచినది. నేడుగాక మరొకనాడు ఫలించును. ఫలితమనుభవించు భాగ్యమతని కున్నదో లేదో.

గ్రంథకర్త

Joshua

గబ్బిలం

♦ మొదటి భాగం ♦

చిక్కినకాసుచేఁ దనివిఁ జెందు నమాయకుఁ డెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మరచిపోవు క్షుధానల దగ్ధమూర్తి న
ల్దిక్కులుఁ గల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కఁడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డఁడై

పూఁపవయస్సులో వలసపోయిన చక్కని తెల్గు కైతకున్
బ్రాపక మిచ్చినట్టి రఘునాథనృపాలకుఁ డేలియున్న తం
జాపురి మండలంబునకుఁ జక్కగ దక్షిణభాగ భూములన్
గాపురముండె నప్పరమ గర్భదరిద్రుఁడు నీతిమంతుఁడై

ముప్పు ఘటించి వీని గలిమిన్ గబళించి దేహమున్
బిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగాఁ
జెప్పలు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్ప వడ్డది సుమీ భరతావని వీని సేవకున్

వాని తొక్కల కష్టంబు లేనినాఁడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁ బెట్టు వానికి భుక్తి లేదు

వాని తలఁమీదబులిమిన పంకిలమును
గడిగి కరుణింపలేదయ్యె గగనగంగ
వాని నైవేద్యమున నంటు వడిన నాఁడు
మూఁడు మూర్తులకును గూడఁ గూడు లేదు

పామునకుఁ బాలు, చీమకుఁ బంచదార
మేపుకొనుచున్న కర్మభూమిం జనించు
ప్రాక్తనం బైన ధర్మదేవతకుఁ గూడ
నులికిపడు జబ్బు గలదు వీఁడున్న చోట

వాని నుద్ధరించు భగవంతుఁడే లేఁడు
మనుజుఁ డెట్లు వాని గనికరించు
వాఁడు జేసికొన్న పాపకారణమేమొ
యింతవఱకు వాని కెఱుకలేదు

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరి బుసకొట్టు నాతని గాలిసోఁక
నాల్గు పడగల హెందవ నాగరాజు

కులములేని నేను కొడుకులఁ బుట్టించి
యీ యఖాతమందె త్రోయవలెనె
భార్యయేలఁ బుట్టుబానిసకని వాఁడు
జరుపసాఁగె బ్రహ్మచర్య దీక్ష

ఉదయమాది రక్త మోడ్చికష్టముఁజేసి
యినుని సాగనంపి యిల్లు సేరి
యున్న గంజిఁద్రావి యొక్కనాఁడాపేద
ప్రక్కమీఁద మేను వాల్చియుండె

భూ నభములఁ గ్రొంజీఁకటు
లేనుఁగునకు మదము వోలి యెసక మెసంగె సం
ధ్యా నాట్య కేళి మాని మ
హానటుఁడు శివారవముల నారంభించెన్

ముక్కు మొగమున్న చీఁకటి ముద్దవోలె
విహరణము సేయసాఁగె గబ్బిల మొకండు
దాని పక్షానిలంబున వాని చిన్ని
యాముదపు దీప మల్లన నాఱిపోయె

తిల్లిక నాఱిపి దయ్యపుఁ
బిల్లవలెం దిరుగుఁదబిసిపిట్ట నరయఁగా
బల్లవితమయ్యె నాతని
యుల్లంబునఁ గ్రొత్త క్రొత్త యూహాంకురముల్

చెలిమిన్ బక్షికి విన్నవించుకొనఁజొచ్చెన్ స్వీయవృత్తాంతము
మ్మలికన్ గందిన నెమ్మనంబున మదోన్మత్త ప్రపంచంబులోఁ
బులుఁగుంబుట్రలుఁగాకఁ బేదలకు నాప్తుల్ చుట్టపక్కంబులు
న్గలరే వానికవోష్ణ బాష్పములు వ్యాఖ్యానించ జక్రాంగనల్

ప్రవిమల దేవతాభవన వాసముచేయుచు మమ్మువంటి మా
నవులకు లేని గౌరవమునం దులదూఁగెడు గబ్బిలాల రా
ణివిగద నీవు స్వాగతము నీకు శుభంబకదమ్మ నీతనూ
భవులకుఁ దల్లక్రిందుల తపంబులకున్ గుడి గోపురాలకున్

గాఢనిద్రావలంబియై కన్ను మూసి
క్ష్మాతలము మేను మఱచిన కాళరాత్రి
నా గృహంబున వెదకుచున్నా వదేమి
దొరక దిచ్చట నానంద కిరణ లవము

నిన్ను బహిష్కరించు నవనీవలయం బిది యంటరానివాఁ
డున్న నిషిద్ధగేహము సహోదరి నీవు సమస్త దేవతా
సన్నిధి నారగింతువు ప్రసాదము లంతటి పుణ్యురాలివై
యన్నములేని పేదల గృహంబులు సొచ్చితివేల బేలవై

హృదయములేని లోకముసుమీ యిది మాపులఁ బశ్చిమంబుగా
నుదయము తూర్పుగా నడచుచుండు సనాతనధర్మ ధేనువుల్
పిదికిన పాలు పేదకు లభింపవు శ్రీగలవాని యాజ్ఞలోఁ
బెదవిఁ గదల్పఁజాల రరవిందభవ ప్రముఖామృతాంధసుల్

ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుఁగాని దుఃఖితమతు లైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్ప దీ భరతమేదిని ముప్పదిమూఁడుకోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తు లాఱునే

పరమార్థంబులు బోధసేయుదురు లోభ స్వాంతులై నిత్యమున్
గురువుల్ ముక్కుకుసూటిగాఁదగులు యుక్తుల్పన్ని కైవల్యపుం
దెరువుల్సూపి మహాపరాధివనుచున్ దీర్మానముల్ సేయుచుం
దురు వేదాంతరథంబు సాగదనుకొందున్ నేను లేకుండినన్

ఒగిసంసారము దిద్దుకొంచుఁ గర మత్యుచ్చస్థితిం దూఁగుచుం
బగలెల్లన్ మునివృత్తినుండి యనుకంపన్ శర్వరీ వేళలన్
వగలందూలు దరిద్రమూర్తుల సమాశ్వాసింపనేతెంచితే
ఖగసన్యాసిని! యర్థ్యరాల వకలంకంబైన మర్యాదకున్

గిరుల గుండెలు కరిఁగి నిరర్థములట్టు
లుబుకుచున్నవి దిశల నన్నూఅడింప
బక్షికళ్యాణి, సోదర ప్రజలకండ్ల
నిర్గమించెనె యొక్క కన్నీటిచుక్క

చుట్టాలేగద వాలఖిల్యు లిన తేజుల్యోగవిద్యానిధుల్
పుట్టుందాపసు లార్ద్రచిత్తులు మహాత్ముల్ వైనతేయ స్తుతిన్
జెట్టుం గొమ్మఁ బరిత్యజించిన పరశ్రేయశ్శుభాకాంక్షు లో
పిట్టా: నీకు నమస్కరించెదను నా విజ్ఞప్తి నాలింపవే

ఈ ప్రశాంతరాత్రి యెల్లలోకంబును
బుజ్జగించి నిద్రఁ బుచ్చుకొనియె
నౌషధంబులేని యస్పృశ్యతాజాడ్యు
మందభాగ్యు నన్ను మఱిచిపోయె

కర్మసిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నాభుక్తి ననుభవింత్రు
కర్మమననేమొ దాని కీ కక్ష యేమొ
యీశ్వరునిచేత ఋజువు చేయింపవమ్మ

ఆలయంబున నీవు వ్రేలాడువేళ
శివుని చెవి నీకుఁ గొంత చేరువుగ నుండు
మౌని ఖగరాజ్ఞి, పూజారి లేనివేళ
విన్న వింపుము నాదు జీవిత చరిత్ర

ఆపూజారులు విన్న నీకగును బ్రాయశ్చిత్త మీశానుఁడున్
గోపించున్ వివరింప నేమిటి నీకుం బొమ్ము వార్థక్యమున్
దాపై పెంజెడ దెల్లనై నది నిశీధస్త్రీకి నాఖేటక
వ్యాపారంబు ముగించి నీ పొరుగు గూబల్గొండ్లకున్ బోయెడిన్

పసమించు నీ గరుత్తుల
విసరి శ్రమంబడపి నన్నుఁ బ్రేమించిన నీ
యసమోపకారమునకుం
బసదన మిడలేక నే బుణస్థుఁడ నైతిన్

నీనమస్కారముల నిక్కి నిక్కి నడవఁ
బక్షిణీ నాకు నుద్యోగబలము లేదు
మెచ్చుఁదగు నీ కళాశక్తి నుచ్చరింప
ఖగసతీ! నాకుఁ గులము యోగ్యతలు లేవు

స్వార్థమున నిన్నుఁ గొఱముట్టుపలె గణింపఁ
గడుపునిండిన భాగ్యవంతుఁడను గాను
దోషములు సూపి నీకు నీతులు వచించి
దొరతనము సేయఁగా మతస్థుఁడను గాను

మృగపక్షిత్వ విచిత్రధర్మములు మూర్తిన్ దాల్చియున్నట్టి నీ
మొగముం జూడదు లోక మట్టి శకునంబుల్ ప్రాతపట్టింపులు
న్దగవీ పేదకు రమ్ము గబ్బిలపుచానా నాదు స్వాంతంబులో
దిగులుంబాపి పినాకపాణి కొక సంచేశంబు నందింతువా

ధర్మమునకుఁ బిరికితన మెన్నఁడును లేదు
సత్యవాక్యమునకుఁ జావు లేదు
వెఱవనేల నీకు విశ్వనాథుని ప్రోల
సృష్టికర్త తాను సృష్టి వీవు

నరునకుఁ జేరరాని సదనంబున వాసము సేయు నీశ్వరే
శ్వరునకు నానమస్కృతు లుపాయనమిమ్మొకవేళఁ గారణాం
తరముల వెండి పర్వతమున న్నివసించుచు నున్నఁ బక్షిసుం
దరి యొకపూట యానమకదా యిది నీకుఁ బరోపకారిణీ

గౌరీనాథుఁడు కాశికిం జనెడు మార్గంబందు రా మేఘపుం
జాఱున్ జుక్కలతోఁట నాటుకొని మింటన్నీకుఁ గన్పట్టు నా
దారిం బొమ్మొకవేళఁ జూచెదవు భూతస్వామిని న్నీకుఁ జ
త్వారం బేర్పడి దారిఁ దప్పెదవుగాదా భానుఁడేతెంచినన్

ఛత్రములవంటి నీలి పక్షములు విచ్చి
నీవు బ్రహ్మాండమునఁ బయనించు వేళఁ
జిత్తజల్లుల ముమ్మాయి ముత్తియములు
జలధరస్వామి నీమీఁదఁ జల్లఁ గలఁడు

మొలక సంధ్యారాగమునఁ గెంపు లెగఁ జిమ్మఁ
జరమాచలంబునఁ జరణమూఁది

సెలయేటి నీట నీతఁలు గొట్టి విహరించు
మరుదంకురముల సన్మానమంది

కొండకొమ్మల నెదుర్కొని తుత్తునియలైన
తోయదమ్ముల మీఁదఁ దుఱంగలించి

కలహంస పొదిగి పిల్లలుసేయు మిన్నేటి
జొంగలంబుల మీఁద సంచరించి

చిలుక లెంగిలింపఁ జిటిలి తేనియలూరు
స్వాదుఫలము లెలమి నారగించి
కొన్ని నాళ్ళపాటు కుటిల సంసారంబు
దిగులు మఱచి రమ్ము ఖగ వధూటి

సాత్వికాహారిణీ తపశ్చర్య కతన
నీ మనంబున జాలివెన్నెల రహించు
నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్రహృదయంబుఁ గూడఁ గొంతవసరంబు

బిడ్డల గని పాలిచ్చెడు
దొడ్డతనంబున్న పుల్గు దొరసానివి నా
కడ్డుపడ దిగిన వేలుపు
గిడ్డివి నా మనవి నాలకించెదవు గదా

నీయౌదార్యగుణంబు మెచ్చెదరు సందేహంబు లేకుండగా
నాయుష్మంతులు నీ కుమారులు మగండంగీకృతిం జూపి నీ
వాయెత్తైన నగంబు కొమ్మల విహాయ స్కేశు నావాసమం
చూయేలూగి కృతార్థురాలవయి రమ్మో పుల్గు పుణ్యాంగనా!

పక్షిసుందరి ని చిన్ని కుక్షి నిండ
నిన్ని నీరంబుఁ బలహార మున్నఁ జాలు
నెన్ని దేశాలు తిరిగిన నేమి నీకు
నీవు నావలెఁ బుట్టుబానిసవు కావు

తడవైనన్ గుడి గోపురంబులను సందర్శించుచుం బొమ్మ నీ
కడవుల్ కొండలు నడ్డు సేయవుగదమ్మా వ్యోమయానంబునన్
సుడిగాల్పు ల్సెలరేఁగినన్ నిలువవచ్చుం ధర్మసత్రాలలోఁ
బిడుగుల్ వడ్డఁ బ్రవేశయోగ్యతలు పాపిన్నాకు లేవచ్చుటన్

అందందు ఫలవనంబుల
విందుగుడుచు చల్ల నల్ల విశ్రామ మణి
మందిరముల నిద్రించుచు
ముందుకుఁ జనఁదోఁచు నెన్నొ పుణ్యస్థలముల్

కొమరారు దంజనగరము
సమీపమునఁ గలదు తెలుగు సౌరభ్యంబుల్
గమ గమ వలచిన చోటది
యమరున్ రఘునాథరాజు నాస్థానంబున్

కృష్ణరాయలవారి యెడఁబాట్లు చీకట్లు
ముసరి దిక్కులలోన మసలువేళ

భూరి వాఙ్మయలక్ష్మి దారిబత్తెముతోడఁ
దంజాపురమువంకఁదరలు వేళఁ

వేంకటకవి తెల్గు పంకేరుహాక్షికి
శ్లేషోక్తు లలవాటు సేయువేళఁ

బచ్చ పచ్చని ముద్దుపళని ముద్దుల కైత
శృంగార రసము వర్షించువేళ

మువ్వగోపాల దేవుని పూజసేయ
ఘనుఁడు క్షేత్రయ కలమందుకొనినవేళ
నపరరాయలు రఘునాథ నృపతి విభుఁడు
కట్టుకొన్నాఁడు సత్కీర్తి కుట్టిమంబు

తనువుప్పొంగ సరస్వతీమహలు సందర్శించి తంజాపురీ
మనుజాధీశుల యోలగంబును పరామర్శించి పొమ్ముత్తరం
బునకున్ ద్రావిడభూములం గడచి పోబోదోచెడిన్ వాఁడువా
అని శౌర్యంబుసుమించుఁ దెల్గు పొలిమేరల్ నేత్రపర్వంబుగన్

యతియుంబ్రాసయులేని సంస్కృత కవిత్వారణ్యమందున్న భా
రతవేదానఁ బదేనుపర్వముల కాంధ్రత్వంబు నేర్పించి శా
శ్వతుఁడై పోయిన తిక్కయజ్వకు నివాసంబైన నెల్లూరికిన్
నతులర్పింపుము స్నానమాడు మతి గణ్యంబైన పెన్నానదిన్

ఒకపల్కు జాణతనమున
సకియలు నెల్లూరుసీమ సత్కవి వరులం
దికమకలు పెట్టఁగలరని
పుకారు గల దది యబద్ధమో నిక్కువమో

హంపీక్షేత్రముఁ జూచి పోవలయు నమ్మా తెల్గురాజ్యంపునై
లింప శ్రీల కొకానొకప్పుడది కేళీరంగ మేతద్రమా
శంపావల్లరు లాఱిపోయిన బ్రదేశంబందు నీ బందుగుల్
కొంపల్గట్టి నివాస ముండెదరు నీకుం గూర్తు రానందమున్

పరదాపద్ధతి మాన్పిరో సిరికిఁ గుప్పల్ వోసి యంగళ్ళ యం
దురుమాణిక్యము లమ్మినారచట మున్నోపక్షిణీ మూరురా
యరగండండు మహేంద్ర వైభవముతో నాంధ్రక్షమామండలి
న్బరిపాలించిన నాఁటి పెంపును దలంపన్ మేను గంపించెడిన్

పగతు రసూయచేతఁ గరవాలమునన్ దనువెల్లఁ జెండినన్
జిగిరిచియున్న యుగ్రనరసింహుని భీమదృగంచలంబులన్
బొగలుడివోవలే దతని మ్రోల నిమేషము నిల్వజాలినన్
ఖగసతి నిన్నుధైర్యవతిఁగా గణియింతురు వీరయోధులున్

ఏనికవంటి సానువు గణేశుని నున్నని బొజ్జమీద గా
లూనఁగ లేదు తుమ్మెద తదుజ్జ్వలశిల్ప మఖండ తుంగభ
ద్రానది కప్పగించుకొని దద్దమలైన తెలుంగువారి వి
ద్యానగరాన జిందు మొక యభ్రకణంబు నుపాయనంబుగన్

సరసుఁడు కృష్ణ భూవిభుఁడు స్వారియొనర్చిన పారసీహుమా
దొరల ఖురాగ్రహల్యలను దున్నిన భూములలోన నాంధ్రసుం
దరు లొకనాఁడు నాటుకొనినారు దిగంత జయప్రరోహముల్
గరిసెల నించినా రురువుగా ఫలియించిన సుప్రతిష్టలన్

మూరురాయరగండఁ డూరేగ డీనాఁడు
విద్యానగర రాజవీధులందు

మేలైన పట్టుడేరా లెత్త రీనాఁడు
పారసీక గుఱాల బేరగాండ్రు

ఇనుపరోకళ్ళ సాధన సేయవీనాఁడు
కొమ్ము నిక్కిన భద్రకుంజరములు

తెలుఁగు స్కంధావారముల నిండదీనాఁడు
మరఫిరంగుల తెల్లదొరల దండు

మణిమయంబైన యాంధ్రసామ్రాజ్య రథము
భువికిఁ గ్రుంగిన పదియునాఱవ శతాబ్దిఁ
గృష్ణవిభు వీటఁ బ్రొద్దు గ్రుంకినది మొదలు
ఋషిఖగాంగన తెల్లవారినది లేదు

కంచర్ల శ్రీకృష్ణ గంధర్వుఁ డేలిన
నగరంబు దున్నించి నారు వోసి

వినుకొండ విభుని రాయని భాస్కరుని కోట
బురుజులూపున నేలకొఱగఁదన్ని

పల్నాటిదొరల శుంభత్ప్రతాపజ్వాల
సాటి కెక్కని నాగు లేటఁ గలిపి

వినుతిఁ గాంచిన కొండవీటి సామ్రాజ్యంబు
నుక్కుకత్తుల బావి కొప్పగించి

యుడుకు నెత్తుటఁ జేతులు కడిగికొన్న
కాలపురుషుని పెను దుండగములు దలఁచి
మనసు నలిగిన గుంటూరు మండలంబు
నరసి పోవమ్మ జన్మ ధన్యత వహింప

ప్రొద్దునకు వన్నెఁ బెట్టిన
యిద్దఱు భాస్కరులు పుడమి నేలఁగ సొగసుల్
దిద్దినది మేన వయసునఁ
బెద్దది గుంటూరు సీమ పెఱ సీమలలో

ఖరుచైపోయెఁ దెలుంగు రక్త మతిలోక స్వచ్ఛశౌర్యంబు సో
దరి! వ్యర్థంబగు కోడిపందెపు తగాదాలందుఁ బల్నాటిలో
నరుదారన్మివిలె న్వినోదముగఁ గార్యంపూడి తిర్నాళ్ళ త
త్కరవాలంబులు త్రుప్పుపట్టి యిపుడున్ గల్పించు నారాటమున్

కృతులంది కృతు లొసంగిన
వితరణ రతులైన కొండవీటి నృపుల యు
న్నతియుం బతనం బిప్పుడు
కృతులై కొండల నలంకరించి జితించెన్

విసిగి విరక్తిచేఁ దెలుఁగు వీధులలో నొక పిచ్చివానిగా
మసలిన రెడ్డిరాజు మునిమాన్యుఁడు వేమన యాశుధారగా
విసరిన కావ్యముల్ శ్రవణ పేయముగాఁ బ్రతిశబ్దఁ మీనెడిన్
దెసల నలంతి పోలికలఁ దీయఁదనంబున భావసంపదన్

జలదవ్రాతము తోఁడుగా యవలఁ గృష్ణాతీర దివ్యస్థలుల్
గలయంగ్రుమ్మగ సాగిపొమ్ము కవిలోకబ్రహ్మ నన్నయ్యకున్
నిలయంబై తగు రాణ్మహేంద్ర పురికిన్ విద్వత్సభారంజిత
స్థలికిన్ బూర్వచళుక్యభూపతుల రత్నస్థాపితాస్థానికిన్

ఎచ్చటఁ జూచినన్ బ్రతిపదించు కళంబలెఁ బచ్చపచ్చగా
రచ్చలకెక్కు గన్నడ సరస్వతి నారయ మానసంబులో
మచ్చరకించి నన్నకవిమాన్యుఁడు రాజమహేంద్రునానఁ దా
నిచ్చటఁ జేయిజేసికొనియెన్ బ్రథమాంధ్రకవిత్వ సృష్టికిన్

రెండున్నర పర్వంబులు
పిండిన రస మొలుకునట్టి పెను జెఱుకుగడన్
బాండవుల చరిత నన్నయ
పండించెన్ దెలుఁగులోనఁ బ్రజ్ఞాన్వితుఁడై

జనవిభుండైన విష్ణువర్ధనుని నాఁటి
గౌతమీగంగ నీకు స్వాగత మొసంగు
వీరమాగాణముల నుద్భవిల్లునట్టి
గఱికపోచయు నాకర్షకమ కదమ్మ

తొలి సారంగధరుండు వట్టి యపవాదు న్నెత్తిపైఁదాల్చిక
త్తుల్లపాలైన విషాదగాథ వినలేదో నీవు చిత్రాంగి మే
డలలో మూలుగుచున్న విప్పటికిఁగూడ న్నావురాల్ నీతికిన్
బలియైపోయిన రాజనందనుని దౌర్భాగ్యంబు నూహింపుచున్

అజ్జాయింతువొ చుట్టుమార్గమని ద్రాక్షారామ భీమేశ్వరుం
డుజ్జీలేని దయాస్వభావుఁడు ప్రభావోల్లాసి ముప్రొద్దులున్
గజ్జంగట్టెడి నాట్యగాఁడతఁడు సాక్షాత్కారమున్ జెందినన్
మజ్జాత్యుద్ధరణంబుఁగల్గ గలదమ్మా పొమ్ము సేవింపఁగన్

నిద్దంపు లేఁత కస్తురి
ముద్దవనుచు నిన్నుఁజూచి ముచ్చటపడి రా
ముద్దియలు ముచ్చటించెద
రొద్దిక శ్రీనాథకవి బహూకరణముగన్

అరవింద రత్న మండిత
తరంగరథ మెక్కి విభుని దర్శనముకై
పరువెత్తుచున్న గోదా
వరితోడుగఁ బొమ్ము దక్షవాటి నగరికిన్

అమృతమ్ము విషము వాక్కున
నమరిన కవిరాక్షసునకు నావాసంబై
కొమరారు నపరకాశిక
సుమి కడు మహిమాఢ్యమైన చోటది పతగీ

అల బుస్సీ దొర కొల్లగొటిన యనన్యంబైన మావెల్మవీ
రుల విఖ్యాతపరాక్రమజ్వలన మూర్పుల్ జిమ్ముచున్నట్టి బొ
బ్బిలి కోటం గని దాటిపొమ్ము చటులావేశంబు దేహంబునన్
మొలుచున్ బొల్చు కపోష్ణవీర రుధిరంబున్ జీవనాళంబులన్

నాయెడ జాలిలేక చరణంబునఁ గత్తులు గట్టి ప్రాణముల్
దీయఁదొడంగు రాజవితతిం దెలవార్చితిఁ దెల్లవారునే
నాయులివాలకింపని యనంత విభావరులంచుఁగొక్కురో
కోయని కూయుచున్న దదిగో తొలికోడి బడాయికొట్టుచున్

పూసపాటివారి ముఖ్యపట్టణమైన
విజయనగరమందు విశ్రమించి
జగము దద్దరిల్ల సకలించినది తొల్లి
రాయరావు తుల గుఱాలదండు

కరవాలంబునఁ గొల్చి రాయలు పరిష్కారంబు గావించుచున్
సరిహద్దుల్ సవరించినాఁడటు లొరిస్సాదాఁక ఆరాజభా
స్కరుఁడెత్తించిన బొట్టునూరి విజయస్తంభంబుపై వేలుపుం
దెఱవల్ నిల్చి పఠింతు రాంధ్రులవిభూతిన్ ముక్తకంఠంబులన్.

నీవు బొబ్బిలి మీఁదుగా నిర్గమించి
మన్యము తరించి కొన్ని యామడలు నడువ
పలుచఁబడిపోవు మన జిల్గు తెల్గు శోభ
తావు లెగజిమ్మ నోడ్ర వాతావరణము

తేటయైన తీపినీట దిక్కులదాఁక
విస్తరించి రుచులు గుస్తరించి
చిల్కసంద్ర మింపుసేయుచుఁ గన్పట్టు
స్వచ్ఛమైన తెల్గు భాష వోలె

చిట్టి మరు దంకురంబులఁ
బుట్టిన కెరటాల మొత్తములు తీరములన్
గొట్టుకొని మరలిపోవును
గట్టులెగయఁ జూచు చిలిపి కవనములవలెన్.

తగులు న్నీకట మార్గమధ్యమున బౌద్ధస్తూప శైథిల్యముల్
మగధోర్వీశుల రాణివాసములు లీలాభర్మ హర్మ్యావళుల్
జగములెల్మిచ్చిన శాక్యసింహుని యహింసాసూక్తి మాధ్వీక ని
మ్మగలం దేలిన పుణ్యభూములు నలందా పాటలీ పుత్రముల్

ముక్తి దంబులైన పుణ్యస్థలములందుఁ
బ్రధమగణ్య మమ్మ వారణాసి
అన్నపూర్ణసేయు నాహారభిక్షతో
ముక్తిభిక్ష నీకు ముట్టగలదు

నదుల తోడికోడలు దధీశు పెదభార్య
జాహ్న వీ స్రవంతి జలము దేర
అతిథి పూజసేయ నన్నపూర్ణాదేవి
వారణారిఁ గూడి వారణాసి

కలరు కళాసముద్రములు గట్టులు రాయగ నీదినట్టి ధీ
విలసితులైన పండితులు పెక్కురు వేదపురాణ శాస్త్రముల్
బలికిన సత్కవీశ్వరుఁడు వ్యాసమునీంద్రుడు శిష్యకోటితో
మెలగెఁ నొకప్పుడుండు నట మేచక కంఠుఁడు విశ్వనాథుఁడై

మొగలాయి చక్రవర్తుల
మృగాంక కేతనము నింగి మెఱసిన ఢిల్లీ
నగరంబు దృష్టి గోచర
మగు ప్రోన్నత సౌధచుంబితాంబోధరమై

ఆ ఢిల్లీపుర హస్తినాపురి సమాఖ్యన్ ద్వాపరంబందుఁగొం
డాడుం బడ్డది ధర్మజుండచట రాజ్యంబేలి చేయించినా
డీడుం జోడును లేని జన్నముల నెన్నేఁ గన్నులున్నందుకున్
జూడన్ దగ్గ పురంబు సుమ్మచట వీచున్ భోగసౌరభ్యముల్

ముడిచె నిచ్చట కుంతి కొడుకు ద్రౌపది కొప్పు
పగవాని రుధిరంబు పరిమళింప

మెఱసెనిచ్చోట నాదరుషా కుతారంబు
నిఖిల భారతము కన్నీరు సుంప

వెలసె నిచ్చోట పచ్చల బర్హిపీఠంబు
షాజానురాజునాస్థానవాటి

పెండ్లాడె నిచ్చోట పృథ్వీశ్వరుండొక రోజు
జయచంద్రు సుతను దొస్సార గరిమ

యుగయుగాల కథల నుదరాన జీర్ణించి
రాజరక్త నిర్ఝరములఁ దేలి
నవ్వుచున్న ఢిల్లీ నగరంబు నందంబు
తరుగులేదు శిరము నెరయ లేదు

సులతానీ సులతానులన్ మణిగణాంశుల్ దట్టమిట్టాడుమే
డలలో వాసము చేసినారు నిజరాష్ట్రంబాకటుందూలఁబే
దలనోరూర భుజించినారిచట ముక్తారత్న పాత్రంబులన్
గలమాన్నంబు సుఖించినా రఖిల భోగశ్రీ మహాడోలలన్

కుతుబుద్దీనుడు నిల్చిన
కుతుబుమినారనెడు గొప్ప గోపురము సము
న్న తమయ్యుఁ జెక్కు చెదరదు
శతాబ్దములనాఁటి శిల్ప చకచకితం బై

చామనచాయ గలట్టిది
కామజనకు ననుఁగుభార్య కాళింది వినీ
లామ కోమలవీచీ
చామరములువీచి నీకు స్వాగతమిచ్చున్

సూనుని కాయిలా తనకుఁ జొప్పడు లాగు నమాజుజేసి య
ల్లానలరించి యాదిమొగలాయి నరేంద్రుఁడు బేబరుండుమా
యూనున కాయురున్నతులు సృష్టియొనర్చిన చిత్రగాథ ఆ
గ్రానగరంబు కర్ణ శుభగంబుగ నీకు నుపస్యసించెడిన్

షాజాను నత్రజలకణ
మీ జగముపురంద్రి దాల్చు నేడవ నగ ముం
టాజమహలు నిద్రించెడు
తాజమహలు దృశ్యమద్భుతంబు పతంగీ!

కుహనా గోపుం డాగమ
రహస్యమగు గీత బాహిరము చేసిన శ్రీ
మహిత కురుక్షేత్రంబున
విహార మొనరించి పొమ్ము విహగవధూటీ

సు నస్తుత్యుఁడు బోధిసత్వధరణీశుండర్ధరాత్రంబునన్
నిజవాసంబుఁ బరిత్యజించి యతిశాంతి స్థాపనేచ్ఛా మనో
బుజుఁ డై బిచ్చఁ పుగిన్నె ఁదాల్చిన మహాపుణ్యప్రదేశంబులన్
మజిలీ సేయుము రెండునాళ్ళు ఖగభామా! జన్మసిద్ధించెడిన్.

లుంబినీ వనపరిమళోల్లసిత మగుచు
నేఁగుదెంచెడు నీకర్ష్ణ మీయఁ గలదు
గౌతముం డాదరించిన కనకహంస
నీరు గలియని మధుర గోక్షీరధార

దర్శింపగలవు గౌతమబుద్ధదేవుని
ప్రాచీన భరత శిల్పంబునందు

సాధింపఁగల యహింసా మంత్రరాజంబు
శాక్యసింహుని కాలి జాడలయందు

తెలిసికోఁగలవు బౌద్ధుల సాహితీ సేవ
అమరసింహుని కవిత్వమునయందు

వీక్షింపగలవు కపిలవస్తు నగరంబు
నాశన దేవ్యధీనంబు నందు

రెండువేలేండ్లు క్రింద నిద్రించుచున్న
మౌర్యరాజుల విపుల సామ్రాజ్య చరిత
యేకరువు పెట్టు ప్రకృతి యం దాకళించి
వెచ్చ వెచ్చని కన్నీరు విడువఁగలవు

అక్కడనుండి యుత్తర దిశాభిముఖంబుగ నిర్గమించు నీ
దృక్కుల నడ్డుచున్ హిమగిరీంద్రము దర్శనమిచ్చు దానిపై
నెక్కగనెంచి తెల్లదొర లీలిగిరెందరొ! వారి దేహముల్
స్రుక్కవు నేఁటికిం బులుఁగు సుందరి మంచుమహత్త్వ మెట్టిదో

కరఁగిన మంచు బండలు ప్రగాఢభరంబునఁబట్టుదప్పి, త
ద్గిరి శిఖరాల నుండి తలక్రిందులుగా దిగజారి లోయలన్
దిరిగెడు జీవరాసుల వధించుచు నుండును పేదవారికిన్
జెఱుపె కదా! బలాధికుల నేయము సంయమి పక్షిభామినీ!

అందు నెవరెష్ట శిఖారన నధివసించి
వ్రాసికొనవచ్చు భరత వర్షంబు పటము
దాని యున్నతి తారకాధ్వజము మిగులు
సులలితములైన కవుల యూహలకుఁ దఱుగు

కలహంసల్ సనువాయుమార్గముల రేఖల్ పర్వతాగ్రంబునన్
గలవాత్రోవల దక్షిణోత్తర దిశాగ్రవ్యాప్తముల్ ప్రొన్నతం
బులు నీకుం జన గాదు నిచ్చలు నిలింపుల్ గుంపు లై రాకపో
కలు గావించెడు వెండి కొండ వెరవుల్ గన్పట్టు నైమూలగన్.

విహిత కైలాసయాత్రగావించు నిన్ను
మంచుకొండల విభుఁ డాదరించఁగలడు
అల్లునకుఁ గూతుఁనకు వార్త లంపునేమొ
సమ్మతింపుము నుడులు భారమ్ముగావు

అస్త్రవిద్యాభ్యసన వేళ నద్భుతముగ
కొంచకొండకు రంధ్రంబు గొట్టినాఁడు
చిన్నతనంబున బార్వతి చిన్న కొడుకు
తారకాగిరి కదియ యుత్తరపు గవిని

గిరుల మగవాని చెలిమి వ్యక్తీకరింప
మస్తమునఁదాల్చు మొక చిన్ని మంచుతునక
వినపుమేతరి కది సిఫారసుగ నుండు
వ్యర్థములుగావు పెద్దల పరిచయములు

మంచుఫలించు నగ్గిరులమాడులఁగాఱు మొయిళ్ళపై నుడా
యించు గమింపు మవ్వల మహేంద్రుని వీడు త్రివిష్టపంబు గ
న్పించు డలాయిలామలను వింత నృపుల్ పరిపాలనంబు సా
గించెద రిప్పు డచ్చరలు క్రీడ యొనర్పరు నందనంబునన్

ఆలామాలకుఁ బెండ్లి పేరటము లే దాజన్మసన్యాస దీ
క్షా లగ్నాశయులై ధరింతు రతి దీర్ఘంబైన కుళ్ళాయముల్
మౌళిన్ వారి యనుజ్ఞలేక విహరింపంబోల దెవ్వారి కా
నేలన్ బక్కివి నీకుఁ బోదగని క్లోణీమండలం బుండునే

ఆ రాజ్యంబును గూబపట్టుకొని బిట్టాడించుచుండున్ దురా
చారంబుల్ వెడ నమ్మకాల కది వాసస్థాన మస్పృశ్యతా
క్రూరవ్యాఘ్రము సంచరించుటకు సంకోచంబులే దైన బౌ
ద్ధారామంబులు సాగనీయవు గదమ్మా! దాని యౌద్ధత్యమున్

అసమ రుచిరాంబువైన మానస సరస్సు
కన్న కూఁతురు బుడుత గంగాభవాని
యెక్కి దిగుచుండు కొండల చక్కఁదనము
ప్రేక్షణీయంబు సుమ్ము గబ్బిలపుదేవి

బలిసిన మేనులన్ జడల బళ్ళెల కొమ్ముల వింత సింహముల్
బలె విహరించుఁ కొండల యుపత్యకలన్ సెలయేటినీళ్ళ గ్రో
ల్పులుల కళేబరా లచటి లోయలలో బొరలాడు వాని య
మ్ముల కెనయైన శృంగముల పోటుల దూటులు బడ్డపొట్టలన్

జడనిధివంటి మానసము సాటికిరావు సరస్సులెల్ల నం
దుడుగక రేఁగు పేరలల యూపున గట్టులఁదాకి ప్రాణముల్
విడిచిన గండు చేపలుఁ గుళీరము లెల్లడఁ దీరభూములం
దడుగిడరాక చీకి వికలాంగములై పడియుండు గుట్టలై

దమయంతీ నలులకు దౌ
త్యము చేసిన తొంటి పసిఁడి హంస విభుని చు
ట్టములందు పంకజోద్యా
నములందున నాలపింత్రు నైషధ కథలన్

నిండిన దోరవెన్నెలల నిక్కిన పచ్చిక మేసి, చాందినీ
కొండబయళ్ళలోఁ దిరుగు గోపతి నీకగుపించు నందు వే
దండవిరోధి దాల్చి జటులాటవిఁ బూచినపూవు చంద్రమా
ఖండము గోచరించు నెఱుకల్గల నీ కెఱిగింప నేఁటికిన్

విలు నమ్ములఁ ధరియించి చెంచులు తదాభీలాటవీమధ్య భూ
ముల గన్పట్టిన నంజలింపుము మహాత్ముండైన భర్గుండు భ
క్తుల కిష్టార్థము లీయఁగోరిన గణస్తోమంబుతో మాయ పం
దుల వేఁటాడుచు భిల్లుడై నరుల కన్నుల్ గప్పి క్రీడించెడిన్

అచ్చోటి తబిసి రాజులు
నిచ్చలుఁ దపమాచరించు నీ కాతిథ్యం
బిచ్చెదరు పరుల విద్యలు
మెచ్చెద రీ గుణము నేఁడు మృగ్యంబ కదా

ఇప్పటికిఁ గూడఁ గ్రొంబొగ లెగయుచున్న
త్రిపురముల ప్రాఁత బూడిద దిబ్బ లచటి
కనతి దూరాన నీకుఁ బ్రత్యక్ష మగును
చిత్రముగ పానమున కెంత చేవ గలదొ

వలరాజు పగవాని గొలచి ముందుకు సాగు
తొలకరించిన నీలి జలధరంబు

మహిషుని వనిత లుమ్మలికింప గర్జించు
సితికంఠు నిల్లాలి సింహరమణి

కొసరి దిక్కులు మేలుకొలిపి గానము సేయు
కొమరుసాముల వారి కోడిపుంజు

తలఁమీద రతనాలు మొలిచి ముద్దులుగార
నటియించు సర్పంబు నటకురాలు

కనులఁ జూచి రమ్ము కైలాసభూముల
వింతలెల్లఁ దెలుప వేళకాదు
నీకు శుభము గల్గు నిఖిలామరశ్రేణి
సరసుఁడమ్మ బాలచంద్ర ధరుఁడు

రేగిన గంధపుందరు పరీ మళముంగని మోసపోయి యం
దాగి పదంబుమోపవల దచ్చట కొమ్మల నాశ్రయించి మి
న్నాగులు తాండవించు మరణంబును బుక్కిటఁబట్టి యాపదల్
డాగిన తావులే వలపులం దొణికించి మనస్సు నీడ్చెడిన్

పుడమి ననంతకాల రథమున్ గదలించి మనుష్యకోటిపై
నడిపి నశింపఁ జేయు యతనంబులు నీ బెదరింపు లిచ్చటన్
జడవని రుండమాలికలు పండ్లిగిలించి వెడంద నోళ్ళతో
మృడుని గళంబునన్ జెనటిమృత్యువుతో వెకసక్కె మాడెడిన్

ఒలికిపోయిన పండువెన్నెలల పాలు
క్రోలుచున్నది తపిత చకోరకంబు
ప్రొద్దువోయెను నీ చిన్న భోజనమును
వెదకికొనఁ బొమ్ముతబిసి గబ్బెతల రాణి

వీనులు చిన్నవోవ వినిపించు నదే డబుడుక్కువాని ధ
క్కా నినదంబు తూరుపు ముఖంబుగ హైందవవీధి సభ్యతా
స్థానముగల్గు తాను మన సఖ్య మెఱింగినఁ గంటగించు నో
మౌనిశకుంతమా చను ముమాపతి మేడకుఁ గోడి గూసెడున్

న న్నొకమారు నీ దరిసెనంబున దేల్చినవాఁడు ధన్యునిగ జేసి భర్గుఁడే
మన్నది చెప్పి పొమ్ము విబుధాలయ వాసిని నాకు లేరు నీ
కన్న శరణ్యు లాప్తులు వికాసితమైనవి తూర్పు రేఖలున్
కన్నఁపు దొంగతోడ సదనంబునకుం జనుమమ్మ పక్షిణీ

ద్వారములు లేని నాదు కుటీర లక్ష్మి
స్వాగతం బిచ్చి నీకు మర్యాదచేయు
నా యనుజ్ఞకు వేచియుండంగ నీకు
వలదు వలదమ్మ రాత్రిం దివంబులందు

నిద్దుర మేల్కొని యల్లన
ఖద్దరు రాట్నంబు పొరకాంత వహించెన్
ప్రొద్దు పసివాఁడు తూరుపు
ముద్దియ పొత్తిళ్ళలోన ముద్దులు గురిసెన్

వాని యిష్టార్థములు కూర్చుదాని వోలె
విశ్వనాథుని గుడికి గబ్బిలము సనియె
వేయిచేతుల పెనుకాపు వేగిరింప
గచ్చ బిగియించె నప్పేద కార్మికుండు.

◆ రెండవ భాగం ◆

బహుదేశ మత మహాపరిషత్తు తలయూచ
పలికి వచ్చినది మా భరతసుతుఁడు

కండెబొట్టున నైదు ఖండాల నోడించి
కొలువులందినది మా కోమటన్న

సీమలో నాచార్య సింహపీఠికమీద
నిలిచివచ్చినది మా తెలుగువాఁడు

విశ్వసన్మానంబు వెలయ నోబెలు కీర్తి
రంగ మెక్కినది మావంగసుకవి

చెట్టుచేమల సుఖదుఃఖ జీవితములు
నిజము దేల్చినాడు మా నేలవాడు
నన్ను దొలగించి లెక్కించినారు గాని
మొదట నెల్లర మన్నదమ్ములము మేము

గబ్బిల మేమని చెప్పెనొ
గుబ్బలి యల్లుండు కన్ను గోనల నశ్రుల్
గుబ్బటిలలేచి నల్లని
మబ్బులలో తక్షణంబ మాయంబయ్యెన్

తిరువానుకూరు దేవుఁడు
తెఱచెం గుడితలుపు లితర దేవుండ్లను బి
త్తరమోయి నిమ్న జాతుల
దరిసెనమున దరిసి రాత్మదౌర్భాగ్యదశల్

అంటరాని తనంబునంటి భారతజాతి
భువనసభ్యత గోలుపోయెననుచు

క్షమకు మించిన కత్తి జర్మనీ యుద్ధాన
గనుగొన్న మొనగాడు గలుగడనుచు

కదురు రాట్నము చేతగాక స్వేచ్ఛా స్వర్గ
ముదముజిక్కుట నభఃపుష్పమనుచు

నూరేండ్లు గాదు మున్నూ రేండ్లు మనవచ్చు
న్యాయమార్గంబున నడువుడనుచు

నిమ్న జాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును గాల్చి వేయుననుచు
రాట్నమును దుడ్డుగఱ్ఱ కరానబూని
దెసలదోతెంచె గుజరాతు ముసలిసెట్టి

సీమగుడ్డకు కన్నులు చెమ్మగిల్లె
ముతకబట్టకు మర్యాద పాటమరించె
నగరివెలుపలి మాలమాదిగలు గూడ
నరులుసుమ్మని దేశంబు గుఱుతుబట్టె

వెఱపువలదు నీకు హరిజన సోదరా
స్వీయరాజ్యరథము వెడలివచ్చె
లాగిపొమ్ము నీకు భాగంబు గలదంచు
బాడుచుండె రత్న భరతమాత

ఒకనాడా మునిపక్షి తొంటి చెలికా డున్నట్టి గేహంబు లో
నికి నేతెంచి యధావిధిం దిరుగుచుండెన్ మిత్రుడీక్షించి యు
త్సుకతం బొంగిఁదరస్మితంబున నిదే జోహారహో పక్షిణీ
యకలంకంబగునీ సహాయమున నాయర్థంబు పండాయెనే?

నావర్ణించిన పుణ్యభూములను సందర్శించినావే మహా
దేవుం డాయన దేవియుందగిన యాతిథ్యంబు నీ కిచ్చిరే
నా వాక్కుల్ జెవినాటితే మహితరత్న స్వర్ణకాంతి చ్ఛటా
ద్యావద్దివ్య హిమాద్రికందర పవిత్రక్షేత్రముల్ సూచితే?

పుడమి కలుషరాశి మ్రుగ్గిపోవుచు నుండ
నాట్యమాడుకొనుట న్యాయమగునె
భర్గదేవ! సృష్టి పరికించి పొమ్మంచు
బిలిచివచ్చినావె పులుగుచెలియ

కాళిదాసుని మేఘుంబు గౌరవంబు
తెచ్చుకొన్నదె నీదు సందేశ గాథ
ఘనులుచేకొను భూ భృదగ్రముల పూజ
యసమ చతురత్వమున్న బానిసకురాదు

వ్యాస వాల్మీకిముని మదేభములు రెండు
దిరుగుచుండెనె కైలాస గిరులమీద
వారి వార్ధక్యమున నీకు స్పష్టమగును
భరత రామాయణంబుల పడుచుఁదనము

ఆ వాల్మీకి నిసర్గజంతు కరుణావ్యాసక్తి యై సత్కవిన్
గావించెన్ వెడలించె రామునికథా గాంగేయముం గానిచో
త్రోవల్ గొట్టెడు బోయ కేగురువునేర్పుం దివ్యగీర్వాణమున్
ఆవేశించి కళాధిదేవి వరమీయన్ విద్యలేమాత్రముల్

ఎదురైవచ్చెనె కాళిదాసుని లసచ్ఛృంగార సందేశ మం
బుదమార్గంబునఁద్రసంబులు ధ్వనుల్ ముత్యాలు వర్షించెడిన్
పదినూరేండ్ల పురాణ మేఘమనుచున్ భావింతువో నిత్యముం
బదియారేండ్ల వయస్సు కూర్పదె సుకావ్యస్పర్శ జేజెమ్మకున్

జనముల్ మెచ్చు రసప్రసిద్ధమగు నా సందేశ భారంబుతో
జనముల్ వచ్చు విమానమాలికల గర్జాభీషణంబౌ ప్రభం
జన మార్గంబున నీప్రయాణమెటులన్ సాగించి నెగ్గించితో
చెనుకన్నేరవు గండముల్ తబిసిపక్షీ జన్మసన్మార్గులన్

కన్నులు ధన్యంబులుగా
కన్నావే మంచుకొండ గగనము శిరముం
దన్నెడు దాని నమరగవి
వెన్నవలెం ధవళరుచులు బిండెడుదానిన్

ఆ కొండయే యిండియా విరోధులదండు
గుండెగాలం బైన వెండికోట

ఆ కొండయే ముత్తియపుదండ భారతో
ర్వీమాతృమణికిఁ గిరీటభూష

ఆ కొండయే పర్వతాగ్రగణ్యములైన
కులపర్వతముల నిక్కులకునిక్కు

ఆ కొండయే రజతాచలస్వామికి
మణిమయ కళ్యాణ మంటపంబు

సింధుగంగా మహానదుల్ చిన్ననాడు
ప్రాకనేర్చిన యపరంజి ప్రస్తరములు
పాదచిహ్నాలు పరికించి వచ్చినావె
కలుషములు వాయ కన్నుల కఱువుదీర

ఇంద్రధనువుబట్టి సాంద్రాభ్రవనవాటి
మెలగు చున్నవాడు మృగయుఁడొకడు
వాడు గొంతుబిసిగి వసుధపై విసరిన
జంతుతతులు నిమ్నజాతి జనులు

ఆగర్భ ప్రతిభా సముద్రులగు శిల్పాచార్యు లూహింపగా
మూగంబడ్డ శకుంతముల్ పలికి గుంపుల్ గట్టి కీర్తింపగా
వేగుంజామున రంగులద్దు నల శిల్ప బ్రహ్మ దేగ్రామమో
భోగట్టాగని వచ్చితే రసమయంబుల్ తత్కళా పద్ధతుల్

బెళుకుంజూపులు గుల్క పోకడలు చూపీచూపకూరించుచున్
జలదాగారములందు దోచెదరు కన్యల్ కొందరీక్షించితే
పులుగుంబేడియ యబ్జిగర్భములలో ముత్యాలుపండించి భూ
ముల కర్పించెదరఁట మేటిగహనంబుల్ సృష్టివైచిత్రముల్

ఎంతకోయిలపాట వృధయయ్యనో కదా
చిక్కు చీకటి వనసీమలందు

ఎన్ని వెన్నెలవాగు లింకిపోయెనొ కదా
కటిక కొండలమీద మిటకరించి

ఎన్ని కస్తురిజింక లీడేరెనో కదా
మురికి తిన్నెలమీద పరిమళించి

ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనొ కదా
పండిన వెదురు జొంపముల లోన

వెలవాక్రుచ్చగారాని భావముల నన్వేషించుచున్ సత్కవీం
ద్రులయూహల్ విహగంబులై తిరుగుచుండెన్ బ్రోన్నతాకాశమం
డలమస్తంబున నాకళించితె ప్రయాణశ్రాంతి నమ్మించుకొం
డలకున్ డిగ్గెడి నీవిశేషము రసజ్ఞజ్ఞేయ మూహింపగన్

వడుకునూలుచేత బగ్గాలు పేనించి
దొడ్డమృగయు డుచ్చు లొడ్డినాడు
తగులుకొనునొ కాక తప్పించుకొనునొక్కొ
స్వీయరాజ్య మనెడు సింహరాజు

నరులన్ ముట్టక నందులం గొలిచి పుణ్యంబెల్ల సాధించున
ప్పరమంబైన రహస్యమున్ శివునితో ప్రస్తావముం జేసితే
పరమేశుం డివి నిమ్ము జాతులకు సంప్రశ్నింపగా రాని వే
ద రహస్యాలని కోపగించుకొని స్వార్థంబున్ బ్రదర్శించెనే

బసుమంబు బూసికొని యే
రసికతలేకుండ బ్రదుకు ప్రమదుల నడుమన్
రసికుడగు సుకవి జీవిత
మసిధారావ్రతము వలవ దది శత్రులకున్

ఎవరికివారై బ్రదుకుచు
నవీన ధర్మముల పిచ్చినమ్మకములతో
సవరించి ప్రజల తలలో
ప్రవేశ మొనరించు స్వార్థపరులంగంటే

దిరుసుల్ మార్తురు కొందరాంధ్రులవురా దేశాంతరంబేగి వ
త్సరముల్ పుచ్చిఁత్రివిష్టపప్రజలతో సఖ్యంబుగావించి యె
బ్బెరికం బైన విదేశ నాగరికతన్ విచ్చేయకచ్చాంధ్ర సుం
దర వేషంబు ప్రతిష్ఠ నిల్పితివి సన్మానార్హ వెంతేనియున్

చెప్పక చెప్పుచున్నది విశేషములేదని నీ మొగంబునే
తప్పొనరించి యింతటి వృథాశ్రమ యిచ్చితి మాయదృష్టముల్
దప్పిన దప్పని మ్మనుగుతమ్ముల శ్రేయముగోరి భర్గునిన్
గుప్పెడు గుండెతో యెదురుకొంటివిదే పదివేలు పక్షిణీ!

అపజయంబులు విజయ గేహంబు నిలుచు
స్తంభములు సుమ్ము నీకు విచారమేల
కొద్ది కొద్దిగ నిక్కిన గోడవోలె
సగము సగములుగా పనుల్ ముగిసిపోవు

ఓటమిలేదు నా యతన మూరకపోదు తుఫానువోలె నా
మాట లుమామహేశ్వరుల మానసముం గదిలించితీరు క
న్నీటమునింగి పైకుబుకు నిర్మలసూక్తి ఫలింపకున్న చో
రాటముతో స్వరాజ్యము విరాజిలుటల్ కృతక ప్రచారముల్

పలనాటన్ మును బ్రహ్మనాయని కృపాబాహుళ్యనేత్రంబులో
పల నాటంబడి నాయురాలి కృతక వ్యాపార దావంబులో
పల భస్మంబయి సంఘసంస్కరణ దివ్యద్బీజ మీనాటికిం
ఫలియించెంగద గాంధిచేయతనముల్ వ్యర్థంబుగావెన్నడున్

నీకావించిన రాయబారమునకు న్నిత్యాభిషేకంబుగా
నాకన్నీటిని కాన్కగా యొసగుచున్నానో దయాశాలినీ
చేకొమ్మింతకుమించి నావలన నాశింపంగ లేదిట్టి నీ
బాకీ దీర్తు స్వరాజ్య సౌధమున నావాసంబు సిద్ధించినన్

ఏజాతి కెంతవచ్చునొ
రాజత్వంబు నాకు రావచ్చు గదా
నాజాతి యెత్తు కేతన
రాజంబున నీదుమూర్తి వ్రాయింతుఁజెలీ!

పెల్లుతమస్సులోన దురపిల్లెడు మాబ్రతుకుం దనుస్వినుల్
భల్లున దెల్ల వార్చగల బాబులు పెద్దలనేకు లుండగా
దెల్లనివేల్పు భిక్షకుని దిండికి బట్టకులేని కొండరా
యల్లుని నాశ్రయించి యకృతార్థుడనైతిని పిచ్చివాడనై

మఱచితి నాదిదేవుని సమానుఁడు బుద్ధనియంతవాడు భా
సుర దరహాస చంద్రికల శుభ్రత లోన గలట్టివాఁడు య
ద్ధారలకుగాదు వారి చెవిదూరినవారిని లక్ష్యపెట్టఁడ
ప్పరమమునిన్ సబర్మతి నివాసిని జూచితివే తపస్వినీ

ముల్లొక్కించుక వాలిపోయినను బాపూజీకి దీటైన శ్రీ
వల్లాభాయి పటేలు దర్శనము సంప్రాప్తించెనే నీకు నే
డల్లంతన్ గనుపట్టుచుండెడు స్వరాజ్యార్థంబుకై సర్వమున్
గొల్లంబెట్టిన త్యాగి తానత డెఱుంగున్ నా మనఃక్లేశమున్

ధిక్కారించెడు రాచగుఱ్ఱముల స్వాధీనంబు గావింపగా
యుక్కుంగళ్ళెము జహ్వరుం డతని విద్యుచ్చారదామూర్తి న
ల్దిక్కుల్ నిండి నటించుచున్న దనుచున్ దేశంబు లగ్గించు మా
చిక్కుల్‌దీర్చుట విస్మరింపడుగదా స్వేచ్ఛాజయాంతంబునన్

పసుపుం బచ్చని పూతబూచినది మువ్వన్నెల్‌పిసాలింపఁ గాం
గ్రెసు మందార మనంతశాఖికలు నిక్కెన్ దిగ్దిగంతంబులన్
పసలేర్పడ్డవి సర్వవర్ణములకున్ దచ్ఛాఖిశాఖాతతిన్
వసియింపన్ మనకుండదే స్థలము దివ్యన్మోని పక్షీశ్వరీ!

కలడంబేడ్కరు నా సహోదరుడు మాకై యష్టకష్టాలకుం
బలియై సీమకుపోయి క్రమ్మరిన విద్వాంసుండు వైస్రాయిమే
ల్కొలువందంగల దొడ్డవాఁడతఁడు నీకున్ స్వాగతంబిచ్చి పూ
వుల పూజల్ వొనరించెనే యతనిమెప్పుల్ నీజయారంభముల్

నేను నాకను నహము ఖండింపలేక
పదియు నెనిమిది శాస్త్రాలు పదును లుడిగె
నీవు నే ననుసమత సంధింప గలిగె
తీవ్రతరమైన చిన్న మౌనవ్రతంబు

వచ్చినవారు సీమనరపాలుర మంత్రు లభీప్సి తార్థముల్
దెచ్చిరి ప్రేమతో భరత దేశజులం దనియింపవచ్చి పో
వచ్చు స్వతంత్రభారత సువర్ణకిరీటము నేడుగాక రా
వచ్చు మరొక్కనాడు నెలవాసిన తొయ్యలి తీర్థమాడదే?

గుడిలోదేవుడు చూచిపొమ్మనుచు నాకున్ వార్తలంపింపగా
దొడగెన్ నల్వురచేత నీవెనుకవత్తున్ నన్ను రమ్మందువా
తడవైనన్ మరణింతురెందరొ విముక్తాహార దీక్షాపరుల్
నడుమన్ నేనుసహింపజాల నొక యాంధ్రప్రాణి శుష్కించినన్

గబ్బిలమవయ్యు శివుని లోకంబునందు
వలయు కదలిక గలిగించి వచ్చినావు
నిశ్చలంబైన కాసార నీరమునను
నలతి శిల చాలదే వలయములదీర్ప

అర్థించి చనుదెంతు నగ్రహారముకన్న
సర్వేశ్వరుని యింటి చౌకదనము

అడిగివచ్చెద వీటి నడిబజారునకన్న
గుడిగోపురముల తక్కువతనంబు

పలికించికొనివత్తు బంతి బువ్వలకన్న
తీర్థప్రసాదాల దేబెతనము

ప్రశ్నించివత్తును రాచబావులకన్న
పాతాళగంగమ్మ పలుచదనము

నిజము దేలిచికొనివత్తు నిన్న నేడు
నన్ను జూచిన నల్లంత నడుచుతనము
గుడికిరమ్మనినంతనే యొడలుమఱచి
పరుపులెత్తుట నాకంత పరువుగాదు

ఎంతో చూరము పోవనేమిటికినే డింటింటికిం బ్రాకి యా
శాంతవ్యాప్తముగా రహించెడు స్వరాజ్యస్వర్ణసూత్రంబు చౌ
దంతి స్తంభన మాచరించెగద యేతద్దివ్యసూత్రంబు మో
కంతై నిక్కినకట్టిచేయగలదా యస్పృశ్యతావ్యాధమున్

చాటింపించి మదీయజాతికి నభీష్టంబుల్ ప్రసాదింపగా
పూటా పడ్డది కొంతభారమది రేపో మాపా రావచ్చు నీ
నాటంగాదని కొంతభారతము పంతంబొప్ప వాదించు నీ
వోటెవ్వారికొసంగితో తెలిపి నన్నోదార్చవే నెచ్చలీ

ప్రియములుగాని సత్యములు పెక్కులు నేను వచించుచుంటి నీ
దయకెడమై తపింతునో యదార్థ పిపాసువులైనవార య
వ్యయ కరుణావిశేష రుచిరాత్త మనస్కుడనై సుఖింతునో
భయపడనేల నాపలుకు పల్కులు బాష్పకణాభిరామముల్

ఏకవి పిచ్చిగా నడుచు పృథ్వికిలోబడి కీర్తికోసము
ద్రేకము సంహరించుకొని దేశమువోయిన త్రోవబోవునో
ఆకవి పేడుమూతి మగ డంబుజగర్భుని రాణిగారికిన్
సాకుడుబిడ్డ డాస్తిగల సామికి బేరసిక ప్రదాతకున్

పుట్టుంగావలె సత్కవీశ్వరుడు నీ పుణ్యాన మావంశపుం
బుట్టుంజీలిచికొంచు సంచితకళాపూర్ణ ప్రభారాశియై
పుట్టుంగూడదు పుట్టినం గలుగవెప్పున్ నిండుసన్మానముల్
గట్టా యుచ్చత నీచతాయుత వితర్కభ్రష్టదేశంబునన్

పిడికెండన్నము బెట్టలేదెపుడు మా వేమన్న జీవించి న
ప్పుడు ముద్దుల్ మురిపించు మేలికవనంపుం బుగ్గలుప్పొంగి కా
అడవుల్ మొద్దులు మోసులెత్తునపు డౌరా నేడు గోరీపయిన్
నడచుం బూజలు పుణ్య కార్యములు వింతల్ మాదయా ధర్మముల్

బ్రతికియున్న సాయిబాబెన్నడునుగాడు
చావకున్న వట్టి సాయిబయ్య
తిరుమలేశుడైన తెలియడీ యర్థంబు
చావు బ్రతుకులోని సారమిదియ

సమతలు సఖ్యముల్ బెదవిజారినమాటలు కట్టు బాట్లు చ
ట్టములు బటుత్వమూడిన గుటారపు దూముడి బంధనాలు ధ
ర్మములు దయారసాల్ మొసలిరాలుచు నశ్రుకణాలు చిత్రచి
త్రములు మతస్వభావములురామరగా వివరింప గల్గితిన్

ఇప్పుడు గుండురాతివలె నీశ్వరుడై ముడుపుల్ గ్రహించు కో
టప్ప యొకానొకప్పుడు గృహస్థుడు మానవమాత్రులైన రా
రప్పలు వేల్పులై సకలరాసులు మ్రింగక మిన్నకుండునే
యప్పపులుంగురాణి యిక నాసలులేవు క్షుధార్తజాతికిన్

మరణము వార్ధకంబను ప్రమాదమెఱుంగని కైతలల్లున
బ్బురపుఁ గవీంద్రు రెడ్డికులముఖ్యుని వేమనచాకచక్యమున్
మరచి పురాణకావ్యరస మత్తుడు వీరుడు సంఘసంస్కృతి
స్థిరుడు రచించె నాంధ్ర కవిజీవితముల్ బొరబాటు చేయుచున్

దొడ్డరాళ్ళగుండ్లు దొరలించి పఠితల
బెదురు బెట్టు కవిత విస్తరించి
పండితులకుదక్క పరుల కందకపోయె
దేవతలకు కామధేనువట్లు

కవితచచ్చుదయ్యు గథ పేరుగలదైన
గవికి కొంతకీర్తి గలుగవచ్చు
నెలలు తక్కువైన బలమైనతిండిచే
నుసురునిల్పుకొన్న నిసుగుపోలె

వ్యాకరణ శాస్త్రకారులు
క్షాకుఁ గకారంబు విరతి గన్పడదని చీ
కాకుపరతు రంతెకానీ
పాకము రసమింపు సొంపుఁ బరికించెదరే

వ్యవహారంబున భ్రష్టమయ్యు, రసభావస్ఫూర్తి గల్పించి మా
ర్దవముల్ శబ్దములెన్నియో కలుగు శాస్త్రజ్ఞాన మాత్రుల్ పురా
కవితోన్మత్తు లెఱుంగజాలుదురె కుగ్రామీణ భాషాబ్ధిలో
జవులూరించు తెలుంగుపల్కుల జగాస్వారస్యరాహాస్యమున్

కనుగొన్నావుగదమ్మ కృష్ణవిభుడక్కాలాన భాషావనం
బునసాగించిన యష్టదిగ్గజరథంబున్ శారదావాహమున్
తెనుగుం దేశము విస్మరించినది తద్దిగ్ధంతి దంతావళ
ధ్వనియధ్వాన్నపుటద్రిగర్భముల నిద్రం బోవునాంధ్రత్వమున్

తెల్గు తేజంబెల్ల దిక్కులకెగబ్రాకి
పగవాని బెదరించి వచ్చునపుడు

తెలుగుశిల్పుల సుత్తెదెబ్బ ఖంగునమ్రోసి
చీనాకు పయనంబు సేయునపుడు

తెలుగుకవిత్వంబు దిగ్దంతులముఖాన
బృంహితధ్వనులు గావించునపుడు

తెలుగుజెండాశక్తి నలుదెసల్ ప్రసరించి
విద్యానగరవీధి వెలుగునపుడు

రామలింగని హాస్యకార్యములు దలచి
నాల్గుదిక్కులు కడుపుబ్బ నవ్వునపుడు
నాట్యమాడిన యానంద నవ్యలక్ష్మి
కానుపించెనె శిథిలదుర్గములయందు

అక్కట తల్లికోట సమరాంగన యాఖరు తెల్గుపోటుచే
యుక్కిరి బిక్కిరై తురకయోధులవంకకు వాలునాడు భూ
భుక్కులగండడౌ తెలుగుభోజుని పూజలు చూరగొన్న యా
టక్కరిదేవతల్ తనువు దాచుట నాకు నసహ్యమయ్యెడిన్

తొంబదియేండ్ల వృద్ధుడతి దోర్బల భీముడు రామరాజు డెం
తెం బరగండడౌ నృపమణీ సుతభర్త మహమ్మదీయ ఖ
డ్గంబులకున్ శిరం బొసగి కష్టముదెచ్చినమాట ఆంధ్రవ
ర్గంబు సహింపనేరని పరాభవమై భవమై దహించెడిన్

తెలుగులండను నగరంబు తెలుగుకోట
తెలుగుకవి దిగ్గజంబులు తెలుగుదనము
పాట్టిగుఱ్ఱమునెక్కిన పొగరుబోతు
టళియరామునికతన ముక్కలయిపోయె

విహరింపనే భీతివిడచి మస్తమునెత్తి
సకల సామ్రాణ్మహా సభల లోన

వాక్రుచ్చనే రాలు వగలి బుగ్గలుజిమ్మ
నతి నిశాతప్రబంధాదికములు

కల్పింపనే తెల్గు కల్యాణికొప్పున
సొగసైన కీరితి పొగడదండ

ఎత్తింపనే మేటి హిమవద్గిరులమీద
శాశ్వతవిజయ రాష్ట్రధ్వజంబు

పగరగర్భకుహరి స్వారిగావింపనే
యింటి గుట్టు బయటి కెక్కకున్న
సమ్మతించి జాతి కుమ్మక్కుగానున్న
కొండలన్ని పిండిగొట్టనొక్కొ

అది మారత్నము లారబోసికొను విద్యాశారదాపీఠ మ
ల్లది మాకత్తుల ఖారుఖాన మది యాంధ్రాదిత్యబింబంబు సం
పద సొంపారిన మాల్యవంతమని డంబంబొప్ప చాటించు స
మ్మద సౌఖ్యంబొక తెల్గువీరునకె సంప్రాప్తించెముమ్మాటికిన్

కలవెన్నో విషయంబు లాంధ్రుల కళాకౌశల్యముల్ సాటు తా
వులు ప్రత్యర్థులగుండెలో వెరపు నిప్పుల్ సల్లు గాథావళుల్
కల విష్ణున్ బలనాటి పౌరుషపు రేఖల్ మాశరీరంబులన్
కలుపుంగోలుతనంబులేదది కళంకంబండ్రు మాజాతికిన్

ముసలిమానులలోని యసమ సమత్వంబు
లంగోటిగట్టి చెలంగుచుండ

ఘూర్కా సిపాయీల కుటిలశౌర్యజ్వాల
నట్టింట కాపలా నడుపుచుండ

ద్రవిడుల కార్యసాధన ధనార్జనదీక్ష
సాంబారు నోరెత్తి చాటుచుండ

రాష్ట్రాంతరములకు బ్రాకి హిందీ భాష
పదుగురి నోళ్ళలో నెదుగుచుండ

అఖిలదేశములకు నవతంస కుసుమంబు
రాజితోగ్రకదన రక్త తిలక
మానధనికురాలు మా తెల్గుటిల్లాలు
కలత జెందదౌర కాలమహిమ

గౌతమి గంగలోన మృతకాంతులతో నుదయంబుగన్న వి
ఖ్యాత మణీవితానము మహమ్మదురాజుల దండు దెబ్బతో
తాతలనాడ పోయె నిక తాతలుబుట్టిన రావు రత్న దీ
పాతత కాంతులీను గృహ మక్కట నూనెకు దేబెరించెనే

రతనా ల్దొంగలు దోచుకున్నపుడు శౌర్యశ్రీలు విద్రోహి భూ
పతులేటే మృదుక్తి చాతురలచే బంధించునాడేని భా
రత చండీశ్వరి కోటిమస్తముల దర్పంబుంబ్రదర్శింపదో
ధృతిహీనంబగు భిన్న భిన్న మత విద్వేషంబు పాటించెనో

గప్పాల్ గొట్టిన నేమి లాభము ధరా గర్భాన నిద్రించు కృ
ష్ణప్పల్ దాతలు లేచివచ్చెదరె వీరావేశ విభ్రాజితుల్
నిప్పంబోలు తెలుంగువీరు లిపుడున్ జీవించియున్నార లీ
చప్పంబడ్డ యనుంగు సోదరుల కుత్సాహంబు సంధింపగన్

ఏనాడు మా కావ్య సృష్టికర్తల జిహ్వా
విశ్వసత్యము నాలపింప గలదొ

ఏనాడు మాజాతి దృష్టి మాంద్యము వాసి
చుట్టుప్రక్కల దేరి చూడగలదొ

ఏనాడు మా బుఱ్ఱ లీ జుట్టు తలలేని
పుక్కిటి కథలలో జిక్కువడవొ

ఏనాడు మావిద్య లినుపసంఘమునందు
చిలుము పట్టక ప్రకాశింపగలవొ

తనువుదాచక సోమరితనము మాని
యెన్నడీమఠంబులు బిచ్చమెత్తుకొనవొ
అట్టి శుభ వేళకై కొంగుబట్టి నిలచి
నలిగి వాపోవుచున్నది నామనస్సు

ప్రభువుల పెండ్లి పేరంటాలు వర్ణించి
కాలంబు పెక్కేండ్లు ఖర్చు పెట్టి
విరహవేదన మేనుమఱచి మూర్ఛలుపోవు
రాణివాసంబును రచ్చకీడ్చి
అంగాంగ వర్ణనా వ్యసనంబు రెట్టింప
యువకజీవితకోటి కుచ్చులొడ్డి
పదియునెన్మిది మార్లు బాడిన శ్రీరాము
చరితంబు వగరెక్క తిరుగుబాడి

శరణు శరణటంచు బరుగులెత్తుచు వచ్చు
నార్తలోక రుత మనాదరించి
భువన హితముగోరు కళాశక్తి
స్వార్థజడధి నూరవైచినారు

పెద్దల శల్యముల్ బలె వివేక మొసంగని గ్రంథరాసులే
విద్దియలైన నింక బది వేల యుగా ల్దలకాయలేని గం
గెద్దలు బుట్టి స్వార్థపరులెత్తిన గంతలుమోసి తీరెడిన్
బుద్ధి చిగుర్చునే యరుచి బుట్టుకథల్ దలమీద రుద్దినన్

ఆడుది లేకయున్న గృతి కందములేదని నమ్మియెన్నడో
పాడి రనుత్తమ ప్రణయ బంధుర గీతము లర్ధతృష్ణ వె
న్నాడ కవుల్ మహీపతి బృహన్నల వర్గము సంతసింప నీ
నాడు రచింతు రిద్ధ కరుణా పరిణద్ధ రసప్రబంధముల్

మొన్నటి యుద్ధదేవతకు బుట్టినకూతురు క్షామదేవి మృ
ష్టాన్నముగా భుజించిన క్షుధార్తుల డొక్కలు శల్యరాశి సం
పన్నుల వీధులందు గనుపట్టెనె? వంగకవీంద్రకోటి చే
కొన్న కలాలెరుంగవనుకొందు దయారస నవ్యకావ్యముల్

చలిచీమం బొలియింప నేరని యహింసా మానసుల్ ఱాలలో
మొలిపించెం బహుబుద్ధ విగ్రహచయంబుం భారతంబంతటన్
కలయైపోయెనొ తత్కృపా గుణము బంగాళంబులో బ్రేమమూ
ర్తులులేరో భుజియింపరో ద్రవిణవంతుల్ మేలి మృష్టాన్నమున్

ఎట్టు నశించి పోయె నితరేతర విశ్వసనంబు లెందు కీ
చట్టములుం బ్రమాణముల సారమషీరస పత్రలేశముల్
కొట్టిన గొట్టుమం చెదరి గుండియలం గరగించు ధర్మముల్
బుట్టినగడ్డలో నకట పూక్కృతి సల్పు నశాంతిసర్పముల్

అనఘుం డశ్రు మషీజలంబున వివేకానంద సన్యాసి వ్రా
సిన వ్రాతల్ దడియారలే దిపుడు ప్రాచీనంపుటజ్ఞాన బం
ధన విచ్ఛేదమొనర్చి యే ఘనుడు విద్యాభిక్ష గావించి ప
చ్చని బంగారమువంటి మా భరత సంసారంబు నెగ్గించునో

గాలిందూలెడు శుష్క దేహములతో కాషాయ వస్త్రాలతో
శూలంబుల్ సొరకాయ బుఱ్ఱలు జటాజూటంబులుం దాల్చి యా
మూలాగ్రంబుగ భ్రష్టులై తిరుగు బాబుల్ దొడ్డగంజాయి భా
యీ లున్నా రెదురైనవారె మునిపక్షీ కుక్షిరక్షాపరుల్

జపమో ధ్యానమొ యభ్యసించి యతివేషంబూని క్రీడించి మో
సపు బార్థుల్ ప్రతి పల్లెటూర గలరీ సన్యాస వర్గంబు నీ
కుపదేశింపదొ యిష్టసిద్ధికని మాయోపాయ మంత్రంబు భ
క్తి పరత్వంబొక సాధనం బిహ పర స్త్రీ వంచక శ్రేణికిన్

పాలుం బండులు కందమూలములు మాభక్ష్యాన్నముల్ గోరమే
కాలం బన్యపదార్థముల్ రజితమో బంగారమో కొద్దిగా
జాలున్‌మాకని సేకరించెదరు గోసాయీ లుపాయాలు మో
సా లెన్నేని నిరంతరాయముగ రాజ్యంబేలు నేడెల్లెడన్

వృత్తుల్ సర్వము త్రుప్పుపట్టి చనగా భిక్షాటనంబుల్ జగా
వృత్తుల్ కా పలుజాతు లై నిలువ దుర్భిక్షంబు రాకుండునే
యుత్తుంగాశయు లెందరో కలరు దేశోద్ధారకుల్ పూనరీ
చిత్తంబేర్చు కళంకమున్ దుడిచి సుశ్రీ నేలకుం గూర్పగన్

ఎన్ని సుక్షేత్రములు సార మిగిరిపోయి
ముండ్లతుప్పల బంజర భూములయ్యె
దృఢతరంబైన యెంతెంత దేహశక్తి
భిక్షకుల మేప జీర్ణించ పృథివి గలిసె

పదపుల పీటలెక్కి యనువారము లంచపు బాడిబఱ్ఱెలం
బిదికి గడించి కార్మికుల పేదల చెమ్మట దెచ్చి కాన్కలి
చ్చెదరు పరోపజీవులు విచిత్రపు భక్తులు వేషధార్లు నీ
కెదురయి వచ్చిరే వలదిసీ చెయిసాచకుమమ్మ పక్షిణీ

నరుని కష్టపెట్టి నారాయణుని గొల్చు
ధర్మ శీలురున్న ధరణిమీద
కాలుమోపలేక గబ్బిలమొక్కటే
చరణయుగళి దివికి సాచినడుచు

పూజారి బోషాణమును కాపలాకాయు
చిల్లర వేల్పుల పేవజేసి
గొఱ్ఱెపోతుల నల్లజుఱ్ఱి గఱ్ఱున ద్రేచు
కరకు సత్తులకు జాతరలు సల్పి
ఏటేట పెండ్లిజేయించుకొంచుదయించు
కృతకరాముల పల్లకీలు మోసి
నిలువుదోపిడి చేసి తలకాయ గొరిగించు
యేడుగొండలవాని మేడలెక్కి

ఆంబుధీశుని కళ్యాణులని తలంచి
ముంచుగంగమ్మలకు డబ్బు పోసి పోసి
పాతకమువోలె నావెన్ను వాయకున్న
గోచితో నిల్చియున్నాడ పేచకంబ

గుఱ్ఱాలకు ఱెక్కలుగల
వెఱ్ఱియుగాల్ దాటిపోయె విజ్ఞానంబున్
బుఱ్ఱగల గాంధి యుగమిది
కట్టలు ఖద్గంబు లేలగాలేవు ప్రజన్

రాజుగారి గుఱాల రథచక్రముల క్రింద
మరణించు రైతుకు శరణమిచ్చి

నరజాతిలోన నంతరము లుండుటకన్న
నఘములేదను ధర్మమాకళించి

బహుమతాచార దుర్భర పదాహతిచేసి
అసురుసురగువారి కభయమిచ్చి

రాజభాషలకన్న రాష్ట్ర భాషలలోన
రసమున్నదను యదార్థత నెఱింగి

యుగయుగాలనాడ యూబిలోదిగబడ్డ
మహితమైనజాతి మత్త గజము
ప్రబలదాస్య నిగళబంధంబు లగలించి
దెసల మసలుచున్న దినములివ్వి

కలరే మోసపు దేశభక్తి పరులక్కైలాస దేశంబునన్
చలికిం ఖద్దరుధారులై యవల స్వేచ్ఛారాజ్యభాగంబు రా
గలదంచున్ విహరించు పెద్దలు పతంగస్వామినీ నిమ్ము జా
తులపై వీరువెలార్చు బాష్పములు చిందున్ దియ్యగా పుల్లగా

మా దొరగ్గారబ్బాయిలకు నీకేం మాయిలవుతున్నవ్ అని యా
యువిద్వాంసుని నిగ్గదీసి కనుబొమలముడిచి కాకుం బోనిమ్మని వా
చేయస్తంబిచి కన్నెర్రజేసి ఒక రోషాన మెత్తుచు
బ్రాయశ్చిత్తమనంతరాయ మిదియో బ్రహ్మర్షి మేలంయనన్

కలయమ్మా ప్రేమ మేలుదానరుగు మా కన్నెలమ్మాయి యంటియా
పాలమంచంగల మూలమాటగలకుల భూశోభకాయ కన్నె
మ్లలు కృష్ణుల్లంటు మైమరలు ప్రేమల గ్రమ్మగా యిట్టినిన్
కలుపన్నేరరు లెమ్మయాలనుచు మీకన్నంటి పొగాయెడున్

చాకిరిమేనులు వెలుగుమాడ మెయిమిన్నాలు నా
వాకిరి ప్రాక్కొమ్మువ్వ పిలలులు శిశువులు లెంకకాలయి
బాక భయమ్ములా గమగమిట్టిని యాలు గుమ్మలమ్మా
లేక నశించుచో తెలుపలేము గదా మనవాగ భీరయున్

కుభ కాముఁ డుండగాక యం
కుభ కాముఁ డెలయించుమా క్రోధంబుకిరి
బ్రభువంచు భక్త యుండదా
యభయంబంచ ప్రేమమాల కన్నియమ్మిన్

అరయం గుత్తుకగాని యంతమ్ముల గర్భాగాయములు చీర్చి వె
త్తురుదేశ్యన్న చియుండుమోహగమజాతుల జాతరల సేయుజా
తుర చూపించుచు ప్రాణ్ణహాంత్రంగతవాయుల కాస్థపాలంగతుల
కరుణల కమ్మనిమోహ లోపులగుటన్నా ఛీ! మనుకుమ్ముల గదా

కని గుంగార్యణముండు ప్రాణమనియెం గర్భుఁ బృథాదేవి యా
తని విద్యా కుల చూప నెండవలు వ్యర్థంబై ప్రలాపింపవో
కనియెన్ భారతకుంతి మమ్ముల సనంభ్యాకంబుగా కర్ణులన్
మునిపత్నీ యమునందనుల్ తెలియులప్పుడు మాయభ్రాతృత్వమున్

ఒకడు రుద్రాక్షమాలికలు నెత్తికి జుట్టి
శివమూర్తియై భూమికవతరించు

ఒకడూర్ధ్వపుండ్రంబు లురువుగా దగిలించి
శివలింగమునుజూచి చీదరించు

ఒకడు రెండునుగాని వికట వేషముదాల్చి
పైవారిమీద సవాలు సేయు

ఒకడు గంజాయిదమ్ముకు దాసుడై పోయి
బూడిదగురవడై పుట్టివచ్చు

మనుజులార మాది ఘనమైన మతమని
ఒకడు తరిమి తరిమి యుగ్గడించు
పెక్కుమతములిట్లు పేచీలుసాగింప
మార్గమేది యైకమత్యమునకు

మొక్కుబళ్ళ నెపాన చక్కని పసిపాప
లెందరు గంగలో నిమిడిరొక్కో

సహగమనాచార దహనదేవత లెన్ని
చిగురు గొమ్మల బూదిచేసెనొక్కో

చదువుదాచెడు దురాచరణ మెందరి కళా
భ్యసనచాతురి గొంతు బిసికెనొక్కో

పొందెరుంగని వేరుబంధాలచే బాహు
బలమెంతగా చచ్చుపడియెనొక్కో

చిలిపిరాలకు నగిషీలు చెక్కి చెక్కి
కాలమెంత యుగాంతాన గలిపిరొక్కో
చదువ నేర్చిన వెఱ్ఱిని జంపగలరె
ఒక్కబుద్ధుడు నొకక్రీస్తు ఒక్కగాంధి

శిలవంటి యూరిసత్తులకు నెత్తుటికూడు
రేపులు మాపులు మేపలేక

ఆచారమని తప్పదని వెంటబడివచ్చు
గురులదక్షిణ లిచ్చుకొనగలేక

మంత్ర తంత్రముల సోమరిమాంత్రికుల బారి
బడి ధైర్యమును చిక్కబట్టలేక

శతసహస్ర క్రూర మత సింహములు సేయు
కుటిలగర్జకు తట్టుకొనగలేక

అనుగు తమ్ముల సిరు లోర్చుకొనగలేక
పిచ్చిపూజల మమతలు విడువలేక
అమరనుతమైన మాదు దేశాభ్యుదయము
యుట్టికిని స్వర్గమునకెక్క కూగులాడు

విందుభుజించి పొమ్మనుచు బిల్చుటకర్హతలేదు నాకు క
ర్మంది పతంగినీ పనికిమాలిన సంఘము సమ్మతించునే
పొందులు పొత్తులు న్మనకు ముప్పదినూర్ల కులాలవారికిన్
నందుల నాగులంగొలిచి నవ్వులపాలగుచున్న జాతికిన్

స్వయముగ నన్నపూర్ణ తనభర్తకు సిద్ధము జేసియున్న య
వ్యయరుచిరాన్నమున్ శివుని పంక్తి భుజించిన పూజ్యురాల వ
న్వయము తరించె నిట్టి మునిపక్షిణివై కులభేద బుద్ధిచే
కయికొనకుందువే సఖుల గర్భదరిద్రుల యాతిథేయముల్

తులవాక్రుచ్చగరాని నెత్తుటిసిరాతో వ్రాయుచున్నారు మ
త్కులజుల్ దుఃఖరసోత్కటంబులగు పెక్కుల్ కావ్యముల్ జాతి లు
బ్ధుల వజ్రస్థిరచిత్తముల్ గరగి సంతోషించునో యిప్పితం
బులు పండింపక సుంకుతోసమసి మామూల్‌త్రోవలం ద్రొక్కునో

కవిగారికిదె నమస్కారంబనెడువాడు
కళకు లెమ్మని పరోక్షమున బలుకు

కవనంబునకు మేను గరగి మెచ్చినవాడు
కవిచెంత వెఱబెఱికముగ మసలు

విద్యా కళంకంబు వెదకజాలనివాడు
జాతిలేదని నోరుచప్పరించు

శాఖీయులకు సహస్రములు బోసినదాత
అన్యుల మధుర వాక్యముల దనుపు

జీవకళలు చెక్కు శిల్పిని నిరసించి
శిల్పమునకు పూజసేయునట్టి
వక్ర చరితులైన వ్యక్తులు గలచోట
కళల కకట ప్రేతకళల గతులు

పోటీసేయ సమర్థులయ్యెదరె మాముక్కన్న తిక్కన్నతో
మేటుల్ షేకుసుపీయరుల్ బయిరనల్ మిల్టన్లు గోల్డుస్మితుల్
నా టైనారు స్వకీయులైన కవులీనా డన్యభాషాకవుల్
నీటై రక్కట కాలమాంత్రికుని పాండిత్య ప్రభావంబునన్

జాతీయోద్యమ యుద్ధరంగమహితోత్సాహ ప్రతిధ్వానముల్
కూతల్‌బెట్టుచు నాల్గుజాతులకు గగ్గర్వాటు గల్పించెడిన్
స్వాతంత్ర్యంబను స్వర్గసౌఖ్యమున మా భాగంబు మాకిత్తురో
ఖాతాలేదని త్రోసిపుచ్చెదరొ వక్కాణింపవే చెల్లెలా

కలధౌతాద్రిగుహల్ ప్రతిధ్వను లెసంగన్ దెల్గు రాష్ట్రార్థమై
గలభారేచిరి సోదరాంధ్రజను లాకర్ణింపవో నీవు చె
ల్లెల రాష్ట్రంబు గడించినారనుచు హాళిందేలితో తెల్గు బి
డ్డల యత్నా లనరాదుగాని యవి సోడాబుడ్డి యుద్రేకముల్

బలియైనాడు ధరాహితార్థము మహాభాగుండు యేసుండు త
త్ఫలితంబై కనుపట్టు భిన్నమత సిద్ధాంతంబులుం జీలికల్
కులముల్ గుట్ర లనైకమత్యములు చిక్కుల్ జీదరల్ రిత్త బో
ధలు వేదాలు పదాలురాల్ప పర చేతన్ముక్తి ముక్తామణిన్

భోగు లాహరించు భుక్తి కన్నులజూచి
పరమ పేదలు దుఃఖపడని చోటు

సాంఘికాచార పంచాస్యగర్జనమున
బెదరక జ్ఞానంబు పెరుగుచోటు

జాతివైషమ్య రాక్షస పదాహతిచేసి
కుందక కళలు పెంపొందుచోటు

పరిపాలక క్రూరతర కరాసికి లొంగి
పోక స్వేచ్ఛాలక్ష్మి పొదలుచోటు

అనదబిడ్డలుజూడ నెయ్యంపుసుతుల
ముద్దులాడని గుణనిధుల్ బుట్టుచోటు
చెప్పగదవమ్మ చూచివచ్చితివె నీవు
నిశ్చయంబుగ వాసముండెదను నేను

పయిపై నవ్వులు పల్కరింపులుమృషాబాంధవ్యముల్ సూపి యా
పయి శత్రుత్వము సేయు నాగరికతా భ్రష్టస్వభావాధముల్
సయితానుల్ చరియింపనట్టి ధర గోష్పాదంబు గన్పట్టినన్
దయతో నాకెఱిగింపుమమ్మ యచటన్ నాయిల్లు గట్టించెదన్

కళలం దాచెడు చుప్పనాతితన మింకం దేశమందున్న చో
కలదే ముక్తి ప్రపంచసభ్యతకు మార్గం బుండునే జాతికిన్
తలయుం దోకయులేని తొంబది సమాధానంబులం జెప్పి పే
దలవంచించు కళానిహంతులె యనర్థం బీ శుభక్షోణికిన్

అసుశక్తిం బనిసేయుచున్ మసలు దేహాపూర్వయంత్రంబులో
బిసలెన్నోకల వే నెఱుంగనివి నావిజ్ఞాన భాండారపుం
బిసలెల్లం బనిసేయవిందలిమరల్ పాడైనచో యెవ్వడీ
బిసగాడెందుల కీ రహస్యములకున్ బీగంబు బంధించెనో

అచ్చెరువున్ ఘటింపగల యంత్రములంగనుగొన్న జ్ఞానులుం
జచ్చిరి చావు పుట్టువుల జాడ లెఱుంగ కెఱింగి దేవతల్
జచ్చిరి మృత్యువుం గెలుచుశక్తు లొసంగని చుప్పనాతి వే
ల్పెచ్చట డాగినాఁడతని కెందుల కీతెరచాటు మోసముల్

మును మేనూడ్చిన వారియెమ్ములెరువై భూదేవి పండించి నిం
చిన నానా ఫలవృక్షరాజముల కిచ్చెన్ దివ్యమాధుర్యమున్
తను రక్తంబును మేఘమై కురిసి యానందంబు గల్పించు చ
చ్చున దేదీ ప్రతిజీవియుం దిరిగి వచ్చుం భిన్న రూపంబులన్

మరణితులైన వారి తనుమాంసము కొన్నియుగాలు భూమిపై
మురిగిర సాయనప్లుతుల పూర్ణపరీక్షల నిగ్గుదేలి యా
ఖరకు శిశూత్కరాదులకు కాయముగా విలసిల్లకున్న నీ
సురచిర దివ్యకాంతులు నిసుంగులు మేన రహింప నేటికిన్

ఆ జన్మంబు తపంబునం బెరిగి దేవావాస వాస్తవ్యవై
పూజాపద్ధతులెల్ల నేర్చితివి నీ ముత్తాతలుం దాతలున్
జేజమ్మల్ కులసంఘ బాహ్యులయి కస్తింగుందుచో దేవతల్
రాజపెట్టిరె పేదవారిమొర కర్ణక్లేశ మెవ్వారికిన్

మాతృభాషలకర్హ మర్యాద లొనరించు
సర్వకళాశాల సాగుచోటు

ప్రజలనాహారించు బహుమత దేవతా
దైనందినగ్లాని లేనిచోటు

నవనీతనిభమైన కవుల కమ్మని వాక్కు
వెఱపులే కావిర్భవించుచోటు

సంతానమునకు వైషమ్యంబు నేర్పని
తల్లిదండ్రులు విరాజిల్లుచోటు

విసపునవ్వుల లాహిరీ వేషగాండ్ర
పాదచిహ్నాల మరక లేర్పడనిచోటు
తోడునీడయు లేనట్టి దుర్బలులకు
గబ్బిలపుచాన వాసయోగ్యంబుగాదె

జాతీయపౌరుష జ్వలన మా బాల్యంబు
సవరించు కావ్యరాజములులేక

విక్రమక్రమశిక్ష వెన్నతోనిడు జిజా
సతివంటి మాతృదేవతలు లేక

నొకజుట్టు నొకబొట్టు నొకకట్టుబడి నేర్పి
పాలింపజాలు దేవతలులేక

కులమెల్ల చెదరి తెంపులు తెంపులగుచుండ
వారించి కాపాడు ప్రభువులేక

బుద్బుదంబుల కొనయైన మూడునాళ్ళ
పదవులకు ప్రతిష్టలకునై ప్రాకులాడి
నరులనమ్మించుకొనలేక నమ్మలేక
చిదికియున్నవి మాజాతి జీవితములు

అసల్ చెప్పుదురిప్పుడీ గురులు ముందాకాశసింహాసనా
ధ్యాసీనత్వము సంఘటించు నిది సత్యంబంచు చూపింతు రీ
బీసీనాటి పురాణగాథలు రుషావేషంబుతగ్గించి నా
దాసత్వంబు స్థిరీకరించెడు పరంధామంబు నాకేటికిన్

పుట్టుకపూర్వమే తలను బుంపినజాతి మతప్రచండ సం
ఘట్టనచేసి నా సహజకౌశలముల్ నశియించిపోయె నీ
కట్టినకట్లు విప్పనధికారములేని గురుండెవండొ యీ
యుట్టికినెక్కలేని నను నూచెడినంట వికుంఠలోకిన్

ననుసృష్టించినవాడె నావెనుక జన్మంబెత్తునే నోరెఱుం
గని నన్నీపదివేల రూపములతో కంగారుగావించునే
కనకంపుం గుడి గోపురాల్తనకు నాకాంక్షించునే కానుకల్
గొనునే యిట్టివి మోసగాండ్రయిన భక్తుల్ పన్ను పన్నాగముల్

అనినమాటను మార్చుకొనలేని శాస్త్రముల్
స్వాభిమానముదక్కి పలుకగలవె?

కులముంచుకొని నన్ను గొలుచుకొండను వేల్పు
కడగి నాకన్నీరు దుడవగలడె?

మానవదాస్యంబు మరగిన లోకంబు
నెనరూని నా చెల్మి నెఱపగలదె?

అస్వభావిక కథావ్యాసంగ హతమైన
పృథివి సత్యంబు నూహింపగలదె?

యుడుకురక్త మెన్నడో చచ్చుబడిపోయి
చేతులెత్తి మ్రొక్కు స్వీయజాతి
కఱకు వీరసూక్తు లరిగించుకొని వేచి
యెదుటనిలచి పగర నదమగలదె

ధర్మసంస్థాప నార్థంబు ధరణిమీద
నవతరించెద ననె నబ్జభవునితండ్రి
మునుపు జన్మించి నెత్తి కెత్తి నదిలేదు
నేడు జన్మింపకున్న మున్నినది లేదు

కనుబడలేదు దైవతముగాని పదార్థము భారతంబునన్
గనుపడలేదు వర్ణమునకన్న పిశాచము భారతంబునన్
కనుపడలేదు సత్కులమునన్న మహాకళ భారతంబునన్
గనుపడలేదు పంచమునికన్నను నీచపుజంతు వేదియున్

హక్కుల్ దొంగలుదోచుకున్నను మనుష్యత్వంబుజంతుత్వమై
చిక్కుల్‌వెట్టెడు కాలమందును క్షమాసిద్ధాంతముల్ నేర్వ నా
పక్కాపౌరుషపహ్ని నార్పు మత రూపక్రూర సింహంబు నా
ప్రక్కం బండులునూరుచున్నది తలంపన్ శల్యసారథ్యమ్మె

జగముల్‌మెచ్చు బియే లెమేలు బిరుదుల్ సాధించినామంచు నీ
లుగు మామాలలు మాదిగల్ గులమహాలోభంబు రెట్టింపగన్
తెగలంగట్టి తగాద లెంచెదరు గానీ సంధి గావింపరో
ఖగభామా మతబోధలేల కులకక్ష్యాభ్రష్ట దుర్జాతికిన్

అసలే ముక్కిడి దానిమీద పడిసెంబన్నట్లు మాజాతి బా
నిసలౌరా కలహించుచుండు రుభయుల్ నీచోచ్చతా నిర్ణయ
వ్యసన వ్యగ్రత సిగ్గుచేటగు నయో యస్పృశ్యతా త్రాసమం
త్రసమేతుండగు గాంధి నేరడివి యంతర్నాటకారాటముల్

భీతింగొల్పెడు నస్వభావిక కథావేదాంత శాస్త్రాలకుం
జేతుల్ మోడ్చు నమాయకప్రజలు సంసేవింప భోగాబ్ధిలో
నీతల్‌గొట్టు కవిప్రకాండముల సాహిత్యప్రపంచంబులో
ప్రాతఃకాంతుల జిమ్మునట్టి కవితాభానుండు జన్మించునే

నటకుని వోలి కాలపరిణామవిధేయములై రహించు ను
త్కట మత ధర్మశాసన నికాయముతీరుపు చేసి సంఘ సం
కటముల పాలొనర్చి యధికారముసేయు దరిద్రజాతిపై
కటకట నల్వురాడు నెడ కల్ల యథార్థము గాకపోవునే

రచ్చలకెక్కనీక సమరంబున బూడ్చిన కర్ణశక్తి నే
డెచ్చట జూచినం బ్రభవహించి సముజ్జ్వలమై వెలుంగదే
కచ్చ లసూయలుం గళ నొకానొక కాలము డాచియుంచినన్
హెచ్చి తురంగలించి ధ్వజ మెత్తకపోదు యుగాంతరంబునన్

కవ్వడి పరువున్నిల్పగ
న వ్వసుదేవాత్మజాతు డట్లనెగానీ
కవ్వడి కర్ణుని గెల్చుట
నవ్వులపాటనెడుమాట నల్వు రెఱుఁగరే

వలదన్నన్ వెనువెంటనంటి నను నిర్బంధించుచున్నట్టి వే
ల్పుల సిద్ధాంతములెల్ల నాసహజ సంపూర్ణ ప్రతాపంబులో
జిలికెం జిక్కని చచ్చుమందు మునిపక్షీ యింక నీవంటి గ
బ్బిలముల్ సేయు హితోపదేశముల వే వేల్గాలికాహారముల్

అగుపించెనే యసూయా దుర్గుణజ్వాల
సంహరించెడు శాస్త్రసముదయంబు

పరికించివచ్చితే పరమతసహనంబు
భాషించు వేదాంత పాఠశాల

వీక్షించితే వర్ణభేదాల వ్యాధిచే
శాంతిగా రాజ్యంబు సలుపు నెలవు

కనుగొంటివే మనుష్యునిజూచి మనుజుండు
మిట్టమీనై దాటునట్టిసీమ

నేను చిందులాడి నేను దప్పులుగొట్టి
యలసి సొలసి సత్తికొలుపు గొలువ
ఫలితమెల్ల నొరులు భాగించుకొనిపోవు
నీచమైనభూమి జూచినావె

క్రూరల్‌కుత్సితు లస్మదీయములు హక్కుల్ దోచుకొన్నారు న
న్నూరింబయటఁ నెట్టినా రిపుడు నన్నోదార్చుచున్నారు గాం
ధారేయల్ నెలకొల్పినారు బహుసంస్థల్ లక్కయిండ్ల క్కటా
మారుందమ్ములు నమ్మజాలనివి స్వాత్మశ్రీ సమారంభముల్

తనురక్తంబు వ్యయించి సత్కవికళాద్రవ్యంబు వెచ్చించి మ
ల్చిన శిల్పాలు విమర్శక బ్రువుల కల్తీ వ్రాతలం ఖ్యాతికె
క్కనివైపోయె నసూయచేబలుకు నాల్కల్ సత్యమున్ జాటునే
అనుమానింతురు కొంద రీశ్వరుని ధర్మాధర్మ నిర్ణేతృతన్

జనులం బీలిచి పిప్పి జేసెడు దురాచారంబులన్ గాల మ
ట్టని విద్యాబలమేల విద్యయన మౌఢ్యవ్యాఘ్రికింపైన భో
జనమా మోసపు వ్రాతకోతలకు రక్షాబంధమా యెందుకీ
మనుజత్వంబు నొసంగలేని చదువుల్ మైరేయపుం మైకముల్

చిరకాలంబును భిన్న జాతి మతముల్ జీవించు రాజ్యాన సు
స్థిరమై శాంతి రహించునన్న నుడి సందేహించెదం బక్షిణీ
తురకల్ హైందవ లీ స్వరాజ్యరథమున్ దొర్లింతురే దక్షిణో
త్తరదిగ్దంతులు రెండునుంగలిసి మేతల్ మేయు తావున్నదే

వీర వసంతరాయడను వేల్పాక డుద్భవమంది దుష్ట సం
హార మొనర్చి ధర్మము సహస్రముఖంబుల నాటునంచు నా
జారిన గుండెలో వెఱపు సల్లుదు రీయనృత ప్రచారకుల్
కారణమమ్మ పిచ్చితలకాయలకున్ వెడ నమ్మకాలకున్

పుట్టించెం దయలేని లోకమున నే పుణ్యాత్ముడో కుక్షిలో
ముట్టించెం బొగలేని యాకటిసాదన్ ముప్పూట లీచిక్కులో
నట్టిట్టె తపియించు నా కొదవు నాహారంబు భక్షింపగా
పుట్టంజొచ్చిరి దేవతల్ బహుళరూపుల్ బుట్టలై చెట్టులై

అట్టు లెడంద నేర్చెడు మహావ్యధ నాతడు వెళ్ళగ్రక్కినన్
బిట్టుకదుష్ణబాష్పములు నిండిన కన్నుల సానుభూతి చూ
పెట్టి ప్రదక్షిణించి సురభిక్షకు నింటికి లేచిపోయె గ
న్పట్టె స్వతంత్రభారత వికాకర బాలుడు తూర్పు డోలికన్

మునిపక్షి రాకపోకల
ఘన సందేశముల కతన ఖర్చయిపోయెన్
దనురక్త మా దరిద్రుఁడు
చనిపోవునొ తత్ఫలంబు జవిజూచెడినో!

జాషువ రచనలు

జననం: 28 సెప్టెంబర్ 1895 - మరణం: 24 జూలై 1971

రుక్మిణి కల్యాణం	1919
చిదానంద ప్రభాతం	1922
కుశలవోపాఖ్యానం	1922
కోకిల	1924
ధ్రువ విజయం	1925
కృష్ణానది	1925 మే
సంసారసాగరం	1925 అక్టోబర్
శివాజి ప్రబంధం	1926
వీరాబాయి	1926
కృష్ణదేవరాయలు	1926 మార్చి
వేమనయోగీంద్రుడు	1926 జూన్
భరతమాత	1926
భారతవీరుడు	1927 జనవరి
సూర్యోదయం	1927 ఏప్రిల్
చంద్రోదయం	1927 జూన్
భారతవీరుడు	1927 అక్టోబరు
గిజిగాడు	1927 డిసెంబర్
భారతమాత	1928 ఫిబ్రవరి
రత్నచ్యుతి	1928 జూలై
ఆంధ్రుడను	1928 డిసెంబరు
తుమ్మెద పెండ్లికొడుకు	1928 ఉగాది
సఖి	1929 జులై
బుద్ధుడు	1929 ఆగష్టు
తెలుగుతల్లి	1929 సెప్టెంబర్

శిశువు	1929 అక్టోబర్
బాష్ప సందేశము	1929 నవంబర్
దీర్ఘ నిశ్వాసము	1930 ఫిబ్రవరి
ప్రబోధం	1930 మే
శిల్పి	1930 సెప్టెంబర్
హెచ్చరిక	1930 ఆగష్టు
సాలీడు	1930 ఆగష్టు
మాతృప్రేమ	1930
భీష్ముడు	1931 జనవరి
యుగంధరమంత్రి	1931 డిసెంబర్
సమదృష్టి	1931
నెలబాలుడు	1931 మార్చి
నెమలినెలత	1931 ఏప్రిల్
లోకబాంధవుడు	1931 జూన్
అనసూయ	1931 ఆగష్టు
శల్య సారథ్యము	1931 సెప్టెంబర్
సందేహడోల	1931 ఉగాది
స్వప్నకథ	1932
అనాథ	1932
ఫిరదౌసి	1932
ముంటాజమహలు	1932
సింధూరము	1932 జనవరి
బుద్ధమహిమ	1932 మార్చి
క్రీస్తు	1932 జూలై
గుంటూరుసీమ	1932 సెప్టెంబర్
వివేకానంద	1932 నవంబర్
చీట్లపేక	1932 ఉగాది
జేబున్నీసా	1932 మే
పశ్చాత్తాపం	1932 డిసెంబర్
అయోమయము	1933 జూన్

అఖండ గౌతమి	1933 ఉగాది
ఆశ్వాసం	1933 ఏప్రిల్
మేఘుడు	1933 ఆగష్టు
శ్మశానవాటి	1933 డిసెంబర్
ఆంధ్రభోజుడు	1934 మార్చి
గబ్బిలం	1941
కాందిశీకుడు	1945
తెరచాటు	1946
చిన్నా నాయకుడు	1948
బాపూజీ	1948
నేతాజీ	1948
స్వయంవరం	1950
రాష్ట్రపూజ	1963
కొత్తలోకం	1957
క్రీస్తు చరిత్ర	1958
ముసాఫరులు	1963
నాగార్జునసాగరం	1966
నా కథ	1966

జాషువ కవికి లభించిన బిరుదులు - సన్మానాలు

కవితా విశారద	1933
కవి కోకిల	1936
కవి దిగ్గజ-నవయుగ కవిచక్రవర్తి	1947
మధుర శ్రీనాథ	1952
విశ్వకవి సమ్రాట్	1964
కళాప్రపూర్ణ	1970
పద్మభూషణ్	1970
ఆం.ప్ర.శాసనమండలి సభ్యత్వం	1964

(జాషువా సాహితీ ప్రస్థానం నుండి)

కవి జీవిత పరిచయము

జాషువ గుఱ్ఱం వీరయ్య-లింగమాంబలకు 1895, సెప్టెంబరు 28న విుకొండలో జన్మించారు. అస్పృశ్యత, దారిద్ర్యం వెంట తరుముతున్నా, సాహితీ క్షేత్రమందు కృషీవలుడు కావలెనన్న కాంక్షతో ఆనాటి అననుకూల వాతావరణాన్ని, సానుభూతి కేర్పడిన దుర్భిక్షాన్ని ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కృషితో "నా స్తి దుర్భిక్షం" నానుడి యదార్థమైంది. అనావృష్టులు, గాలివానలు గతస్పృతు లైనాయి. కవితాసుక్షేత్రంలో పసిడినే పండించారు.

ప్రాథమికోపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి, నాటి మూకీ చిత్రాలకు వ్యాఖ్యాతగా ఊరూర తిరిగి, వీరేశలింగం, చిలక మర్తుల ఆశీర్వాదాలు పొంది కావ్యజగత్తులో స్థిరపడ్డారు. తిరుపతి వేంకట కవుల ప్రోత్సాహం ముందుకు నడిపింది.

ఉభయ భాషా ప్రవీణులై తెలుగు పండితునిగా, ద్వితీయ ప్రపంచసంగ్రామసమయంలో యుద్ధప్రచారకునిగా, స్వాతంత్రా నంతరం 1956 నుంచి 1960 వరకూ ఆకాశవాణి మద్రాసు కేంద్రం లో తెలుగు ప్రొడ్యూసరుగా ఉద్యోగాలు నిర్వహించారు.

కవితాభిమానులు, సాహితీసంస్థలచే వేయికిపైగా సన్మా నాలు పొందారు. కవి కోకిల, కవితా విశారద, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తి, విశ్వ కవి సామ్రాట్ అను బిరుదము పొ-దారు. గండ పెండారము ధరించి కనకాభిషేకాలు పొంది, గలు రోహణము చేసి, పగటి దివిటీల పల్లకిలో నూరేగారు. గుంటూరుజావట్టణం స్వేచ్ఛా పౌరసత్వ మిచ్చి గౌరవించింది. కేంద్ర సాహిత్య అకాడమీ "క్రీస్తుచరిత్ర" కావ్యమునకు అవార్డు బహుకరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనమండలి సభ్యు నిగా నియమించింది ఆంధ్ర విశ్వ విద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదాంకితుని చేసింది. రాష్ట్రపతి "పద్మభూషణ" బిరుదుమిచ్చి సత్కరించారు. ముప్పదికి పైగా రచనలుచేసి 1971 జూలై 24న కీర్తిశేషు లైనారు.

వచన గబ్బిలం

(జాషువ గబ్బిలంకు వచనాకృతి)

చార్వాక రామకృష్ణ

పాయసి ప్రచురణలు

వచన గబ్బిలం

(జాషువ గబ్బిలంకు వచనాకృతి)

చార్వాక రామకృష్ణ

ప్రచురణ :

పాయసి ప్రచురణలు

పోరంకి - కృష్ణాజిల్లా

వచన గబ్బిలం

రామకృష్ణ

మొదటి ముద్రణ : సెప్టెంబర్ 1996
రెండవ ముద్రణ : జూలై 2013

అట్టమీది బొమ్మ : అక్బర్

ప్రచురణ :
పాయసి ప్రచురణలు,
ప్లాట్ నెం. 46, విష్ణుపురం కాలనీ, పోరంకి, కృష్ణాజిల్లా - 521137
మొబైల్ : 9492230198

ప్రతులకు :
చార్వాక ఆశ్రమం, నిడమర్రు, (వయా) మంగళగిరి, గుంటూరుజిల్లా-522 503
నవోదయ పబ్లిషర్స్, ఏలూరు రోడ్డు, విజయవాడ
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు.
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాదు.
సహచర, సుందరయ్య పార్కు వద్ద, బాగ్‌లింగం పల్లి, హైదరాబాదు.
మంచి పుస్తకం, కలక్టరు ఆఫీసు ఎదుట, ఒంగోలు.

e book : www.kinige.com

ప్రింటింగ్ :
శ్రీశ్రీ ప్రింటర్స్
విజయవాడ - 520 002
సెల్ : 9490634849

వెల : రూ. 40.00

నా మాట

గబ్బిలాన్ని వచనంలోకి తీసుకురావటం అవసరమని హేతువాద పత్రిక నిర్వాహకులు, మిత్రులు శ్రీ భానుప్రసాద్ గారంటే, ఒక సంచికకు అట్లాగే రాశా తరువాత ఇది పూర్తిగా పుస్తకరూపంలో తొందరగా వస్తే మంచిది. పత్రికలో నెలకోసారి చదవటం బాగోలేదంటే, పత్రికకు రాయటం మానేసి, మొత్తంగా పుస్తకరూపంలో ఈనాటికి వేశాం.

జాషువా గబ్బిలం – వచనంలోకి రాయటం సాహసించి చేసినపని, ఆయన శైలీరమ్యత నాన్యతోదర్శనీయం. దాని రామణీయకతను వచనం లోకి తేవటం దుర్లభం. అయినా ప్రయత్నించా.

కవికి కావలసిన భావావేశం ఆయన సొత్తు. కొద్దోగొప్పో నాకూ ఆ ఆవేశం వుంది కాబట్టి, భావ ప్రకటనలో లోపం లేకుండానే చేశాననుకొంటా. ఒక రకంగా చెప్పాలంటే, సమాజంతో రాజీపడని మనస్తత్వం – అభిప్రాయాలు కలవాణ్ణి కాబట్టి, జాషువా గబ్బిలంలోని భావాలకు ఎక్కడా లోటురానీయకుండా వచనంలో రాశా.

రసజ్ఞులు – వివేకులు – గ్రహిస్తారని ఆశిస్తా. నెరసులు తప్పకుండా వుంటాయి. గుణగ్రహణులైన మిత్రులు సద్భావంతో సూచించే సూచనలను తరువాత ప్రచురణలో పాటిస్తా.

– రామకృష్ణ

ముద్రాపకుల మాట

జాషువాగారు కీర్తిశేషులై ఈ జులై 24కి 42సంవత్సరాలు. రామకృష్ణగారు కీర్తిశేషులై ఆరు సంవత్సరాల మూడు మాసాలు.

జాషువాగారి ఆరుడజన్ల పద్యకావ్యాలలో రామకృష్ణగారు వచన నేత కోసం 'గబ్బిలం' మాత్రమే ఎంచుకోవటం, అదీ 1994-96లలో ఆ పనికి పూనుకోవటం, ఒక సామాజిక అవసరాన్ని గుర్తించి చేసినపని. దళితజనుల్లో తెలుగునాట నలుచెరుగులా, 1970ల నుంచి, మొలకలెత్తుతున్న చైతన్యపిలకలను శూద్ర భూయజమాన్య కులాలు చిదిమివేస్తున్న ముష్కర సమయమది. అసమ బ్రాహ్మణీయ సాంఘిక వ్యవస్థ నిర్మూలన అనునిత్య కృషీవలుడు, రామకృష్ణలోని చార్వాక సాహితీవేత్త దళితులపై దాడులను ఎదిరించటంలో భాగంగా వచనగబ్బిలంను తెలుగునాట ప్రగతిశీలురకు 1996లో అందించారు. ఆ మొదటిముద్రణకు రామకృష్ణగారే ముందుమాట (నామాట) వ్రాసారు. హేతువాద పత్రిక నిర్వాహకులు డా॥ భానుప్రసాద్‌గారు ఈ అవసరాన్ని గుర్తింపజేశారని, తన ఒకానొక శిష్యుడు, తాండూరు నివాసి జి. సోమశంకర్ ఉత్సుకతతో అచ్చుచేయించారని రామకృష్ణగారు పేర్కొన్నారు.

కారంచేడు, చుండూరుల్లోని దళిత హత్యాకాండకేమాత్రం తీసిపోని దళిత నరమేధం 12జూలై 2012న లక్ష్మింపేటలో జరిగింది. మూడుచోట్లా దాడిచేసింది భూయాజమాన్య కులాలవారే. కారంచేడు, చుండూరు దళిత నరమేధల సందర్భంగా సాగినంత ఉధృతంగా ఉద్యమం లక్ష్మింపేట సందర్భంగా సాగకపోవటం ఒక బాధాకరవాస్తవం. అగ్రకుల పాలకవర్గాలు విసిరిన రిజర్వేషన్ల వలలో చిక్కుకున్న మాల, మాదిగ సహోదరులు ఆగర్భ శత్రువుల్లా వ్యవహరించటం ఒక ముఖ్య కారణం కాదా, అని సహోదరవర్గాలు రెండూ సమీక్షించుకుని, కలగలసి, ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా నిలబడాలి. 'స్వతంత్ర భారత ఫలితాన్ని చవిచూడాలె'. "ఎవడో వీరవసంతరాయుడనే దేవుడు పుట్టి, దుష్ట శిక్షణ, శిష్టరక్షణ, సహస్రముఖాల చాటుతాడని చెప్పి, బేజారై కూలబడ్డ నాగుండెల్లో భయాన్ని చిమ్ముతున్న రీయనృత ప్రచారకులు" అన్న నవయుగ కవిచక్రవర్తి జాషువ మాట మది నిలపాలి.

గబ్బిలంకు సరితూగగల సాంఘిక కావ్యం మరొకటి భారతఖండంబున... కాదు, కాదు... నాగదేశమున లేదని విజ్ఞులందరూ అంగీకరిస్తున్నారు. నిరుపేద దళిత జాతి దీన పరిస్థితి, సమాజంలోని వివిధరకాల మూఢాచారాలు, అధికార పదవులలో వున్న

లంచావతరాలు... వీటన్నింటిపట్లా జాషువాగారికున్న ఏవగింపును, ఆయన దేశభక్తి, తెలుగు భాషాభిమానాలను తెలుగు యువజనులందరూ హృదయాల నిలుపుకుని, "శల్యసారథ్యం చేస్తున్న... మతరూప క్రూరసింహంను తిరస్కరించి, 'హక్కులన్నీ దోచుకున్న దొంగలపట్ల క్షమా సిద్ధాంతం' పనికిరాదని గ్రహించి, 'మాల, మాదిగలు... తెగలుగా ఏర్పడి వివాదాలలో తలమునకలౌతూనేవుంటే... నటుడిలాగా కాలపరిణామ విధేయులై ఎదురులేకుండా పెత్తనంబు వెలగబెట్టే ఘోరమత శాసనాలు ఈ దరిద్రుడిపై అధికారం చెలాయిస్తూ"నే వుంటాయన్న విషయాన్ని సుబోధకం చేయవలసిన అవశ్యకత వుందని భావించి, రామకృష్ణగారి వచనగబ్బిలం రెండవ ముద్రణకు పూనుకున్నాము.

ఈ రెండవ ముద్రణ సందర్భంగా నాకు హార్ధికంగా సహకరించిన సహృదయులందరికీ, ప్రత్యేకించి శిఖాఆకాష్, తాటి శ్రీకృష్ణ గార్లకు; అడిగిన వెంటనే చక్కని, చిక్కనైన 'గబ్బిలం రామకృష్ణ' అనే పీఠిక వ్రాసియిచ్చిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, పుస్తక ఆవిష్కరణకు తమ కళాశాలలో చోటిచ్చి, అధ్యక్షత వహించిన లయోల కళాశాల ప్రిన్సిపల్ కిశోర్ గారికి, పుస్తక ఆవిష్కరణకు అంగీకరించిన విశ్రాంత జిల్లా జడ్జి సత్యన్నారాయణ రెడ్డి గారికి, అడిగినంతనే అమూల్యమైన ముఖ చిత్రం యిచ్చిన ఆర్టిస్టు అక్బర్ గారికి, పుస్తకాన్ని అందంగా అచ్చువేసియిచ్చిన శ్రీశ్రీ ప్రింటర్స్ వారికి – అందరికీ కృతజ్ఞతలు.

తన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా విజయవాడవచ్చి ఈ పుస్తక ప్రచురణ కృషిలో నాకు నిరంతరం అండగా నిలిచిన నా జీవిత సహచరి సరోజను మదిదలంచుకొనుట నా కర్తవ్యం.

రామకృష్ణగారి 'వచనగబ్బిలం' రెండవ ముద్రణకు నాకు అనుమతి ఇచ్చిన రామకృష్ణగారి జీవిత సహచరి గృహలక్ష్మి గారికి సదా కృతజ్ఞతలు.

చదివిన వారెల్ల ఒక్క కార్డుముక్క వ్రాసినచో సంతోషిస్తాను. ఇది పాయసి ప్రచురణల తొలి పుస్తకం.

22-07-2013,
విజయవాడ.

– సి భాస్కరరావు
పాయసి ప్రచురణలు
9492230198

గబ్బిలం రామకృష్ణ

నాకు హేతువాదులంటే గౌరవం. కోతు వాదులంటే కోపం. రామకృష్ణ చార్వాక, హేతువాద భావాలకు ఏరువాక. మనమధ్య మసలిపోయిన అసలైన మనుషుల్లో ఆయనొకరు. రామకృష్ణ గారిలాగా జీవించటం రామకృష్ణ లాంటి వ్యక్తులకే చెల్లుతుంది. అబద్ధమైన జీవితంలోని హాయినీ స్థాయినీ అనుభవించే వ్యక్తులనీ చూస్తాం కానీ నిబద్ధమైన జీవితంలోని నిలకడనీ నిర్మలత్వాన్నీ, సేవతత్వాన్నీ, రామకృష్ణ గారి లాంటి మహోన్నత వ్యక్తుల్లోనే దర్శిస్తాం. బుద్ధుడిలాగా కోరికల్ని జయించడం. క్రీస్తులాగా సిలువెక్కి త్యాగమూర్తులుగా జీవించలేం. "మనిషి మనిషినే ఎంతో దుష్కరమ్ము సుమ్ము" అన్నాడు మహాకవి గాలిబ్. మనకాలంలో మనిషిలా కాదు గొప్ప హేతువాద సాహిత్య వత్తగా నిలచిన నిత్యస్మరణీయుడు రామకృష్ణగారు.

ఆయన గబ్బిలం వచనాను వాద పుస్తకం నాకు పంపించారు. నన్నెంతో ఆబగా చదివాను. ఆయణ్ణి 'గబ్బిలం రామకృష్ణ'గా సంబోధిస్తూ ఉత్తరం గూడా రాశాను. చాలా మందికి పైకి అర్థమయ్యేటట్లు కనిపిస్తుంది కానీ గబ్బిలం అంత సులోభకం కాదు. దానికి సాధన కావాలి. సాహిత్య సంపత్తి కావాలి. ఈ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి కనకన రామకృష్ణగారు అలవోకగా నల్లేరు మీద బండిలా అనువాద రచన రాశారు. ఈ వచనం పచనం చేసి ఉలవచారులో వెన్నపూస కలుపుకొని తిన్నంత రుచిని కలిగించారు. మహాకవి జాషువ గారికి మన రామకృష్ణ గారికి గట్టి పరిచయాలే ఉన్నాయి. విద్యార్థి దశనుంచి రామకృష్ణగారు జాషువ అభిమాని అన్న విషయం ఆయన రచనల్లో ప్రస్ఫుటమవుతూన వుంటుంది. ఆ రోజుల్లో శూద్రులైన ప్రాచ్య కళాశాల విద్యార్థులకు అబ్రహ్మణ కవిత్రయమైన త్రిపుర్నని, జాషువ, ఏటుగుడల మీద ననవని శ్రేయాభిమానాలుండవి. ఎందుకంటే ఓరియంటల్ కళాశాలల్లో బ్రాహ్మని పండితుల ఆధిపత్యం, బ్రాహ్మణ విద్యార్థుల ఆభిజాత్యం కయ్యానికి కాలు దువ్వుతూ ఉండేది. వాళ్లతో సమానంగా సరిజోడుగా రామకృష్ణ లాంటి ప్రతభ వంతులు వ్యాకరణంలో అసాధారణ ప్రజావంతులు ఉండేవాళ్లు. చరిత్రను తవ్వుకుంటూ పోతే దువ్వుల నుంచి చాలమంది నవ్వుకుంటూ కనిపిస్తారు. అలా జాషువ గారి మీద, ఆయన భావజాలం మీద, ఉన్న ప్రీతితో తనదైన రీతిలో ఈ అనువాదం చేశారు. నిజానికి 'గబ్బిలం' కావ్యం సాంఘిక సామాజిక కోణంలోంచే కాదు హేతువాద దృక్పథానికి కాగడా చూపిన తొలి ఆధునిక కావ్యం.

మొత్తం భారత దేశాన్ని ఈ విధంగా చిత్రించిన మహాకావ్యం మరొకటిలేదు. కాళిదాసుతో పోటీ పడగల ఏకైక కవి జాషువాయే. ఈ మాట నేనన్నది కాదు 'తెలుగు లెంక తుమ్మల సీతారామమూర్తి గారే ధంకా బజాయించి చెప్పారు.

తెలుగు నాట దళిత ఉద్యమ ప్రభావం ఎందరినో ఆలోచింప చేసింది. కొత్త ఆలోచనలకు దారితీసింది. కొన్ని వర్గాలు దళితులపై సానుభూతిని చూపాయి. ప్రగతి వాదులు అండగా నిలిచారు. ఆ నేపథ్యంలోంచే రామకృష్ణగారు 1996 సెప్టెంబర్‌లో 'గబ్బిలం' వచననువాదం అచ్చులోకి తెచ్చారు.

జాషువా పద్యాలు గద్యానికి లొంగవు. ద్యానికి సరిపోయే ఒరిపిడి రాయి మన దగ్గరుండాలి. జాషువా పద్యాలు కంఠంలో కమ్మగా మార్మ్రోగిస్తాయి కాని వచనంతో చదివించవనీ అభిప్రాయం ఒకటుంది.

రామకృష్ణగారు జాషువా స్వరాల రమణీయ శైలినీ ఆయన పద్యలాలిత్వాన్నీ సమాస చాతుర్యాన్ని, పద్యాంతాల అసమాపక వాక్య రీతిని చాల ఒడుపుగా పట్టుకున్నారు. 'గబ్బిలం' అన్న మహాభవనానికి అంతరాయం కలగకుండా అక్షరం అక్షరంలో దాని అంద చందాల్ని వచనపు నిలువుటద్దంలో చూపించడంలో రామకృష్ణగారు చాల వరకు కృత కృత్యులయ్యారు.

ఇవాళ కొత్త ప్రపంచకరణ తరంలో పద్యం చదివే వాళ్లు పలచబడిపోతున్నారు. ప్రబంధాల సంగతి పక్కన పెడితే మామూలు కావ్యాలు గూడా అర్థం చేసుకోలేక పోతున్నారు.

ఈ నేపథ్యంలో రామకృష్ణగారు గబ్బిలాన్ని అనువదించి తెలుగు జాతికి మహోపకారం చేశారు. ఇది ద్వితీయ ముద్రణ. ఇవాళ మూలకర్త లేడు వచనాను వాదకుడు లేడు. ఎవరున్నా లేకపోయిన 'గబ్బిలం' శాశ్వతంగా ఉంటుంది. జాషువా రామకృష్ణల్ని జాతి గుర్తించు కుంటుంది. తెలుగు భాష స్మరించుకుంటుంది.

సెలవు...

- ఎండ్లూరి సుధాకర్

9246650771

వచన గబ్బిలం

చిక్కిన కాసుతోటే తృప్తిపడే అమాయకుడు, బొక్కెడుబువ్వతో ఆకటి మంటను చల్లార్చుకొనే దీనమూర్తి, నాలుగు దిక్కులున్న లోకంలో తన కంటూ ఒక దిక్కులేని అరుంధతీ ముద్దుబిడ్డ భారత సవిత్రికి కడగొట్టు బిడ్డగా జన్మించాడు – పూప వయస్సులో వలస వచ్చిన ముద్దుల తెలుగు కవిత్వానికి అండగా నిలిచిన దక్షిణదేశాధీశుడైన రఘు నాధనరపాలుడు పాలించిన తంజావూరి మండలానికి దక్షిణ భాగంలో ఆ పరమ గర్భ దరిద్రుడు నీతి మంతుడుగా కాపురముండాడు.

ఈనిష్ఠ దరిద్రుడి కులాన్నీ – సంపదనూ కబళించి దేహంలోని రసాన్ని పీల్చి సమాజం పిప్పిచేసింది. భారత వీరుని పాదం ఎక్కడ కందిపోతుందోనని చెప్పులుకుట్టి జీవనం చేస్తూవుంటాడు. ఒక్కనాడైనా ప్రాలుమాలి తన ధర్మాన్ని విస్మరించలేదు.

భారత భూమి ఇతని సేవకు అప్పువడ్డది.

ఈతని రెక్కల కష్టం లేనిరోజున సస్యలక్ష్మి పండి పులకరించటానికి సందేహిస్తుంది. వాడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెడతాడు. కాని అతనికి మాత్రం భుక్తిగడవదు, అతని తలమీద పులిమిన బురదను కడిగి కరుణతో చూద్దామని ఆకాశగంగ కూడా తలంచదు. ఈతని నైవేద్యంవల్ల అంటుపడితే, త్రిమూర్తులకు గూడా కూడు దొరకదు.

పాముకు పాలు – చీమకు పంచదార – మేపుకొనే కర్మభూమిలో పుట్టిన ధర్మ దేవతకూడా, ఈ కటిక దరిద్రుడున్న చోట వుండటానికి వులికిపడే జబ్బు వుంది.

ఈతణ్ణీ ఉద్ధరించే దేవుడేలేడు; మనిషి మాత్రం ఎట్లా కనికరిస్తాడు? అతడు చేసుకొన్న పాపకారణమేదో, అతనికే యింతవరకు తెలియదు.

ఆ నిర్భాగ్యుడి రక్తాన్ని పారణచేసి, పెద్దమ్మ జీవనం చేస్తూ వుంటుంది. అతని గాలి సోకితేనే నాలుగు పడగల హైందవ నాగరాజు కసరి బుసకొడుతుంది.

కులం లేని నేను కొడుకుల్ని పుట్టించి, ఈ అఖాతంలోనే తోయాలి కదా! పుట్టు బానిసనైన నాకు పెళ్ళి యెందుకు? అని ఆలోచించి బ్రహ్మ చర్య దీక్షను జరుపసాగాడు.

ఒకనాడా నిరుపేద ఉదయం నుంచి సాయంకాలం దాకా రక్తమోడ్చి కష్టంచేసి, అటు సూర్యుణ్ణి సాగనంపి – ఇటు తానింటికొచ్చాడు. ఉన్న కలోగంజో తాగి, పక్కమీద

మేను వాల్చాడు. ఏనుక్కి మదం కమ్మినట్లుగా కటికచీకటి రోదసీ గర్భంలో కమ్మింది. మహానటుడు శివుడు సంధ్యా నాట్య క్రీడమాని శివారవాల్ని ఆరంభించాడు.

ఆ సమయంలో ముక్కు మొకం వున్న చీకటి ముద్దలాగా వున్న గబ్బిలం వొకటి ఆ పేదవాని కుటీరంలో తిరగటం మొదలెట్టింది. దాని రెక్కల గాలికి, ఆ నిరుపేద చిన్ని ఆముదపు దీపం అల్లన ఆరిపోయింది.

గుడిసెలోని దీపాన్ని ఆరిపి దయ్యపు పిల్లలాగా తిరుగుతున్న ఆ ముని పక్షిని చూచేటప్పటికీ, ఆ నిర్భాగ్యుని మనోవీథిలో కొత్త కొత్త వూహలు చిగురించాయి. దుఃఖంతో కందిన మనస్సులోని తన వృత్తాంతాన్ని చెలిమితో ఆ పక్షికి విన్నవించుకోవటం మొదలు పెట్టాడు.

ఈ మదోన్మత్త ప్రపంచంలో నిరుపేదలకు పులుగూ పుట్రాగాక, వేరే ఆప్తులుగాని చుట్టపక్కాలుగాని వుండరు. అతన్ని కన్నీటి ధారలు చారికలు గట్టి ఆ విషయాల్ని వ్యాఖ్యానిస్తున్నాయి.

ఓ పక్షి చెలియా! నీకు స్వాగతం! ప్రవిమల దేవాలయంలో నివాసం వుంటూ, మాలాంటి మనుష్యులు పొందరాని గౌరవంతో తులతూగే గబ్బిలాల రాణివి.

అమ్మా! నీ కొడుకులకూ తల్లక్రిందులుగా చేసే నీ తపస్సులకూ, గుడి గోపురాలకూ శుభమేకదా!

ఈ లోకమంతా కళ్ళుమూసి మైమరచి గాఢ నిద్రలో మునిగి పోయింది. ఇంతకాళరాత్రి నా యింటిలో ఏదో వెదుకుతున్నావు కానీ, ఇక్కడ లవలేశం కూడా ఆనంద కిరణాలు కనబడవు.

సోదరీ! నిన్ను బహిష్కరించు భూవలయం. ఇది అంటరాని వాడున్న నిషిద్ధమైన గృహం. నీవు సర్వదేవతల సన్నిధిలో ప్రసాదాలు ఆరగిస్తూ వుంటావు. ఎంతో పుణ్యరాలవు. తిండిలేని కటిక పేదల ఇంటిలోకి బేలతనంగా వచ్చావేమిటి?

ఇది హృదయం లేని లోకం సుమా! సాయం కాలం పడమటి దిక్కుగా, ఉదయాన తూర్పు దిక్కుగా నడచే సనాతన ధర్మధేనువులు పిదికిన పాలు పేదవాడికి దొరకవు – బ్రహ్మ మొదలైన దేవతలు భాగ్యవంతుడి ఆజ్ఞకు భయపడి ఏ మాత్రం పెదవిని కదల్పలేరు.

ఏటా బొమ్మల (విగ్రహాల) పెళ్ళిళ్ళు చేయటానికి వందలూ, వేలూఖర్చు చేస్తారు. కానీ, ఆకటి చిచ్చుచే దుఃఖితులైన పేదల పకీరుల ఖాళీ పాత్రల్లో ఒక్క మెతుకు కూడా ఈ భరత భూమి విదలించదు.

ముప్పై మూడు కోట్ల దేవతలు ఎగబడ్డ ఈ దేశంలో పేదవాడి ఆకటి మంట చల్లారుతుందా?

అమ్మా! లోభ మనస్తత్వంతో గురువులు ఎల్లపుడూ ఏదో పరమార్థం చెపుతున్నట్లు

బోధచేస్తూ వుంటారు. ముక్కుకు సూటిగా వుండే యుక్తులుపన్ని 'మహాపరాధినని' చెప్పి మోక్షమార్గం చూపిస్తారమ్మా!

'నేను లేకపోతే వేదాంతరథం సాగదని' – దాంభికాన్ని ప్రదర్శిస్తారు.

పక్షి సన్యాసినీ! సంసారం దిద్దుకుంటూ, ఉన్నత స్థానంలో నివశిస్తూ పగలంతా ముని వృత్తిలో వుంటావు ఇంతరాత్రి వేళ కష్టాల కడలిలలో తేలియాడే దరిద్ర మూర్తులను ఓదార్చటానికి వచ్చావా? ఎంత దయామయురాలవమ్మా – నిజంగా అకలంకమైన మర్యాదకు తగినదానవు. నన్నోదార్చటానికీ కొండల గుండెలు కరిగి సెలయేళ్ళ రూపంలో నలుదిశలా పారుతున్నాయి – కాని, సోదర ప్రజల కళ్ళవెంట ఒక్క కన్నీటిచుక్క గూడ వెలువడదు.

సూర్యునితో సమానమైన తేజస్సుగల వాళ్ళు – యోగవిద్యానిధులు – పుట్టకతోటే తపస్సు చేసే వృత్తిలో వున్న వాళ్ళు – దయామయ మనుస్కులు – పరుల శ్రేయస్సును కోరేవాళ్ళు – మహాత్ములు పక్షిరాజైన గరుత్మంతుని స్తుతినాలకించి చెట్టు కొమ్మల్ని విడిచిన వాళ్ళు – అయిన వాలఖిల్య మునీంద్రులు నీకు చుట్టా లేగదమ్మా నీకు నమస్కరిస్తా! దయ చేసినా విజ్ఞప్తిని ఆలకించవా?

పిట్టలరాణీ! ఈ ప్రశాంత రాత్రి సమస్త లోకాన్ని బుజ్జగించి నిద్రపుచ్చుతోంది. కాని, మందులేని అంటరాని తనపు వ్యాదితో బాధపడే దురదృష్టవంతుణ్ణి నన్ను మాత్రం మరచి పోయింది.

కర్మ సిద్ధాంతం పేరుతో నోరు కట్టివేసి స్వార్థలోలురు నా భుక్తిని అనుభవిస్తున్నారు. కర్మ – అంటే ఏమిటో? దీనికి నాపై కక్ష దేనికో? ఈశ్వరుడితోటే రుజువు చేయించు.

ఆలయంలో నీవు వ్రేళాడుతూ వుండేప్పుడు శివుడి చెవి నీకు కొంత దగ్గరగా వుంటుంది పూజారిలేని వేళచూచి నా జీవిత చరిత్రను విన్నవించు.

చాలా పొద్దుపోయింది; రాత్రి స్త్రీకి వయసుమీదబడి ముసలితనం పైన బడ్డది. అదుగో! ఆమె జుట్టు తెల్లగా అయింది. వేట వ్యాపారం ముగించుకొని నీ పొరుగు గూబలు గూళ్ళకు చేరుతున్నాయి.

తళుకులీనే నీ రెక్కల గాలితో విసరి, నా శ్రమను పోగొట్టావు. నాపై ప్రేమను కురిపించావు. నీవు గావించిన ఈ గొప్ప ఉపకారానికి, తిరిగి నేనేమీ బహూకరణ ఈయలేను. ఈ విషయంలో నీకు అప్పుపడ్డా.

పక్షిణీ! నీవు నమస్కరిస్తే, వాటికి గర్వించి నిక్కి నిక్కి నడవటానికి నాకు ఉద్యోగ బలంలేదు, నీ కళాశక్తిని చూచి అసూయ పడటానికి నేను కులము యోగ్యతలున్న వాడినిగాను. అంతేగాదు, స్వార్థంతో నిన్ను పనిముట్టుగా వాడుకోవటానికి కడుపునిండిన భాగ్యవంతుణ్ణి కాదు; తప్పులు చూపి, నీతిని బోధించి దొరతనం చెలాయించటానికి మతస్థుణ్ణీ కూడా కాను.

గబ్బిలపు జెలియా! జంతులక్షణాలూ – పక్షిలక్షణాలు కలిగి విచిత్రమైన ఆకారాన్ని దాల్చిన నీ మొకం చూడటానికి ఈ లోకం అంగీకరించదు ఇట్లాంటి శకునాలుకానీ – పాత పట్టింపులుకానీ – ఈ పేదవాడికి లేవు హాయిగా రావచ్చును, రా.

నా మనస్సులోని దిగులును పోగొట్టి ఈశ్వరుడికి నా సందేశాన్ని అందిస్తావా?

ధర్మానికి పిరికితనం ఎప్పుడూ లేదు; సత్యవాక్యానికి చావులేదు; నీవు సృష్టివి – ఈశ్వరుడు సృష్టికర్త – విశ్వనాథుడి ముందు నిలబడటానికి నీవు భయపడవలసిన పనిలేదు.

పరోపకారిణీ! మనుషులు చేరటానికి వీలుకాని – నివాసస్థానాల్లో వుండే పరమేశ్వరుడికి నా నమస్కారాలను కానుకగా యిమ్ము, ఒకవేళ ఏదైనా కారణం వల్ల ఈశ్వరుడు ఇక్కడలేకుండా వెండికొండమీద వుంటే, అక్కడికిగూడా వెళ్ళు; అది నీకు పెద్ద కష్టంగాదు. ఒకపూట ప్రయాణం సరిపోతుంది.

ఆకాశంలో తెల్లగా దూది పింజలు చల్లబడ్డట్టుగా, ఉత్తర దక్షిణాలకు దారిలాగా కనిపిస్తుంది. అది పాలపుంత. దాన్ని కాశీకి పోయేమార్గమంటారు. ఆదారినే పోయావంటే, భూతస్వామి ఈశ్వరుడు నీకు కనిపిస్తాడు. సూర్యోదయమైతే, నీకు చత్వారం వచ్చి దారి తప్పుతావేమో గదా!

గొడుగులాగా రెక్కలి పర్చుకొని, ఆకాశంలో నీవు ప్రయాణం చేసేటప్పుడు మేఘుడు చిత్త జల్లుల ముత్యాలను నీ మీద చల్లుతాడు.

ఖగభామినీ! లేత సంధ్యా సమయకాంతులకు కెంపులెగజిమ్మినట్టున్న పడమటి కొండపై కాలూని – సెలయేటి నీటిలో ఈతలు కొట్టి విహరించే చల్లని పిల్లగాలులచే సన్మానం పొంది – ఎత్తైన కొండ కొమ్ములకు తాకి తురాతునలైక మేఘువు గుంపు మీద గంతులేసి – కలహంస పొదిగి పిల్లల్ని చేసే ఆకాశగంగ అరణ్యభూముల్లో తిరిగి – చిలుకలు కొరికితే తేనెలూరే తీయటి పండ్లారగించి, కొన్నాళ్ళపాటు ఈ కుటిల సంసారపు దిగులు మరచిపోయిరా!

అమ్మా! సాత్వికాహారిణీ! తపస్సు చేయటంవల్ల నీ మనస్సు చల్లని జాలి వెన్నెలతో విలసిల్లుతుంది. నా కన్నీటి గాథను అర్థం చేసుకోవాలంటే, ఆర్ద్ర హృదయం కూడా కొంత అవసరం.

బిడ్డల్నికని పాలిచ్చే దొడ్డ తనం వున్న పక్షిదొరసానివి. నాకడ్డుపడటానికి దిగివచ్చిన కామధేనువవు. నా మనవిని ఆలకిస్తావుగదా!

ఆయుష్మంతులైన నీ కుమారులూ – నీ మగడూ – దీనినంగీకరించి, నీ ఔదార్యగుణాన్ని సందేహించకుండా మెచ్చుకొంటారు. ఎత్తైన కొండ కొమ్మలలోని శివుడి వాసస్థానంలో ఊయేలలూగి కృతార్థురాలవై తిరిగిరా!

పక్షిరమణీ! నీ చిన్ని పొట్టలో యింత నీరు – యింత ఫలహారం వుంటే చాలు, ఎన్ని దేశాలు తిరిగినా నీకు కొదువలేదు. నీవు నాలాగా పుట్టుబానిసవు కావు.

ఒకవేళ నీకేదైన ఆలస్యమయినా ఫరవాలేదనుకొంటే, దారిలో ఎదురైన గుళ్ళూ – గోపురాలూ చూస్తుపో; ఆకాశంలో పయనించే నీకు అడవులూ – కొండలూ – అడ్డురావు. సుడిగాలులు చెలరేగితే ధర్మసత్రాలలో వుండవచ్చు. కానీ, పిడుగులు పడ్డా పాపినైన నాకు మాత్రం అక్కడ ప్రవేశించే యోగ్యతలులేవు.

అక్కడక్కడా ఫలాలతో నిండిన వనాలలో విందు ఆరగిస్తూ, విశ్రామ మణీ మందిరాలలో నిద్రిస్తూ ముందుకు సాగిపో, అట్లా వెళుతూ వుంటే, యెన్నో పుణ్య స్థలాలు కంటికి కనిపిస్తాయి.

అందాలు చిందే తంజావూరికి సమీపంలో తెలుగు సువాసనలు గమగమ గుబాళించే ప్రదేశం వుంది. అది రఘునాధ రాయల ఆస్థాన భూమి.

శ్రీకృష్ణదేవరాయల యెడబాటు చీకట్లు తెలుగుదేశపు నలుమూలలా ముసురుకొని మసలే సమయంలో – గొప్పదైన తెలుగు సాహిత్యలక్ష్మి దారి బత్తెముతో తంజాపురం వంక తరళి వెళుతున్న వేళలో – చేమకూర వేంకటకవి తెలుగు భాషాలలితాంగి శ్లేషపలుకుల్ని అలవాటు చేసే తరుణంలో – పచ్చపచ్చని ముద్దుపళని ముద్దు కవిత్వం శృంగార రసాన్ని కురిపించే కాలంలో – ఘనుడైన క్షేత్రయ్య, మువ్వగోపాలుడి పూజ చేయటానికి గంటం అందుకొన్న రోజుల్లో – అపరకృష్ణరాయలు రఘునాధరాయలు సత్కీర్తిమణిమయ ప్రదేశాన్ని కట్టుకొన్నాడు.

దీనితో నీ శరీరం వుప్పొంగుతుంది. ఉప్పొంగుతున్న దేహంతో సరస్వతీ మహలు చూచి, తంజాపుర రాజుల సభను పరామర్శించి అక్కడి నుంచి వుత్తరానికి వెళ్ళు.

ద్రావిడ భూముల్ని దాటిపోయేటప్పటికీ, వాడిపోని శౌర్యాన్ని కళ్ళకు కట్టే, తెలుగు పొలిమేరలు నేత్రాలకు విందుచేస్తూ ప్రత్యక్షమౌతాయి.

యతీ – ప్రాసాలేని సంస్కృతభాషా కీకారణ్యంలో వున్న భారతమనే వేదంలో పదిహేను పర్వాలకు తెలుగు తనం కల్పించిన తిక్కనకు నివాసస్థానమైన నెల్లూరు నగరం గోచరమౌతుంది. ఆ పట్టణానికి నమస్కారాలు సమర్పించు, ఆ ప్రక్కనే వున్న దొడ్డదైన పెన్నా నదిలో స్నానమాడు.

ఒక్క పలుకులోనే నెల్లూరు నెరజాణలు సత్కవుల్ని కూడా తికమకలు పెడతారనే పుకారువుంది అది నిజమో? అబద్దమో?

తరువాత హంపీక్షేత్రం ఎదురవుతుంది. దాన్ని చూచిపో! ఒకప్పుడది తెలుగు రాజ్యపు సిరిసంపదలకు కేళీరంగం. కాని, నేడు ఆ సంపద మెరుపులు ఆరిపోయాయి. నీ

బంధువులు చాలామంది కొంపలుగట్టుకొని అక్కడ నివాసం వుంటున్నారు. వాళ్ళంతా నీకు ఆనందాన్ని సమకూరుస్తారు.

ఆ రోజుల్లో సిరికి పరదా పద్ధతీమానిపారో–! యేమో! రత్నాలను రాసులు రాసులుగాబోసి హంపీ వీధుల్లో అంగళ్ళలో అమ్మారు. మూరు రాయల గండడైన కృష్ణరాయలు ఆంధ్రదేశాన్ని పాలించిన నాటి గొప్ప తనాన్ని తలచుకొంటే నేటికీ ఒడలు పులకరిస్తుంది.

అసూయతో శత్రుభూపతులు కరకు కత్తుల్ని చేబూని శరీరాన్ని నజ్జు నజ్జుగావించినా కళ్ళల్లోపొగలు సమసిపోకుండా భీకరాకారుడిగా వున్న ఉగ్రనరసింహుడి ముందు ఒక్క నిమిషం నీవు నుంచోగలిగితే వీరయోధులు నిన్ను ధైర్యవతిగా లెక్కిస్తారు.

ఏనుగులాంటి రాతిగణేశుని విగ్రహం ఒకటి ఆ హంపీలో వుంది. దాని నిగనిగలు నేటికీమాయవు; ఆ గణేశుని నున్నటి బొజ్జ మీద తుమ్మెద కూడా కాలు ఆనించలేదు. శిల్పకళా సౌందర్యాన్ని తుంగభద్రానికి అప్పగించి, దద్దమ్మలైపోయిన తెలుగువారి విద్యానగరంలో కానుకగా ఒక కన్నీటిచుక్క రాల్చు.

సరసుడైన కృష్ణరాయ నరపతి స్వారి చేసిన పారసీక గుర్రాల గిట్టలతో దున్నిన భూముల్లో ఆనాడు తెలుగు సుందరీమణులు దిగంతాల వరకు విజయాంకురాలను నాటుకొన్నారు. అవి ఫలించిన సుప్రతిష్టలను గరిసెలనిండా నింపారు.

ఓ మునిపక్షినీ! మూరు రాయరగండ బిరుదాంకితుడైన కృష్ణ రాయలీనాడు విద్యానగర రాజవీధుల్లో వూరేగడు; పారశీక గుర్రాల బేరగాళ్ళు ఈ రోజున అక్కడ పట్టుదేరాలు వేయరు; మదించిన భద్ర గజాలు ఇనుప రోకళ్ళతో ఈదినాన సాధన చేయటం లేదు; మరఫిరంగుల తెల్లదొరల దండు ఈ పూట తెలుగు సైన్యాన్ని భర్తీ చేయదు; మణిమయమైన ఆంధ్ర సామ్రాజ్య రధం పదహారో శతాబ్దంలో భూమిలో కుంగిపోయింది; కృష్ణరాయల రాజధానీ నగరంలో తెలుగు ప్రొద్దు కూకింది; అంతే – ఇంతవరకూ తెల్లవారనే లేదు.

కంచర్ల శ్రీకృష్ణజనపాలుడు పాలించిన నగరాన్ని దున్నించి నారుపోసి, వినుకొండ సార్వభౌముడు రాయన భాస్కరుని కోట బురుజులు ఒక్క వూపుతో నేలకొరిగేట్టు తన్ని, పల్నాటివీరుల మేటి మగటిమి నిప్పు కలను నాగులేటి నీటిలో కలిపి, సాటిలేని కొండవీటి సామ్రాజ్యపు టొన్నత్యాన్ని ఉక్కు కత్తుల బావికప్పగించి, నులివెచ్చని నెత్తుటి కాలువలో చేతులు కడుగుకొన్న కాలపురుషుడి భయంకర దుండగాలను తలచుకొని – మనసులో – లోలోన కుమిలి నలిగిన గుంటూరు మండలాన్ని పరామర్శించి వెళ్ళు, నీజన్మ ధన్యమౌతుంది.

అమ్మా! పక్షి సుందరీ! సూర్యుడికి వన్నె బెట్టే యిద్దరు భాస్కరులు పాలించగా తన మేనుకి సొగసులు దిద్దుకొన్నది గుంటూరు సీమ. తక్కిన సీమలలో ఇది చాల పెద్దది.

అనవసరమైన పల్నాటి కోడిపందెపు తగాదాలలో తెలుగు వీరుల స్వచ్ఛమైన రక్తమూ – మహోన్నత శౌర్యమూ ఖర్చయి పోయాయి నేడు మాత్రం కారంపూడి తిర్నాళ్ళ వినోదంగా మిగిలింది.

ఆనాటి కత్తులు తుప్పుపట్టి, ఈనాటికీ ఆరాటాన్ని కలిగిస్తున్నాయి.

ఉత్తమోత్తమ కవులచే, మహోన్నత కావ్యాలను కృతులుగా స్వీకరించి, అత్యుత్తమ గ్రంధాలను రచించిన మేటి దానగుణ సంపన్న విభాసితులైన కొండవీటి రాజుల ఔన్నత్యమూ – పతనమూ సమీప మందలి కొండల నలంకరించాయి.

జీవితంపై విసిగి – విరక్తిచెంది తెలుగు వీధుల్లో పిచ్చివాడుగా తిరిగిన మునిసన్నిభుడైన వేమన కవీంద్రుడు ఆశువుగా చెప్పిన కావ్యాలు చెవులకింపుగా దిగంతాలను తాకి ప్రతినినదిస్తున్నాయి; అలతి – అలతి పోలికలతో, చక్కని భావసంపదతో మాధుర్యాన్ని ప్రవహింప చేస్తున్నాయి.

అమ్మా! నీకు మేఘమాలిక దారి చూపిస్తుంది దాన్ని తోడుగా గ్రహించి, కృష్ణాతీరానికి ఆవలనున్న దివ్య – భవ్య ప్రదేశాలను తనివితీరా చూడు.

అక్కడ నుండి, తూర్పు చాళుక్య భూపాలుర రత్నమయ ఆ స్థానానికి – పండితమండలి రాజిత ప్రదేశానికి – కవిలోక బ్రహ్మ నన్నయ్యకు నిలయమైన రాజమహేంద్ర (రాజమండ్రి) నగరానికి వెళ్ళు.

శుక్ల పక్ష పాడ్యమినాటి చంద్ర కళలాగా కన్నడ సాహితీరంగం దినదినాభివృద్ధి చెందుతూవుంటే, దాని పురోభివృద్ధిని గాంచి మనసులో అసూయ పడి నన్నయకవి రాజరాజనరేంద్రుడి ఆజ్ఞతో ఈ రాజమహేంద్రవరంలోనే మొట్టమొదట తెలుగు కావ్యానికి శ్రీకారం చుట్టాడు.

పిండితే రసంకారే చెరకు గడలో రెండున్నర పర్వాలలో నన్నయ్య కవీంద్రుడు పాండవుల చరిత్రను పండించాడు. తెలుగు భాషా పాటవాన్ని తన రచనలో ప్రదర్శించాడు.

తూర్పు చాళుక్య భూపతి విష్ణువర్ధనుడినాటి గోదావరి నది నీకు స్వాగతం పలుకుతుంది.

వీరమాగాణాల్లో పుట్టినగరిక పోచకూడా ఆకర్షకంగానే వుంటుంది కదమ్మా!

పులుగురాణీ! ఆనాడు సారంగధరుడు లేనిపోని వట్టి అపవాదును నెత్తిమీద వేసుకొని కత్తులపాలైన సంగతి నీవు వినలేదా? నీతికి బలైపోయిన రాజనందనుడి దౌర్భాగ్యాన్ని వూహిస్తూ, నేటికీ పావురాలు చిత్రాంగి మేడల్లో మూలుగుతున్నాయి.

దారి చుట్టు ఆపుతుందని వెనుకాముందూ ఆడతావేమో? అట్లాంటిదేమీ పెట్టుకోక, ద్రాక్షారామ భీమేశ్వరుణ్ణీ చూచిపో.

ఆ భీమేశ్వరుడు సాటిలేని దయాస్వభావుడు; ముప్పూట గజ్జెగట్టి నాట్యం చేస్తాడు; ఎంతో ప్రభావం వున్న వాడు; అతడు సాక్షాత్కారమైతే, తరతరాల నుండి పలుయాతనలకగ్గమైన నా జాతి వుద్ధరింపబడుతుంది.

అమ్మా! పక్షిణీ! బద్ధకించక ద్రాక్షారామ చాళుక్య భీమేశ్వరుణ్ణి చూచిపో.

నిగనిగలాడే నీమేని కాంతిని కాంచి, లేతకస్తూరి ముద్దవని తలంచి కన్నియలు ముచ్చట పడతారు. కవిసార్వభౌముడు శ్రీనాధకవికి బహూకరణమీయాలని వొద్దికగా ముచ్చటిస్తారు కూడా.

ధగధగ మెరిసే సూర్యకాంతి మణులతో అలంకరింపబడ్డ అలల రధమెక్కి ప్రాణనాధుని దర్శనానికి పరుగులు తీసే గోదావరితోపాటు నీవు కూడా దక్షవాటి నగరానికిపో.

పతగీ! అమృతాన్నీ – విషాన్నీ వాక్కులో ఇముడ్చుకొన్న కవి రాక్షసుడికి నివాసమైన అందమైన పట్టణమది. దాన్ని అపరకాశి అని అంటారు. ఎంతో మహిమగల ప్రదేశం.

ఆ తరువాత బొబ్బిలికోట కనుపిస్తుంది. అది బుస్సీదొర కొల్లగొట్టిన మావెలమవీరుల దుర్గం – దాన్ని చూచి ఆవలకు దాటిపో. అనన్య సామాన్యమైన ఆ వీరుల ప్రఖ్యాత పరాక్రమ జ్వలనం ఇప్పటికీ వూర్పులు చిమ్ముతూవుంది. దాన్ని చూస్తే, దేహంలో తీవ్రావేశం ఉప్పొంగుతుంది; జీవనాళాలల్లో నులివెచ్చని వీరరక్తం పొంగులు వారుతుంది.

అదుగో తొలికోడికూస్తుంది.

'నా మీద జాలిచూపకుండా కాళ్ళకు కత్తులు కట్టి ప్రాణాలను తీసే రాచమూకను తెల్లవార్చా; నాగోడు వినని అనంత గాఢాంధ కారాలకు తెల్లవారతుందా? అనిబడాయిపోతూ, తపతపమని రెక్కలు కొడుతూ– కొక్కొరో! కో...! – అనికూస్తుంది విను.

దాని ప్రక్కనే పూసపాటి వంశధరాధి పతుల ముఖ్య పట్టణమైన విజయనగరం వుంది. ఆ మహానగరంలో విశ్రమించి, ఆనాడు రాయరావుతుల గుర్రాల దండు ప్రపంచం దద్దరిల్లేలా సకిలించింది.

కృష్ణరాయలు కరవాలంతో కొలిచి, పరిష్కారం చేసి, ఒరిస్సా దాకా సరిహద్దుల్ని నిర్ణయించి గుర్తుగా పొట్టునూరి దగ్గర విజయస్తంభం నాటాడు. ఆ విజయ స్తంభంపైకెక్కి దేవకన్యలు ఆంధ్రుల పౌరుష సంపదను ఏకకంఠంతో పఠిస్తూ వుంటారు.

నీవు బొబ్బిలి విడిచి, మన్యాన్ని దాటి కొన్ని ఆమడలు పోయేటప్పటికి మన జిల్లు తెల్గుశోభ పలుచబడిపోతుంది. ఓడ్ర (ఒరిస్సా) వాతావరణపు సువాసనలు గుబాళిస్తాయి.

మధురంగా వుండే తేటనీటితో దిగంతాలదాకా విస్తరించి, రుచుల్ని గుస్తరించుకొన్న 'చిలుక సముద్రం' ఇంపు గొలుపుతుంది. అది నిజంగా, స్వచ్ఛమైన తెలుగు భాషలాగా వుంటుంది.

మెల్లని పిల్ల గాలులకు పుట్టిన అలల గుంపులు, ఈ చిలక సముద్రపుతీరాలను

తాకి వెనుదిరిగి పోతాయి. అంతేగాదు, చిలిపి కవిత్వంలాగా తీరాన్ని దాటాలని కూడా చూస్తూ వుంటాయి.

సాత్వికాహారిణీ! ఇంకా ముందుకు పోతే, మార్గ మధ్యంలో నీకు భౌద్ధ స్థూపశిధిలాలు కనిపిస్తాయి.

మగధ భూమీశులరాణి వాసాలు, రంగారు బంగారు సౌధాలు నీకంటబడతాయి.

నిఖిల ప్రపంచం – 'సాహో' – అని నినదించిన శాక్యసింహుని అహింసా సూక్తి మధుర మకరంద స్రవంతిలో తేలియాడిన పుణ్యభూములైన, నలంద పాటలీ పుత్రనగరాలు దృగ్గోచరమవుతాయి.

మోక్షాన్ని ప్రసాదించే పుణ్యభూముల్లో కాశీ పట్టణం మొట్టమొదట లెక్కింప దగ్గది. కాశీ అన్నపూర్ణ చేసే, ఆహారభిక్షతో నీకు ముక్తి భిక్ష కూడా ముడుతుంది.

నదుల తోడికోడలు – సముద్రపు పెద్దభార్య – గంగానది నీళ్ళు తెచ్చి యిస్తే కాశీ అన్నపూర్ణాదేవి అతిధిసేవ చేస్తూ వుంటుంది.

పక్షిరమణి! కాశీ నగరం సామాన్యమైనదిగా భావించకు.

సకల కళా సాగరాలను గట్టులదాకా ఈదిన ధీవిలసితులైన పండితులు పెక్కురు ఆ నగరంలో వున్నారు. వేద – పురాణ – శాస్త్రాలను పలికిన సత్కవీశ్వరుడైన వ్యాసము నీంద్రుడు శిష్య సముదాయంతో ఒకప్పుడా కాశీ సంచరించాడు. కాలకంఠుడైన ఈశ్వరుడు విశ్వనాధుడి పేరుతో అక్కడ వుంటాడు.

జాబిల్లి గుర్తుగల మొగలాయీ చక్రవర్తుల హరితవర్ణ పతాకం రెపరెపలాడుతూమింట మెరిసే ఢిల్లీ నగరం నీకు కనిపిస్తుంది. అక్కడి మహోత్తుంగ, సౌధపంక్తి మేఘమాలికలతో సయ్యాటలాడుతూ వుంటాయి.

ఆ ఢిల్లీ నగరం ద్వాపర యుగంలో హస్తినాపురం పేరుతో ప్రశంసించబడ్డది.

ఆనాడు ధర్మరాజు ఆ సింహాసనాన్నధిష్టించి పాలించాడు. ధర్మజుడు తనకాలంలో సాటిలేని మేటి యాగాలనెన్నిటినో తన శౌర్య ప్రతాపాలకు గీటురాయిగా చేయించాడు.

నిజంగా...! కళ్ళున్నందుకు ఆ పట్టణం చూడదగ్గది సుమా! ఎనలేని బోగసౌరభాలిక్కడ వీస్తాయి.

పగవాడి రక్తం పరమళిస్తూవుండగా ద్రుపదతనూజ కొప్పును కుంతి కొడుకు ముడిచిందిక్కడే; సమస్త భారతలోకం కన్నీరు నింపుతూ వుండగా నాదరుషా కుఠారం కాంతులీనిందిచ్చోటనే; మొగలాయి సార్వభౌముడు షాజహాను ఆ స్థానంలో వెలుగొందిన పచ్చలు తాపిన మయూరాసనం ఠీవిలో మెరసింది ఈ ప్రదేశంలోనే; తన దోర్బలాన్ని వెలయించి పృధ్వీరాజు జయచంద్ర సుతను పెండ్లాడింది ఈ స్థలంలోనే; ఎన్నో యుగాలకథల్ని

తన పొట్టలో జీర్ణం చేసుకొని, నరపాలుర నెత్తుటిసెలయేళ్ళళ్ళో తేలి ముసి ముసి నవ్వులు వెదజల్లుతున్న ఢిల్లీ నగరపు సౌందర్యం తరిగి పోలేదు; దాని తల కూడా నెరియలేదు.

సులతానీ సులతానులు మణిమయమైన మేడల్లో నివాసం చేశారు. తమ తమ రాష్ట్రాలు కటిక దారిద్ర్యంతో, ఆకటిమంటతో కొట్టు మిట్టాడుతూవుంటే, ముత్యాలూ – రత్నాలూ పొదిగిన పాత్రల్లో ఇష్టమృష్టాన్నాలను సంతుష్టిగా భుజించారిక్కడ; సమస్త సంపదలతూగుటయ్యాలలో సుఖాలనుజుర్రాకొన్నారు.

ఆనాడు కుతుబుద్దీను స్థాపింప చేసిన కుతుబ్ మీనారనే పెద్ద గోపురం ఇన్ని శతాబ్దాలు గడిచినా, చెక్కు చెదరక తన శిల్ప విన్యాసాన్ని, ముగ్ధ మనోహరంగా కళ్ళకు కడుతూ చక చకాయమానంగా జిగేలుమనిపిస్తుంది.

చామనచాయగలది – కామజనకుని గారాలసతి– కాళింది, వినీలములూ – కోమలములూ – స్వచ్ఛములూ – అయిన తన అలల చామరాలను వీచి నీకు స్వాగతం పలుకుతుంది.

తనయుడి ఆరోగ్యం తనకు క్రమించేలాగా నమాజుచేసి అల్లాను సంతసింపచేసి మొగలాయీ పార్థివుడుబాబరు, హుమాయూనునకు ఆయురున్నతులు సృష్టిగావించిన వింతగాధ నీ చెవుల పండువుగా ఆగ్రా నగరం వినిపిస్తుంది.

పతగభామినీ! షాజహాను కన్నీటి కణజాలం – ప్రపంచ తరణి మణికంఠ సీమ దాల్చు ఏడవనగ – రాణిముంటాజమహలు నిద్రించే తాజమహలు దృశ్యం నేత్ర పర్వమై అద్భుతాన్ని గొలుపుతుంది.

తరువాత, మాయగోపాలుడు వేదరహస్యమగుగీతను బహిరంగం చేసిన పవిత్ర కురుక్షేత్రంలో విహరించిపో.

అమ్మా! పక్షిసుందరీ! ముల్లోక జనస్తుత్యుడైన బోధిసత్వధరణీ రమణుడు అర్ధరాత్రి – ఇంటినీ, ఇల్లాలినీ, కన్నకొడుకునూ విడిచి – శాంతి స్థాపనకోసం బిచ్చపు గిన్నె దాల్చిన పుణ్యప్రదేశాల్లో రెండు రోజులు మజిలీ చేసివెళ్ళు జన్మసార్థకత చెందుతుంది.

లుంబినీవనంలోని సుగంధాన్ని పులుముకొని వస్తున్న నీకు – నాడు గౌతమబుద్ధుడు ప్రేమతో ఆదరించిన బంగారుహంస, నీళ్ళు కలవని మధురమైన ఆవుపాలధారతో అర్ఘ్యమిస్తుంది.

అక్కడున్న ప్రాచీన భారతీయ శిల్పంలో బుద్ధ మహానుభావుణ్ణి చూస్తావు. శాక్యవంశ పురుష సింహుని కాలిజాడల్లో అహింసా మంత్రాన్ని సాధిస్తావు. అమర సింహుడి కవిత్వంలో బౌద్ధులు కావించిన సాహితీ సేవను తెలుసుకొంటావు. రెండువేల సంవత్సరాలనాడు గాఢనిద్రలోమునిగిన మౌర్యనరపతుల విశాల సామ్రాజ్య చరిత్రను ఏ కరువుపెట్టే ప్రకృతిలో ఆకళించి వెచ్చ వెచ్చని కన్నీటిని విడుస్తావు.

మునిపక్షీ! అక్కడనుంచి వుత్తదిశగా వెళ్ళే నీ చూపుల్ని అడ్డుకొంటూ హిమవత్పర్వతం దర్శనమిస్తుంది. ఆ పర్వతాన్ని యెక్కాలని ప్రయత్నించి, ఎంతోమంది తెల్లదొరలు మరణించారు, కానీ, నేటికి వాళ్ళ శరీరాలు శిధిలం కాలేదు. మంచులోవున్న మహత్తు చాలా గొప్పదిగదా!

మంచుబండలు కరిగి, బరువువల్ల పట్టుదప్పి, ఆ కొండ శిఖరాల నుండి క్రిందికి దొర్లుతాయి. కొండలోయల్లో తిరిగే జీవరాసులపై జారిన ఆ బండలుపడి వాటి ప్రాణాలను బలిగొంటాయి.

బలవంతుల స్నేహం పేదవాళ్ళకు చెరుపునే కలిగిస్తుంది.

అందులో ఎవరెస్టు శిఖరం చాల యెత్తుగా వుంటుంది. ఆ శిఖరాన్ని యెక్కి భారతదేశ పటాన్ని రాసుకోవచ్చు. నిజంగా దాని వున్నతి చుక్కలకంటె మించినట్లుంటుంది. కాని, లలిత లలితములైన కవుల వూహల్ని మాత్రం మించదు.

కలహంసలుపోయే వాయుమార్గాల రేఖలా కొండ శిఖరాలపై వున్నాయి. అవి యెంతో యెత్తున ఉత్తర – దక్షిణ దిగంతాలవరకు వ్యాపించాయి. అక్కడికి నీవు పోలేవు. దేవతలు నిత్యమూ గుంపులు గుంపులు గట్టి రాకపోకలు గావించే వెండి పర్వతపు ప్రదేశాలు అక్కడికి ఐ మూలగా కనిపిస్తాయి.

గబ్బిలాల రాణీ! మహితమైన కైలాస యాత్ర చేసే నిన్ను మంచుకొండల రాయడాదరిస్తాడమ్మా! కూతురికీ – అల్లుడికీ ఏమైనా వార్తలు పంపిస్తాడేమో? ఒప్పుకో: ఆ మాటలు నీకేమాత్రం బరువుగావు.

చిన్నతనంలో అస్త్రవిద్య నేర్చుకొనేటప్పుడు, పార్వతి చిన్న కొడుకు కొమరుసామి క్రౌంచ పర్వతానికి రంధ్రం వేశాడు తారకాద్రికి ఉత్తరాదిన అది కనిపిస్తుంది.

ఖగభామినీ! కొండలరాయుడు హిమవంతుడి చెలిమికి గుర్తుగా ఒక మంచుతునక శిరసుపై మోసుకెళ్ళు. గరళకంఠుడికది సిఫారసుగా వుండవచ్చు. పెద్దవాళ్ళ పరిచయం వ్యర్థం కాదమ్మా!

మంచును ప్రతిఫలింపజేసే ఆ కొండల శిఖరాలపై సంచరించే నల్లటి మేఘాలపై వుడాయించి వెళ్ళు. ఆ తరువాత మహేంద్రుడి పట్టణం త్రివిష్టపం కనిపిస్తుంది. అక్కడ యిప్పుడు దలైలామాలనే విచిత్రమైన రాజులు పాలిస్తూ వుంటారు. అక్కడి నందనవనాలలో అప్సరసలు క్రీడించరు.

ఆ లామాలకు పెళ్ళి పేరంటాలుండవు ఆ జన్మ సన్యాస దీక్షతో వుంటారు. తలపై పొడవాటి టోపీ వొకటి పెడతారు. వాళ్ళ అనుమతి లేకుండా ఆ నేలలో తిరగటానికెవ్వరికీ అవకాశం లేదు. అయినా, నీవు పక్షివి, నీవు పోగూడని ప్రదేశం ఈ లోకంలో లేనేలేదు.

ఈ దురాచారాలు ఆ రాజ్యం గూబపట్టుకొని యిష్టం వచ్చినట్టు ఆడిస్తాయి. పిచ్చి నమ్మకాలకా ప్రదేశం వాసస్థానం. అంటరానితనమనే భయంకరమైన బెబ్బులి విహరించే రంగస్థలం ఆ ప్రదేశం; కాని – బౌద్ధుల ఆరామాలు వాటి బౌద్ధత్యాన్ని కొంచెంగూడా సాగనీయవు. సాటిలేని రుచి రములైన నీటికి ఆటపట్టయిన మానస సరోవరంకన్న సంతానం గంగానది, ఆ నది క్రిందికీ పైకి ఎక్కుతూ దిగుతూవుండే కొండల చక్కదనం చూట్టానికెంతో ముచ్చటగా వుంటుందిగదా!

ఆ మాస సరోవరం చూస్తూవుంటే మహాసముద్రంలాగా వుంటుంది. లోతైన సరస్సులేవీ దానికి సాటిరావు.

ఆ సరస్సులో పుట్టిన ఉత్తుంగ తరంగ సంఘట్టనలకు, గట్టులను తాకి, ప్రాణాలు కోల్పోయిన గండుచేపలూ, ఎండ్రకాయలూ, ఆ తీర భూముల్లో గుట్టలు గుట్టలుగా పడివుంటాయి. చీకిపోయి, వాటి అవయవాలంతటా చెల్లాచెదరుగా వుండటంవల్ల అడుగుపెట్టటానికే వీల్లేకుండా వుంటుంది.

ఆనాడు దమయంతీనలులకు రాయబారం నడిపిన బంగారు హంస విభుని చుట్టాలు అక్కడేవున్న తామర పూదోటలలో నైషధ కథలను నేటికి ఆలపిస్తూ వుంటారు.

నిండిన దోర వెన్నెలలో నిక్కిన పచ్చికలు మేసి, చాందినీకొండ బయళ్ళలో తిరిగే గోపతి నీకు కనిపిస్తాడే. అక్కడే, శివుడి జటాజూటంలో పూచిన పూవు చంద్రకళ గోచరమవుతుంది. అయినా, రెక్కలున్న నీకు ప్రత్యేకంగా చెప్పటం దేనికి.

పక్షి చెలియా! ఇంకోసంగతి మరచిపోకు; ఆ భయంకరారణ్యాల్లో విల్లూ – అమ్ములూ ధరించిన చెంచులు కనిపిస్తారు. తూష్ణీం భావంతో దాటిపోక, వాళ్ళకు నమస్కారం చెల్లించు; మహాత్ముడైన యీశ్వరుడు భక్తుల కోర్కెలను తీర్చటానికై, ప్రమధగణాలతో పందుల్ని వేటాడటానికని చెంచు వేషంలో ప్రజల కళ్ళు గప్పి తిరుగుతూ వుంటాడు. అక్కడ తపస్సు చేసుకొనే మునిరాజులు నిత్య తపస్వినివైన నీకాతిథ్యమిస్తారు; పరుల విద్యను మెచ్చుకొనే స్వభావం వున్నవాళ్ళు. కాని, ఈ నాడీ గుణం కాగాడాపెట్టి వెదకినా కనిపించదు గదా!

తబిసి పక్షిణీ! ఇప్పటిక్కూడా పొగకమ్ముకొని చిమ్ముతున్న త్రిపురాల పాత బూడిద దిబ్బలు నీవు తిరిగే చోటుకు దగ్గరలోనే కనిపిస్తాయి. ఇది ఎంత చిత్రంగా వుంటుందో చూడు!

కారు మొయిలు శివుణ్ణి కొలిచి సాగిపోతూ వుంటుంది. మహిషాసురుడి కాంతల గుండెలు గుభేలు మనేట్టు, భూతాధిపతి అర్ధాంగి సింహరమణి గర్జిస్తుంది. దిక్కుల్ని మేలుకొలిపేట్టు కుమారస్వామి వారువము కోడిపుంజు గానం చేస్తూ వుంటుంది. తలమీది రత్నాలు ముద్దులు గారేట్టు పాపనట్టు వరాలు నర్తిస్తూ వుంటుంది. ఇవన్నీ కళ్ళతో

చూడవలసిందే ఆ కైలాస భూముల్లో వుండే వింతల్నీ – విశేషాలనూ – చెప్పే సమయం కూడా లేదు. నీకు శుభం కలుగుతుంది. బాలచంద్రధరుడు ఈశ్వరుడు సమస్తదేవతాశ్రేణి సరసుడు.

అమ్మా! రేగిన గంధపు చెట్ల సువాసనల మత్తులో మునిగి, మోసపోయి – పొరాపాటుననైనా అక్కడ ఆగి కాలు మోపరాదు. మరణాన్ని పుక్కిట బట్టిన మిన్నాగులు ఆ కొమ్మల నాశ్రయించుకొని తాండవిస్తూ వుంటాయి.

ఆపదలకు నిలయాలైన తావులే, వలపుల నొలికించి – మురిపించి మనస్సు నీడుస్తాయి.

అనంతమైన కాలరథాన్ని కదలించి, మానవ సమాజంపై నడిపి, నశింపజేసే ప్రయత్నం యిక్కడ యే మాత్రం చెల్లదని రుండమాలికలు పండ్లికిలించి – నోళ్ళు తెరచి వికటాట్ట హాసం చేస్తూ ఈశ్వరుడి కంఠాన్ని చుట్టుముట్టి నీచమైన మృత్యు దేవతతో ఎకసక్కే లాడుతున్నాయి.

తల్లీ? తబిసి గుబ్బెతల రాణీ! ఒలికిన పండు వెన్నెలలనే పాలను తపిత చకోర పక్షి తాగుతూ వుంది. ఇప్పటికే యెంతో పొద్దు పోయిందమ్మా! నీ చిన్నారి బొజ్జకు భోజనం వెతుక్కోవాలి గదా! పో.

తూర్పు ముఖంగా హైందవ వీధిలో చెవులు చిన్నపోయేట్టు డుబు డుక్కువానిధక్కానినదం వినిపిస్తుంది. కుత్సిత సభ్యతా స్థానంగల అతడు మన స్నేహం తెలిస్తే కంటగించు కొంటాడు. అదుగో? కోడి కూస్తుంది; ఉమాపతి మేడకు వెళ్ళు.

అమ్మా! ఇంకొకసారి నీ దరిసెన భాగ్యం కలిగించి నన్ను ధన్యుణ్ణి చేయి. శివుడే మన్నాడో చెప్పిపో నీ కంటే ఆప్తులుగానీ, శరణ్యులుగానీ నాకులేరు. తూర్పు దిక్కున తెల్లని కాంతిరేఖలు తోస్తున్నాయి. కన్నపు దొంగ తనపని ముగించుకొని యింటికి చేరుతున్నాడు. నీవు కూడా నీ సదనానికి వెళ్ళు.

తలుపులూ – ద్వారా బంధాలూ లేని నా కుటీరలక్ష్మి ఎప్పుడూ నీకు స్వాగతమిచ్చి, మర్యాద చేస్తుంది. నా ఆజ్ఞకోసం వేచి వుండవలసిన అవసరం లేదు. రాత్రింబవళ్ళూ నీవు నిరాటంకంగా రావచ్చును.

నిద్దుర మేల్కొని పురభామిని మెల్లగా ఖద్దరు రాట్నాన్ని ధరించింది. పొద్దు పసిబాలుడు తూరుపు ముద్దరాలి పొత్తిళ్ళలో ముద్దులు గురుస్తున్నాడు.

ఆ అమాయకుడి యిష్టార్థాన్ని తీర్చే దానిలాగా గబ్బిలం విశ్వనాథుడి గుడికిపోయింది.

వేయి చేతుల పెనుకాపు వేగిరిస్తూ వుండడంతో పేదకార్మికుడు కచ్చ బిగించాడు.

* * *

మలిభాగం

గబ్బిలం ఏమని చెప్పిందో యేమోకాని, గుబ్బిలి అల్లుడు కంటి కొనలనుండి అశ్రుబిందులు రాలుతూవుండగా లేచి, వెంటనే కారుమబ్బులోకి మాయమయ్యాడు.

తిరువాన్మూరు దేవుడు తలుపులు తెరిచాడు! ఇతర దేవుళ్ళుకూడా బిత్తరపోయి నిమ్న జాతుల దర్శనంవల్ల తమ దౌర్భాగ్యాలను కడుక్కొన్నారు.

అంటరానితనాన్ని అంటిపెట్టుకొని భారతజాతి సభ్య ప్రపంచంలో చిన్నపోయిందనీ, శాంతికి మించినకత్తి జర్మనీయుద్ధంలో కనుక్కొన్న మొనగాడులేడనీ, కదురు – రాట్నంవల్ల కాకుండా స్వేచ్ఛా స్వర్గ సంతోషం లభించటం ఆకాశ కుసుమమేననీ, నూరు సంవత్సరాలు గాదు – మూడువందల సంవత్సరాలైనా బ్రతుకవచ్చు; కానీ – న్యాయమార్గంలో నడవండనీ, నిమ్న జాతుల కన్నీటి మేఘాలు పిడుగులై దేశాన్ని కాల్చి వేస్తాయనీ – రాట్నాన్ని ఒక చేత్తో, మరోచేత్తో దుడ్డుకర్రనూ పట్టుకొని గుజరాతు ముసలిసెట్టి దెసల కనిపించాడు.

సీమగుడ్డకు కన్నులు చెమ్మగిల్లాయి. ముతకబట్టకు మర్యాద పొట మరించింది. నగరానికి వెలుపలవుండే మాల మాదిగలుకూడా మనుషులేనని లోకం గుర్తించింది.

"ఓ హరిజన సోదరా! నీకు భయంవద్దు; స్వరాజ్య రథం బయలుదేరి వచ్చింది. నీవు కూడా వచ్చి, ఆ రథాన్ని లాగిపో. అందులో నీకూ భాగం వుంది." అని భారతమాత గానాన్ని ఆలపిస్తుంది.

ఒకనాడా మునిపక్షిణి పాత చెలికాడున్న యింటిలోకివచ్చి యధా ప్రకారంగా తిరుగుతూ వుంది, వచ్చిన పక్షిని మిత్రుడుచూచి, ఉత్సుకతతో పొంగి, చిరునవ్వు మోమున చిందులాడ – "ఓ పక్షిణీ! నీకు జోహారు నిష్కళంకమైన నీ సహాయం వల్ల నా యత్నం పండయిందా? నేను వర్ణించి చెప్పిన పుణ్య భూములన్నింటిని సందర్శించావా? మహాదేవుడైన పశుపతీ – ఆయన సతీమణి పార్వతీరమణి నీకు తగిన ఆతిథ్య మిచ్చారా? నా మాటల నాయన చెవిలో నాటావా? సొంపారు – పెంపారు రత్నాలతో – బంగారుతో తళ్కులీనే దివ్యములైన ఆ హిమవత్పర్వత గుహలను, పవిత్ర క్షేత్రాలను కూడా చూచావా?

పులుగు చెలియా! లోకమంతా పాప భూయిష్టమై కళంక పంకంలో మ్రగ్గిపోతూ వుంటే, నాట్యమాడు కోవటం న్యాయమా? ఓ పరమేశ్వరా! ఒకసారి సృష్టిని పరికించి పొమ్మని పిలిచి వచ్చావా?

నాడు కాళిదాసు మహాకవి మేఘం తెచ్చుకొన్న సందేశ గౌరవ ప్రతిష్టలు, నీ సందేశ గాధకు కూడా లభించాయా? ఘనులకు లభించే భూభృదగ్రముల పూజ అసమ చతురత్వమున్న బానిసకు వస్తుందా?

వ్యాసుడు వాల్మీకి అనే రెండు మదపుటేనుగులు కైలాస పర్వతాలపై తిరుగుతూ వున్నాయా? వాళ్ళ ముసలి తనంలో భారత రామాయణాల పడుచుతనం నీకు స్పష్టమవుతుంది.

వాల్మీకికున్న సహజమైన జంతు కరుణా వ్యాసక్తి అతణ్ని కవిగా మలిచింది; రామాయణ కథను వెడలించింది. అట్లాగాకపోతే, దారి దోపిడి చేసే ఆ బోయకు దేవతల భాష సంస్కృతాన్ని ఏ గురువు బోధిస్తాడు? కళాధిదేవి ఆవేశించి వరమిస్తే, ఏ విద్య అయినా అట్టే వచ్చేస్తుంది.

సందేశ హారిణీ! ఖగభామినీ! కాళిదాసు శృంగార సందేశం ఆకాశ మార్గంలో ఎదురుగా వచ్చిందా! దానిలోని రసాలు – ధ్వనులు ముత్యాలను కురిపిస్తాయి. వేయి సంవత్సరాల ముదిమి వయస్సుగల పురాణ మేఘమని భావిస్తున్నావేమో! కాదు, అది పదహారేళ్ళ వయసున్న పడుచుదనంతో విలసిల్లుతుంది.

లోకం మెచ్చుకొనే రస ప్రసిద్ధమైన నా సందేశ భారాన్ని మోసుకొని, జన సంచారం గల విమాన మాలికల గర్జనలచే భయంకరమైన వాయు మార్గములో నీ ప్రయాణాన్ని యెట్లా సాగించి, నెగ్గించావమ్మా!

ఆ జన్మ సన్మార్గుల్ని పెనుగండాలైనా చెనక జాలవు

కామధేనువు వెన్నవలె ధవళకాంతులీను దానిని, ఉత్తుంగ శిఖరముతో ఆకాశాన్ని ముద్దుపెట్టుకొంటున్న దానిని మంచుకొండను నీ కళ్ళు ధన్యమయ్యేట్టు చూచావు గదా!

ఆ కొండ యిండియా విరోధుల దండుకు గుండెగాలమైన వెండి కోట; ఆ కొండ భారత సవిత్రీ కంఠ సీమకు ముత్యాలదండ; ఆ కొండ మాతృమూర్తి శిరస్సు నలకరించే కిరీట భూష; ఆ కొండ మహోన్నత పర్వతాలుగా కీర్తింపబడ్డ గర్వోన్మత్తకుల పర్వతాల నిక్కులకు నిక్కు; ఆ కొండ వెండికొండపై నివశించే భూతాధిపతికి మణిమయ కళ్యాణ మంటపం; సింధు గంగా మహానదులు శై శవ దశలో ప్రాకటం నేర్చుకొన్న బంగారు రాళ్ళపై గల పాదాల గుర్తుల్ని పరీక్షించి వచ్చావా? నీకళ్ళ కరువు తీరేట్టు దానినంతా చూచే ఉంటావు నీ పాపాలు గూడా అట్టే నశించిపోతాయి.

ఇంద్రధనుస్సును పట్టుకొని వేటగాడొకడు సాంద్రాబ్దవన వాటిలో తిరుగుతున్నాడు. నిమ్న జాతి జనులంటే – ఆ వేటగాడు గొంతుపిసికి నేలపై విసిరిన జంతుసంతతులు.

పుట్టుకతోటే ప్రతిభా సముద్దీపితులైన శిల్ప కళాచార్యుల వూహల కందనిదీ,

మూగబడ్డ పక్షుల గుంపులు వేయివిధాల కీర్తిస్తూవుండగా, వేకువజామున దిగాంతాలకు కుంచెలతో రంగులద్దే, ఆ శిల్పి బ్రహ్మాది ఏ గ్రామమో భోగట్టా తెలిసికొని వచ్చావా! అతని కళామాధురీ పద్ధతులెంత రసమయాలో?

పతగభామినీ! బెళుకు చూపులు – కులికే పోకడల్ని చూపీ చూపకుండా వూరించే కన్యకామణులు కొంతమంది మేఘ సౌధాలలో కనిపిస్తారు; చూచావా? సముద్రగర్భంలో ముత్యాలను పండించి, భూలోకాని కర్పిస్తూ వుంటారట వాళ్ళు. సృష్టిలోని విచిత్రాలు ఎంతో రహస్యంతో నిండివుంటాయి.

చిక్కుచీకటి వన సీమల్లో ఎంత కోయిలపాట వృధాగా అయిపోయిందో? కటిక కొండలమీద మిటకరించటంవల్ల ఎన్ని వెన్నెల వాగులింకిపోయాయో? కస్తూరి జింకలు మురికితిన్నెలమీద ఈ డేరటంవల్ల కస్తూరి పరిమళమెంత వ్యర్థమైపోయిందో? పండిన వెదురు గుబుళ్ళలో ఎన్ని ముత్తెపురాళ్ళు భిన్నమయ్యాయో? పుట్టరానిచోట పుట్టటంవల్ల ఎంత రత్నకాంతి . ఎంత తంగెటిజున్ను – ఎంత గంధవహనం – ఎంత శాంతి – ప్రకృతిగర్భంలో భగ్నమైపోయాయో?

గాంధీ శిష్యురాలైన వృద్ధురాలొకతె నెలలో వుంది. ఆ జేజెమ్మ జిలుగునూలు తయారుచేసుకుంటూ నిత్యం జీవిస్తూ వుంటుంది. కొండలయల్లుడు అలికాక్షుడు ఆమెను శిరస్సుపై వుంచుకొని సన్మానిస్తూ వుంటాడు. పండువెన్నెల పూదోటల్లో విశ్రమించి మన సందేశాన్నేమైనా ఆలకించిందా!

మా అమ్మరూపం నా చిత్తంలోదప్ప ఎక్కడా కనిపించదు. ఈ లోకంలో మరణించిన వాళ్ళంతా. వైకుంఠంలోనో– కైలాసంలోనో వుంటారంటారు. ఆ చోటు చూచివచ్చావా? విశాల విశ్వాలన్నీ మృతి భవిష్యన్మగ్గాలు. సూర్యచంద్రులిద్దరూ సన్మార్గగతులు; కాని, వాళ్ళిద్దరిలో ఒకరిని చూస్తే ఒకరికి పడదు ఒకళ్ళను చూచి యింకొకళ్ళు ఓర్చుకోలేరు. ఇద్దరికీ యింత వైరం దేనికీ? ఇద్దరిలో ద్రావిడీడెవరు? తెలుగు వాడెవరు?

శివుడు తాండవమూడి సంపాదించుకొన్న సత్కీర్తి తన ప్రయోజకత్వమని తలచికూడా విర్రవీగడని అంటారు. నటకులు పెక్కుమంది విర్రవీగి కవుల్ని విస్మరిస్తారు.

వెలకట్టరాని భావాల్ని వెదకుతూ, సత్కవీంద్రులు వూహలు పక్షులై ఆ యెత్తైన ఆకాశమండలంలో తిరుగుతూవుంటాయి. ఆకళించావా?

ప్రయాణ బడలికవల్ల, ఆ మంచుకొండలపై దిగే నీ విశేషం రసజ్ఞులకేదప్ప, అన్యులకు దురవగాహ మవుతుంది.

వడుకునూలుతో పగ్గాలు పేనించి, దొడ్డవేటగాడొకడు ఉచ్చులో పడ్డాడు. స్వరాజ్య సింహరాజు అందులో తగులుకొంటుందో – తప్పించుకొంటుందో చూడాలి.

నరుల్ని ముట్టకుండా, నందుల్ని – వాగుల్ని కొలిచి పుణ్యం సంపాదించే ఆ పరమ రహస్యమేందో శివుడితో యేమైనా ప్రస్తావించావా! ఇవి నిమ్న జాతులవాళ్ళు ప్రశ్నించకూడని వేద రహస్యాలని పరమేశ్వరుడేమైనా కోపగించుకొన్నాడా! తానేమైనా స్వార్థాన్ని ప్రదర్శించాడా?

బూడిద వూసుకొని, ఏ మాత్రం రసికత లేకుండా బ్రతికే ప్రమథుల మధ్య రసికుడైన సుకవి జీవితం కత్తిమీద సాములాంటిది. అట్లాంటి జీవితం శత్రువులక్కూడా వద్దు.

పక్షిణీ! ఎవరికి వాళ్ళుగా బ్రతుకుతూ, కొత్త కొత్త ధర్మాలను పిచ్చి నమ్మకాలతో ముడిపెట్టి ప్రజల బుర్రల్లో ప్రవేశపెట్టే స్వార్థపరులున్నారు. వాళ్ళనేమైనా గమనించావా? కొంతమంది ఆంధ్రులు విదేశాలకు పోయి, కొన్ని సంవత్సరాలుండి స్వదేశ వేషభాషల్ని విడిచి సంచిస్తారు. కాని, నీవు సమస్త ప్రదేశాలు సంచరించి త్రివిష్టపం కూడా తిరిగి వేషమేమాత్రం మార్చకుండా అచ్చమైన ఆంధ్ర వేషంలోనే ఉన్నావు. నిజంగా నీ వెంతో సన్మానార్హురాలవమ్మా!

నీ ప్రయాణంలో ఏమీ విశేషం లేదని నీ మొగమే చెపుతుంది. ఎంతో శ్రమయిచ్చి తప్పు చేశాననుకొంటా. మా అదృష్టం తప్పితే తప్పిందేమోగాని, నీ అనుగు సోదరుల శ్రేయం కోరి, గుప్పెడు గుండెతో – ధైర్యంతో ఈశ్వరుణ్ణి యెదుర్కొన్నావు అదే పదివేలు.

పోయిన పనికాలేదని విచారిస్తున్నావా? కార్యాన్ని సాధించలేక పోయానని పరితపిస్తున్నావా? అట్లా భావించకు; అపజయాలెన్ని సంభవించినా దిగులు పడవద్దు. అపజయాలన్నీ విజయ గేహాన్ని నిలిపే స్తంభాలుగా భావించు. కొద్ది కొద్దిగా పైకిలేస్తూ గోడ చివరకు పూర్తియవుతుంది. అంతే; పనులు కూడా సగం సగం అవుతున్నా, చివరకన్నీ నెరవేరుతాయి.

ఓడిపోయానని నేనేమీ భావించటం లేదు, నా ప్రయత్నమేదీ వృధాకాదు. నీ ద్వారా పంపిన నా మాటలు ఆ ఉమామహేశ్వరుల మానసాన్ని కలగుండు పరుస్తాయి. కన్నీట మునిగిపై కుబికే నిర్మల సూక్తి ఫలించకపోతే, ఇక రాట్నంలో స్వరాజ్యం విరాజిల్లు తుందని చెప్పేమాట కృతక ప్రచారమే గదా! అది దబ్బర అవుతుంది గదా!

పక్షి చెలియా! ఆనాడు పలనాటి బ్రహ్మన్న కృపా బాహుళ్య నేత్రంలో పలనాటబద్ద సంఘ సంస్కరణ బీజం, నాయకురాలి కుటిల వ్యాపార దావాగ్నికి బూడిదై, నేడు గాంధి మహాత్ముడి వల్ల ఫలించింది గదా! చేసిన ప్రయత్నం ఏ నాటికీ వ్యర్థం కాదమ్మా!

ఓ దయాశాలినీ! నీవు కావించిన రాయబారానికి నిత్యాభిషేకంగా నా కన్నీటిని కానుకగా యిస్తున్నా; తీసుకో; ఇంతకంటే మించి నా వల్ల నీవాశింప దగ్గది నా వద్ద

యేమీలేదు. ఒకవేళ స్వరాజ్య సౌధంలో నాకు వాసంగనుక లభిస్తే, నీ బాకీ తప్పకుండా తీరుస్తా.

స్వరాజ్యమే సిద్ధిస్తే, రాజ్యంలో ఏ జాతికెంత వస్తుందో, నాకూ అంత రాజత్వం రావాలి గదా! నా జాతి యెగుర వేసే జెండాపై నీ మూర్తిని వ్రాయిస్తా.

మా బ్రతుకులను ముసరిన కటిక చీకట్లను పారద్రోలి భళ్ళున తెల్లవార్చే బాబులు – పెద్దలు – పెక్కుమంది ఉన్నారు. అయినా, పొట్టకు – బట్టకు లేని భిక్షకుడైన కొండలరాయని అల్లుణ్ని తెల్లని వేల్పుని ఆశ్రయించి, కృతార్థుణ్ని కాలేకపోయా ఎంత పిచ్చివాణ్ణి నేను?

ఓ తపస్వినీ! మరచిపోయా; ఆదిదేవుడైన శివుడితో సమానుడు, మహాత్యాగియైన బుద్ధుడికి దీటైనవాడు చిరునవ్వు వెన్నెలలను చిందించే వాడు, నిష్కల్మష హృదయుడు – దొరలనుగానీ – వాళ్ళ చెవి దూరిన వాళ్ళనుగానీ లెక్కచేయని వాడు సబర్మతి నివాసి వున్నాడు, ఆయనను చూచి వచ్చావా?

ముల్లు కొంచెం వాలినా, గాంధితో సమానుడు వల్లభాయి పటేలు, నీకాయన దర్శన భాగ్యం లభించిందా? కనుచూపు మేరలో కనిపిస్తున్నా స్వరాజ్యం కోసం సర్వస్వమూ త్యాగం చేసిన విశుద్ధ వర్తనుడు, నామనఃక్లేశాన్ని ఆయన బాగా యెరుగును.

ధిక్కరించిన రాచగుర్రాలను స్వాధీనపరుచుకొనే వుక్కు కళ్ళెం లాంటివాడు జహ్వారు పండితుడు. అతని తేజోవంతమైన సరస్వతీమూర్తి నాల్గు దిక్కులనిండి నటిస్తుందని, ప్రపంచం వేనోళ్ళ కీర్తిస్తుంది. రేపు స్వేచ్ఛాభారతి విలసిల్లేటప్పుడు మా చిక్కుల్ని తీర్చడమనే సంగతి మరచిపోడుగదా!

మునిపక్షిణీ! మువ్వన్నె కాంతులు ప్రకాశింప కాంగ్రెసు మందారం పసుపుపచ్చని పూత పూసింది. శాఖోపశాఖలై దిక్కులకూ – విదిక్కులకూ – విస్తరించి వ్యాపించింది. ఆ వృక్షశాఖల్లో సమస్త వర్ణములకు విశ్వాసం జనించింది. మనకు మాత్రం అందులో నివసించటానికి స్థలం వుండదంటావా?

నా సోదరుడంబేద్కరుడున్నాడు. మాకై అష్ట కష్టాలుపడి సీమకుపోయి తిరిగి వచ్చిన మహావిద్వాంసుడు. వైశ్రాయి కొలువులో పెద్ద పదవిని పొందటానికి అర్హుడు. నీకు స్వాగతమిచ్చి పూలతో పూజలు చేశాడా? ఆతడి మెప్పులు నీ విజయానికి ఆరంభ సూచకాలమ్మా.

నేను – నాకు – అనే అహంభావాన్ని ఖండించలేక పద్దెనిమిది శాస్త్ర నిశిత నిస్త్రంశికలు మొద్దుబారాయి. కాని, తీవ్రతరమైన ఒక్క చిన్న మౌనవ్రతం–నీవు – నేను – అనే భేదభావాన్ని అణచివేసి, సమతను సాధించగలిగింది.

ఖగమానినీ! వచ్చినవాళ్ళు సీమనరపాలుర మంత్రులు. భారతీయుల్ని తృప్తిపరచటానికి, కోరినకోర్కెలను నెరవేర్చటానికి వచ్చి వెళతారు; అయినా, స్వతంత్రభారత సువర్ణ కిరీటం ఈ రోజుగాకపోయినా, యింకో రోజైనా తప్పకుండా వస్తుంది. నెలతప్పిన స్త్రీ తీర్థమాడక తప్పదు గదా!

అమ్మా ! గుళ్ళోని దేవుడు చూచిపొమ్మని నలుగురితో నాకు వార్తలు పంపటం సాగిస్తున్నాడు. నీ వెనుకనే వస్తా; రమ్మంటావా? ఆలస్యమయితే, నిరాహారదీక్షాపరులు భక్తులెంతమందో మరణిస్తారు. ఒక ఆంధ్రప్రాణి శుష్కించినా మధ్యలో నేను సహించలేను.

గబ్బిలమవై కూడా శివుడి లోకానికిపోయి కావలసిన కదలిక కదలించి వచ్చావు. నిశ్చలంగావుండే చెరువు నీటిలో సుడులు కల్పించటానికి ఒక చిన్న రాయి చాలుగదా!

అర్ధించి అగ్రహారాలకు వద్దామంటే సర్వేస్వరుడి యింటి చౌకదనం కనిపిస్తుంది. ఎట్లాగైనా అడిగి పట్టణ నడిబజారుకు వద్దామా – అంటే, గుడిగోపురాల తక్కువతనం కళ్ళకు కనబడుతుంది. ఏదోరకంగా పిలిపించుకొని బంతిబువ్వలకు వద్దామా... అంటే తీర్థ ప్రసాదాల దేబెతనం కంటబడుతుంది. ప్రశ్నించి – నిలదీసి రాచబావులకు వద్దామనుకొంటే, పాతాళ గంగమ్మ పలుచదనం ప్రత్యక్షమౌతుంది.

నిన్న – నేడు నన్ను చూస్తే అల్లంత నడచుదనం కనిపిస్తుంది. ఇదేదో నిజం తేల్చుకొనివస్తా. కాని గుడిలోకి రమ్మని పిలిచినంత మాత్రాన, వొళ్ళుమరచి పరుగెత్తుకొని రావటం నాకేమంత పరువుగా లేదు.

ఎంతో దూరం పోవటందేనికమ్మా! ఈ రోజున ఇంటింటికి ప్రాకి, దిగంతాల వరకు వ్యాపించిన స్వరాజ్య స్వర్ణసూత్రం మోకైనిక్కితే మాత్రం నన్ను పట్టి పీడిస్తున్న అంటరానితనమనే బెబ్బులిని బంధించగలదా.

తబిసి పక్షీ! నా జాతికోరిన కోర్కెలన్నీ తీరుస్తామని చాటింపువేసి, మాట యిచ్చారు. కాని, కొంతమంది దీని నంగీకరించకపోవచ్చు. ఈ దేశానికి స్వాతంత్ర్యం రేపోమాపో రావచ్చు. ఒకవేళ నాకడ్డుపడే ప్రబుద్ధులుంటే, నీ వోటెవరికిస్తావు? ఈ విషయం తెలిపి నన్నోదార్చు.

అప్రియాలైన సత్యాలు చాలా చెపుతున్నా అట్లా చెప్పినందుకు నీ దయకు దూరమై తపిస్తానో యేమో? యధార్థాన్ని తెలుసుకోవాలనే తహతహ పడుతున్న సహృదయులున్నారు. వాళ్లదయా పరిణద్ధ చేతస్కుడనై సుఖిస్తానో? చెప్పలేను. అయినా, నేను మాట్లాడిన మాటలన్ని, నా కన్నీటి నుండి పై కుబికినవే.

కవికి ఉద్రేకం అవసరం. ఏ కవి పిచ్చిగా నడచే లోకం కోసం తన సహజోద్రేకాన్ని అణుచుకొని, కీర్తికండూతితో ఈ లోకం వెంటపడిపోతాడో అతడు కవిగాడు, అంబుజగర్భుని

రాణిగారికి పేదుమూతిమగడు, ఆస్తిగల స్వామికి – అ రసికుడికి సాకుడుబిడ్డ మాత్రమే.

మా వంశపు పుట్ట చీల్చుకొని నీ పుణ్యాన, సంచిత కళా ప్రపూర్ణ ప్రభారాశియై ఒక సత్కవీశ్వరుడు పుట్టాలి. పుట్టుకతోటే ఉచ్చ నీచాలను అంటగట్టే వితర్క భ్రష్ట దేశంలో నిజంగా మా వంశములో కవులు పుట్టరాదమ్మా! పుట్టినా, వాళ్ళకే నాడూ నిండుసన్మానాలు జరుగవు.

ఖగసతీ! ముద్దులు మూటగట్టే మేలికవనపు బుగ్గలుప్పొంగి – కారడవులు, మొద్దులు, మోసులెత్తేట్టు కవితా ఝరి ప్రవహింప జేసిన మా వేమన్న జీవించినప్పుడు ఈ లోకం పిడికెడు కూడు గూడ పెట్టలేదు. కాని, ఈనాడాతని గొరీపై పూజలు – పుణ్యకార్యాలు నిరంతరంగా సాగుతున్నాయి. మా దయాధర్మాలు చాలా వింతగా వుంటాయి కదూ!

బ్రతికివున్నప్పుడెవ్వడూ సాయిబాబుగాడు; చావకపోతే వొట్టి సాయబియ్య. ఏడుకొండల వెంకన్న దీనిలోని రహస్యాన్ని తెలుసుకోలేడు. చావు – బ్రతుకుల్లో వుండేసారమిది.

సమతలూ –స్నేహాలు – పెదవిజారిన మాటలు; కట్టుబాట్లూ – చట్టాలూ – పటుత్వం తప్పిన గుడారపు దూముడి బంధనాలు; ధర్మాలూ – దయారసాలూ – మొసలికార్చే కన్నీటి బిందువులు, మత స్వభావాలు చిత్ర విచిత్రంగా వుంటాయి. ఇవన్నీ వురామరగా మాత్రమే వివరిస్తున్నా.

ఇప్పుడు గుండ్రాయిగామారి, ఈశ్వరుడిగా పూజలందుకొంటున్న కోటప్పకొండలోని కోటప్ప, ఒకప్పుడు సంసారి. మానవ మాత్రులైన వాళ్ళు రాళ్ళు రప్పలుగామారి దేవులైతే సకలరాసులు మింగకుండా వుంటారా? ఆకటిబాధతో అలమటించే బడుగుజాతికిక ఆసలు లేవమ్మా!

మునిపక్షిణీ! మరణం – వార్ధక్యం – అనే వాటినెరుగని సజీవ చైతన్యం గల కవిత్వం రాసిన మహోన్నతుణ్ణి – సాటిలేని మహాద్భుత కవితా స్రష్టను – మావేమన్నను మరచిపోయి, సంఘ సంస్కరణ పరాయణుడుగా పురాణకావ్య రసమత్తుడుగా – చెలామణి అయే కందుకూరి వీరేశలింగం కవుల చరిత్ర రాశాడు. అది నీ చెవినిబడ్డదా!

ప్రజలకర్థంగాని దొడ్డగుండురాళ్ళు దొరలించి. పాఠకులను బెదరిగొట్టే కవిత్వం ప్రబలంగా విస్తరించి, దేవతలకు కామధేనువులాగా – పండితులకు తప్ప పామరులకందకుండా పోయింది.

కవిత్వం ఎంత పేలవమైనదైనా, కథ గనుక మంచి ప్రసిద్ధి గాంచిందైతే, ఆ కథవల్ల కవికి కొంత ఖ్యాతి కలగవచ్చు నెలలు తక్కువగా పుట్టినా, బలమైన తిండిపెడితే ఆ శిశువు బాగానే వుంటుంది గదా!

వ్యాకరణ శాస్త్రం రాసిన కొంతమంది వై యాకరణులు – క– అనే అక్షరానికీ – క్ష అనే అక్షరానికీ యతి వేయరాదని చీకాకు కల్పిస్తారు. అంతేగాని, కవిత్వంలోని పాకాన్ని గానీ, రసాన్ని గానీ, అవి కలిగించే ఇంపుసొంపుల్ని గానీ గమనించరు.

ప్రజల వ్యవహారానికి దూరంగా వుండి, రస భావాలను చిప్పిల జేసే జీవంగల పదాలు గ్రామీణుల భాషలో కోకొల్లలుగా ఉన్నాయి. ప్రాచీన కవితోన్మత్తులూ – శాస్త్రజ్ఞాన మాత్రులూ – అయిన పండితమ్మన్యులకీ పదాలలోని జనం – జీవం – సంగతిగాని, చవులూరించే ఈ పదాలు వ్యక్తీకరించే జగా స్వారస్య రహస్యం గాని తెలియదు. సామాన్య జనవాహిని తరంగిణిలో తేలియాడే ఆ పదాలను పట్టుకోగల గజ ఈతగాళ్ళు గాదు వీళ్ళు.

అమ్మా! పక్షి సుందరీ! ఆ కాలంలో కృష్ణరాయ విభుడు భాషా వనంలో సాగించిన అష్టదిగ్గజ రధాన్ని – శారదా వాహనాన్ని చూచావుగా! ఆ అష్టదిగ్గజ బృంహిత ధ్వనుల్నీ – అధ్వాన్నమై కొండగుహల్లో నిద్రించే ఆంధ్రత్వాన్ని – తెలుగుదేశం మరచిపోయింది.

తెలుగు తేజం దిక్కులకెగబాకి శత్రువుల్ని బెదరించి వచ్చేటప్పుడూ, తెలుగు శిల్పకారుల సుత్తిదెబ్బలు ఖంగునమోగి చీనాకు పయనించినప్పుడు, తెలుగు కవిత్వం అష్టదిగ్గజ ముఖాలద్వారా బృహింత స్వనం కావించినప్పుడూ, తెలుగుజెండా శక్తి నాలుగుదిక్కుల ప్రసరించి విద్యానగర వీధుల్లో వెలిగినప్పుడూ; రామలింగని హాస్య చతురోక్తులను తలచి నాలుగు దిక్కులు పిక్కటిల్లేలా కడువుబ్బ నవ్వినప్పుడూ, నాట్యమాడిన ఆనంద నవ్యలక్ష్మి అక్కడి శిథిల దుర్గాలలో నీకు కనిపించిందా!

చూచావా ఖగమానినీ! తల్లికోట యుద్ధ రమణి ఆఖరి తెల్లుపోటు వల్ల ఉక్కిరిబిక్కిరై తురక యోధుల వంకకు వాలిపోయింది శత్రు భూపతుల గండరగండడైన, ఆంధ్ర భోజునిచే అప్పటివరకు పూజలందు కొన్న టక్కరి దేవతలంతా కిమ్మనకుండా ఒడలు దాచుకోవటం నాకు చాలా అసహ్య మనిపించింది.

తొంభైయేండ్ల వృద్ధుడు – అతిదోర్బల భీముడూ – మూరురాయల గండ బిరుదాంచితుడైన కృష్ణరాయల అల్లుడూ – అళియ రామరాజు మహమ్మదీయ రాజుల ఖడ్గానికి శిరస్సు సమర్పించి కష్టాలను తెచ్చి పెట్టిన మాట ఆంధ్ర వర్గం సహించ లేకపోయింది. అది ఆంధ్రులకు పరాభవమై – భవమై – దహించి వేస్తుంది.

తెలుగు లండను నగరం – తెలుగుకోట – తెలుగుకవి దిగ్గజాలు – తెలుగుదనం – ఒక్కటేమిటి? సమస్తం, పొట్టి గుర్రాన్నెక్కిన పొగరుబోతైన అళియ రామరాయల మూలాన ముక్కలైపోయింది.

నేను గూడా సకల సామ్రాట్టుల మహాసభల్లో నిర్భయంగా తలయెత్తుకొని

తిరుగలేనా? రాళ్ళు పగిలి రసస్రవంతి బుగ్గలు చిమ్మే అతులిత నిశాత ప్రబంధాల్ని చెప్పలేనా? తెలుగు కళ్యాణి కొప్పులో సత్కీర్తిపొగడ దండను కల్పించలేనా? ఉత్తుంగ హిమాలయ శిఖరాలపై శాశ్వతంగా రాష్ట్ర విజయధ్వజాన్ని ఎత్తింపలేనా? శత్రుగర్భ కుహరాలను విచ్ఛిన్నం చేసి స్వారి చేయలేనా? చేసేవాడినే; కాని, నా ఇంటి గుట్టు రచ్చకెక్కింది జాతియావత్తు సమ్మతించి కుమ్మక్కయింది. లేకుంటే కొండలన్నిటిని పిండి కొట్టకపోయానా?

అదుగో? అది మా రత్నాలార పొసుకొనే విద్యా శారదా పీఠం; అల్లదుగో! అది, మా కత్తుల కార్ఖానా; అదే – తెలుగు భానుడి సంపదసొంపు సమసిన మాల్యవంతం; ఈ రకంగా సగర్వంగా చాటుకొనే సమ్మద సౌఖ్యం లోకంలో ఒక్క తెలుగు వాడికే సంప్రాప్తించింది. ముమ్మాటికీ ఇది తథ్యం.

ఆంధ్రుల కళాకౌశలాలను చాటేచోటులు చాలా వున్నాయి. శత్రువుల గుండెల్లో నిప్పులు చల్లే వీర గాథలుకూడా కావలసినన్ని వున్నాయి. ఈనాటికీ పలనాటి పౌరుషపు రేఖలు మా శరీరాలలో వున్నాయి; కాని, మా ఆంధ్రజాతికి కలుపుగోలుతనమనేది లేదు. అదొక పెద్ద కళంకంగా చెప్పబడుతుంది.

ముస్లిములలో అసమాన సమానత్వం లంగోటికట్టి విరాజిల్లుతుంది. ఘూర్కా సిపాయిల క్రూర శౌర్య జ్వాల నట్టింట కాపలాకాస్తుంది. తమిళుల కార్యసాధన, ధనార్జన దీక్ష సాంబారు రూపంలో నోరెత్తి చాటుతుంది. పరరాష్ట్రాలకుగూడా ఎగబ్రాకి హిందీభాష దిన దిన ప్రవర్ధమానమై పదుగురి నోళ్ళలో ఎదుగుతూ వుంది. కాని, నిఖిల దేశాలకవతం సకుసుమమైన మానధనికురాలైన మా తెలుగుపడతి కాస్తగూడా కలత చెందటంలేదు. ఇదంతా కాలమహిమేమో?

గౌతమీ స్రవంతిలో అమృతకాంతులతో వుదయించిన ప్రఖ్యాత మణీవితానం మహమ్మదురాజులదండు దెబ్బతో తాతలకాలంనాడే కనుమరుగైంది. ఇక తాతలు పుట్టినా అది తిరిగిరాదు. అహో! రత్నదీపాతతకాంతులీనిన గృహం. ఈనాడు నూనెకే దేబెరిస్తుంది.

ఇప్పుడెన్ని గప్పాలు కొట్టినా ప్రయోజనమేముంది? భూగర్భంలో నిద్రించిన కృష్ణప్పలు – దాతలు లేచి వస్తారా? అయినా, చప్పబడి కూలబడ్డ తమ అనుగు సోదరులకుత్సాహం కల్పించటంకోసం, వీరావేశ విభ్రాజితులు, నిప్పులాంటి తెలుగుజోదులు ఈనాటికీ వున్నారు.

ఖగభామా! మా కావ్య సృష్టికర్తలజిహ్వ ఏనాడు విశ్వసత్యాన్ని ఆలపిస్తుందో, మా జాతి దృష్టి మాంద్యాన్ని విడిచి ఏనాడు చుట్టుపక్కల తేరిచూస్తుందో, మా బుర్రలు – జుట్టు తలలేని పుక్కిటి కథలలో చిక్కువడక ఏనాడుంటాయో? మా చదువులు

చిలుముపట్టకుండా యినుప సంఘంలో ఏనాడు ప్రకాశిస్తాయో? ఒళ్ళు దాచకుండా, సోమరితనాన్ని విడిచి ఈ మఠాలు బిచ్చమెత్తుకోవటం ఏనాడు మానివేస్తాయో? అట్లాంటి శుభసమయంకోసం కొంగుబట్టినిలచి నా మనస్సు నలిగి వాపోతున్నది.

మహారాజుల పెళ్ళి పేరంటాళ్ళు వర్ణించి – వర్ణించి, ఏండ్లు – పూండ్లు కాలాన్ని ఖర్చుపెట్టి, విరహవేదనలో ఒళ్ళుమరచి మూర్ఛలుపోయిన రాణి వాసాన్ని రచ్చకీడ్చి, అంగాంగవర్ణనా వ్యసనం రెట్టిస్తే వుప్పొంగి, యువక జీవితకోటి కుచ్చులువేసి, పాడిందేపాటరా పాచిపళ్ళ దాసుడా – అని రాసిందే, వగరెక్కేదాకా, పద్దెనిమిదిసార్లు తిరగరాసి – "శరణు శరణు మహాకవీ, నీవే దిక్కు–" అని వచ్చిన బాధాతప్తులరోదన ధ్వానాన్ని అనాదరించి, లోకహితంకోరే కవితాకళాశక్తిని స్వార్థ సముద్రంలో వూరవేశారు.

వివేక విహీనమైన గ్రంథరాసులే కుప్పలు తెప్పలుగా పోగై, అవే విద్యలైతే – ఇంకా పదివేలయుగాలకైనా బుర్రలులేని గంగెద్దులుపుట్టి స్వార్థ పరులెత్తిన గంతల్ని మోస్తాయి. రుచీ – పచీలేని నిస్సారమైన కథల్ని బలవంతంగా తలమీద రుద్దితే బుద్ధి చిగురిస్తుందా?

పక్షి సార్వభౌమణీ! ఆడుదిలేకపోతే కావ్యానికి అందమే లేదన్న నమ్మకంతో ఏనాడో పనికిమాలిన ప్రణయబంధుర గీతాలాలపించారు. కారణం – తామాశ్రయించిన భూపాల బృహన్నల వర్గం (కొజ్జాలు) మెచ్చుకోవాలనీ, తమకున్న డబ్బుపిచ్చి వెంటబడి తరుముతూ వుంటే, సిగ్గుమాలిన యీపని చేశారు. కాని, నేడు దయారసబంధుర కావ్యరాజాలను కవులు తమ కలాలనుండి వెలువరిస్తున్నారు.

మొన్నటి యుద్ధ దేవతకు జనించిన క్షామదేవి తనయ సంతృప్తిగా గొంతువరకు మెక్కిన క్షుధార్తుల డొక్కలు, ఎముకల రాశి సంపన్నుల వీధుల్లో కనపడ్డాయా!

కరుణరస కావ్యాలను రాయాలన్న సంగతి వంగకవీంద్రకోటి చేతుల నలంకరించిన కలాలకు తెలియదనుకొంటా.

చలిచీమను గూడా చావద్రొక్కని అహింసా మానసులు భారత దేశమంతటా, ఎన్నో బుద్ధ విగ్రహాలను మొలిపించారు. వంగ ప్రాంతములో ఆ దయాగుణం కలగా అయిపోయిందేమో? అక్కడ ప్రేమమూర్తులే లేరా? అక్కడి భాగ్యవంతులు ఇష్టమృష్టాన్నాలను భుజింపరా?

అమ్మా! సమాజంలో పరస్పరా హరణ స్వభావం ఎందుకు జనించింది? ఒకరినొకరు విశ్వసించే సౌభ్రాతృత్వం ఎట్లా నశించింది? ఈ చట్టాలూ – ప్రమాణాలూ – నిస్సారమైనవే గదా! కొట్టితే, తిరిగి కొట్టుకొమ్మని ఎదుటవాని గుండెల్ని సైతం కరగించే, ధర్మాలు జనించిన ఈ గడ్డలో అశాంతి కాలసర్పాలు బుసలుకొడుతున్నాయి.

అటు చూడమ్మా! మహానుభావుడైన వివేకానందుడు కన్నీటి సిరాతో రాసిన రాతలు ఇంకా చెరగి పోనేలేదు.

నిరర్థకమైన ప్రాచీన అజ్ఞాన బంధాన్ని బదాబదలు కావించి, విద్యా భిక్షపెట్టే ఘనుడెవరు వస్తారో? పచ్చని బంగారంలాంటి మా భారత సంసారాన్ని ఎట్లా నెగ్గిస్తాడో?

గాలికే తూలిపోయే శుష్క దేహాలతో – కాషాయ వస్త్రాలతో – త్రిశూలాలు ధరించి, సొరకాయ బుర్రలు చేతబూని – జటాజూటాలు దాల్చి – భ్రష్టులై దేశదిమ్మరులుగా తిరిగే, పొట్టకూటి రాయళ్ళు – బాబులు – గంజాయి భాయీ లున్నారు, వాళ్ళు నీ కెదురు కాలేదా?

జపమో– ధ్యానమో తైతక్కలాడే మోసపు పాండవ మధ్యములు ఈ దేశపు ప్రతి పల్లెలోనూ వున్నారు. ఇష్టసిద్ధి సిద్ధిస్తుందని ఈ సన్యాసి మూక నీకు మాయోపాయ మంత్రం ఏదీ ఉపదేశింపలేదా? ఈ లోకంలో పర స్త్రీలను వంచించే మోసగాళ్ళకు భక్తి పరత్వం ఒక సాధనంగా వుంది.

"పాలూ – వండ్లూ – కందమూలాలు మాత్రమే మా ఆహారం; ఏ కాలంలోనూ ఇతరమైనదేదీ కోరము, కాని – వెండిగానీ – బంగారంగానీ – కొంచెం చాలు"; అని సామాన్య జనాన్ని వంచించి సేకరిస్తారు. ఇట్లాంటి గోసాయీలు చేసే మోసాలూ – ఉపాయాలూ – ఈనాడంతటా నిరాఘాటంగా ఎన్నెన్నో రాజ్యమేలు తున్నాయి.

చేతి వృత్తులు చేజారి తుప్పుబట్టిపోగా, పలువృత్తుల నాశ్రయించి బ్రతికే బడుగు జనం భిక్షాటనమే వృత్తిగా జీవిస్తున్నారు. కరువు తాండవిస్తుంది. కాని, వున్నతాశయులైన దేశోద్ధారకులెంతమందో వున్నారు; సమాజాన్ని అలముకొన్న హృదయ విదారకమైన ఈ కళంకాన్ని తుడిచిపెట్టి, లోకాన్ని సంపద్వంతం చేయటానికి ఒక్కడు కూడా నడుంబిగించడు.

ఎన్నో సుక్షేత్రాలు సారం ఇగిరిపోయి, ముండ్లతుప్పలకు నెలవై బంజరు భూములుగా మారాయి; దృఢతరమైన యెంతో దేహశక్తి భిక్షకుల శరీరంలో జీర్ణించి భూగర్భంలో కలిసిపోయింది.

పదవుల పీటల్లో కూర్చొని ప్రతిక్షణం లంచపు పాడిబర్రెలను పిదికి, గడించి, పేదకార్మికుల చెమటను దెచ్చి కానుకలుగా, సమర్పిస్తారు; ఈ విచిత్ర భక్తులూ, వేషధార్లూ, పరమ పరోపకార పరాయణులూ నీకేమైనా యెదురుగా వచ్చారా? ఛీ చీ – ఇట్లాంటి వాళ్ళ ఏమైనా ఆశపెట్టినా వద్దమ్మా! చేయిసాచకు.

నరుణ్ణి కష్టపెట్టి నారాయణుణ్ణి సేవించే ధర్మశీలురన్న నేలమీద కాలుమోపలేక, గబ్బిలమొక్కటే తన పాదాలను ఆకాశంలోకి సాచి నడుస్తుంది.

ఓ పేచకమ్మా! పూజారి బోషాణాన్ని కాపలాకాసే చిల్లర దేవతలకు సేవచేసి, గొర్రెపోతుల రక్తాన్ని జుర్రిగర్రున తేపే కరకు సత్తులకు జాతరలుచేసి, ప్రతియేటా పెళ్ళిళ్ళు చేయించుకొనే కృతకరాముల పల్లకీలుమోసి, నిలువుదోపిడిచేసి తలకాయ గొరిగించే ఏడుకొండలవాడి మేడలెక్కి, గంభీర సముద్రాలను కళ్యాణకారకాలని భావించి, ముంచే గంగమ్మలకు డబ్బు ధారపోసి – పోసి, పాతకంలాగా నా వెన్ను పాయకుండా వున్న ఈ గోచితో నిలచివున్నా.

గుర్రాలకు రెక్కలున్న వెర్రియుగాలు దాటిపోయాయి. ఇది విజ్ఞానయుగం; పైగా బుర్రలున్న గాంధీయుగం; కర్రలూ – కత్తులూ – ఈనాడు ప్రజల్ని పాలించలేవమ్మా!

పక్షిణీ! రాజుగారి గుర్రాల రధచక్రాల కిందపడి మరణించే రైతుకు శరణమిచ్చి, మానవజాతిలో అంతరాలుండటంకంటే పాపం ఇంకోటిలేదనే ధర్మాన్ని ఆకళించి, వివిధ మతాచార భీకర పదాహతివల్ల అసురుసురనే వాళ్ళకభయమిచ్చి, రాజభాషలకంటే రాష్ట్రభాషల్లోనే రసమున్నదనే వాస్తవాన్ని తెలుసుకొని, పెక్కుయుగాలనాడే వూబిలో దిగబడ్డ మహితమైన జాతిమత్తగజపు బానిస సంకెళ్ళను బద్ధలుచేసి, సర్వదిశలలోనూ మసలుతూవున్న రోజులివి.

చలికోసం ఖద్దరు బట్టలు ధరించి, ఆపై స్వేచ్ఛా రాజ్యం వస్తుందని విహరించే పెద్ద మనుషులు మోసపుదేశభక్తిపరులు ఆ కైలాసదేశంలో వున్నారా? నిమ్నజాతులపై వాళ్ళు చిందించే కన్నీటి బిందువులు తీయగా పుల్లగా వుంటాయి.

అమ్మా! మా దౌర్భాగ్యపు జాతిలో ఎవ్వడికీ పట్టని ఈ ఆది వ్యాధికిలోనై నేను మాత్రం ఎందుకు కుమిలిపోవాలి? నిన్ను అనవసరంగా కష్టపెట్టా. ఇది నా చాదస్తంకాక పోతే, ఏమిటి చెప్పు? పరసేవా భ్రష్టవంశంలో రోషగాడెప్పుడు పుట్టరాదు. అంతేగాదు – ఇంకో విషయం విను, ఈ ఇండియా పొలంలోవున్న మాల మాదిగలకు అంటరానితనమనే పుండు పుట్టింది. ఈశ్వరుడేగాదు, కృష్ణుడుగానీ, కృష్ణుణ్ణి నిరసించే క్రీస్తులుగానీమస్తుగాపుట్టినా ఈ రెండుజాతుల్ని కలుపలేరు. ఈ మాట చెప్పాలంటేనే చాల సిగ్గుగా వుంది.

ఈ తెలుగుజాతికి యాభై సంవత్సరాలు చాకిరిచేశా. అయినా, శుభాలూ – సౌఖ్యాలూ – ఇంతవరకూ నా వాకిలి తొంగిచూడవు. ఇంకా ఎంత కాలమీబాకి? వయసుతోపాటే నా ఆశలుకూడా అడుగుపట్టాయి. ఇవి తెప్పరిల్లుతాయో? నీరశిస్తాయో? ఈశ్వరుడు కూడా చెప్పలేడుగదా!

పక్షిసోదరీ! హృదయవిదారకంగా అరుస్తున్నా, జంతువుల కుత్తుకలుత్తరించి, వాటి గర్భాగారాల్ని చీల్చి, నెత్తురుటేళ్ళను పారించి మూఢతమ జాతులు జాతరలుచేస్తూ వుంటాయి.

అతివాదులైన శాస్త్ర పాఠం గతులు. దయారసాన్ని వొలికిస్తూ – కమ్మని బోధల్ని వినిపిస్తూ, ప్రోత్సహిస్తారు. ఇవన్నీ యెంత పచ్చి బూటకాలో తెలుస్తూనే వుంది.

ఆనాడు కుంతీదేవి కర్ణుణ్ణి కని గంగార్పణమని గంగలోకినెట్టి తన దారిన తాను పోయింది. అతని కుల – విద్యా – రూప సంపదలు వ్యర్థాలై గగ్గోలుపెట్టాయి. ఈనాడు భారతకుంతి మమ్మల్ని కర్ణుల్ని అసంఖ్యాకంగా కన్నది. యమనందను లిప్పుడు మా సౌభ్రాతృత్వాన్ని తలపోయటం లేదు.

ఒకడు రుద్రాక్షమాలల్ని నెత్తికి చుట్టి సాక్షాత్తు శివమూర్తిలాగా భూమి కవతరిస్తాడు, ఇంకొక దూర్వ పుండ్రాలు (నిలువుబొట్టు) ధరించి శివలింగాన్ని చూచి చీదరించుకొంటాడు; మరొకడు పై రెండుగాకుండా వికట వేషమొకటి వేసి, వాళ్ళిద్దరి మీద సవాలు చేస్తాడు, ఇంకొకడు గంజాయి దమ్ముకు దాసుడైపోయి బూడిద గురవడై పుట్టుకొస్తాడు; ఒకడు – ఓ మనుజులారా! మాదే గొప్ప మతమనీ, తక్కినవి నీచమైనవనీ, బల్లగుద్ది, తరిమి– తరిమి –చెపుతాడు. ఈ రకంగా మతాలన్నీ పేచీలుపెట్టి సమాజాన్ని అతలాకుతలం చేస్తుంటే, ఐకమత్యానికిక మార్గమేది?

ఇంతేగాదు...

మొక్కుబళ్ళ నెపంతో పాలుగారే చక్కని పసిపాప లెంతమంది గంగలో యిమిడిపోయారో? సహగమనాచార దావాగ్ని దేవతలు ఎన్ని చిగురు కొమ్మల్ని బూడిద చేశాయో? చదువుదాచే దురాచరణం ఎంత మంది కళాభ్యసన నైపుణ్యాన్ని గొంతుపిసికిందో, సఖ్యతలేని వేరుబంధాల వల్ల బాహు బలమెంతగా చచ్చుపడ్డదో? చిలిపి రాళ్ళకు నగిషీలు చెక్కి చెక్కి ఎంత విలువైన కాలాన్ని అగంతాన కలిపారో? కాని, చదువు నేర్చిన వెర్రిని చంపగలరా! బుద్దుడు, క్రీస్తు, గాంధి, దీనికి తార్కాణాలు కారా?

రాతిబొమ్మలైన గ్రామదేవతలకు రేపూ మాపూ నెత్తుటి కూడు మేపలేక, "ఇది సదాచారం – తప్పదు" అని వెంటపడి వచ్చే గురువులకు దక్షిణ లిచ్చుకోలేక; మంత్రతంత్రాలను నటించే టక్కరి మాంత్రికుల బారిబడి ధైర్యాన్ని చిక్కబట్టుకోలేక, పిచ్చి పూజలపై మమతను విడువలేక, దేవతా వంద్యమైన మాదే శాభ్యుదయం వుట్టికీ – స్వర్గానికీ ఎక్కలేక వూగులాడుతూ వుంది.

కర్మంది పతంగిణీ! విందారగించి పొమ్మని పిలవటానికి అర్హత లేదు నాకు; నందుల్నీ – నాగుల్నీ – కొలుస్తూ నవ్వులపాలైన జాతికి – మూడు వేలకులాల వాళ్ళకు – మనకు, పొందులు గానీ – పొత్తులు గానీ ఈ పనికిమాలిన సంఘం సమ్మతిస్తుందా?

అన్నపూర్ణ స్వయంగా తన భర్తకు సిద్ధంచేసిన అవ్యయ రుచిరాన్నమును శివుడి

సరసన కూర్చొని భుజించిన పూజ్యురాలవు. నీ వంశం తరించింది. ఇంతటి మహోన్నత స్థానంగల మునిపక్షిణివై, సఖులూ గర్భదరిద్రులూ – అయిన నిరుపేద సోదరుల ఆతిథ్యాన్ని కులభేదబుద్ధి వల్ల గ్రహించకుండా వుంటావా?

అమ్మా! సోదరీ! నా కులజులనేకులు దుఃఖరసోత్కటములైన కావ్యాలు పెక్కులు అనితరసాధ్యమైనవి నెత్తుటి సిరాతో రాస్తున్నారు. కాని, జాతిలుబ్ధుల వజ్ర కఠోరచిత్తము కరగి సంతోషిస్తాయంటావా? కోర్కెలు పండించకుండానే సుంకురాలిపోయి మామూలు త్రోవనే తొక్కుతాయంటావా?

సమక్షంలో – కవిగారికి నమస్కారం – అని చెప్పినవాడు, పరోక్షంలో – ఈ నమస్కారం కళకుపెట్టానని అంటాడు, కవిత్వంచూచి ఒళ్ళుగగురుపొడిచి పరవశత్వం చెందినవాడు. కవినిగాంచి ఎరచెరికంగా మసలుతాడు, విద్యాలోపం వెదకలేనివాడు. అసహనంతో జాతి తక్కువ వాడులే అని నోరు చప్పరిస్తాడు. తన శాఖీయులకు వందలు వేలుపోసి తృప్తిపరచినదాత పరులను తీయని మాటలుతోటే తృప్తి పరుస్తాడు. జీవకళలు జాలువారే ముగ్ధమనోహర శిల్ప కళాఖండాల్ని చెక్కిన శిల్పిని నిరసించి – శిల్పాలకు పూజలుచేసే వక్రచరితులు స్వైరవిహారంచేసే నేలలో? కళలకు ప్రేతకళల గతులుగాక యింకేమున్నది?

సోదరీ! ఆంగ్లభాషా మేటికవీంద్రులు షేక్సిపియర్లు – బైరన్లు – గోల్డుస్మిత్తులూ – మిల్టన్లూ – మొదలైనావారు, మా ముక్కుతిమ్మనతోగానీ– తిక్కనతోగానీ పోటీచేయ సమర్థులౌతారా? కాని, దేశీయకవి చంద్రులీ నాడు చాటుగా కనిపిస్తున్నాడు. పరదేశీయ కవికుల తిలకులే నీటుగా కనిపిస్తున్నారు. అంతా కాలమాంత్రికుని పాండిత్య ప్రభావమేకదా.

జాతీయోద్యమ యుద్ధరంగ మహిత ప్రతిధ్వానాలు కూతలు పెడుతూ, నాలుగు వర్ణాలవారికీ గగుర్పాటు కలిగిస్తున్నాయి. అయినా, స్వాతంత్ర్యమనే స్వర్ణసౌఖ్యంలో మా భాగం మాకిస్తారో? ఖాతాలేదని మెడబట్టి గెంటివేస్తారో? చెప్పవమ్మా!

కలధౌతాద్రి గుహలు ప్రతిధ్వనించేట్టు, తెలుగు రాష్ట్రంకోసం సోదరాంధ్రులు గలబాలేపారు. ఇది నీ చెవులసోకిందో? లేదో? రాష్ట్రాన్ని సాధిస్తారనే వుబలాటంతో తేలిపోతున్నావేమో? ఇవి తెలుగు తనయుల యత్నాలని చెప్పటం సమంజసంకాదు, కేవలం సోడాబుడ్డి వుద్రేకాలు.

ఏసు మహానుభావుడు ధరాహితార్థం బలయిపోయాడు. దాని ఫలితంగా రకరకాల సిద్ధాంతాలు – వివిధ మతాలు – చీలికలూ – కనిపిస్తున్నాయి.

అమ్మా! సంపన్నులు కడుపార నారంగించిన భుక్తిని కళ్ళతో చూచి, నిరుపేదలు

దుఃఖపడనిచోటు, సాంఘికాచార మృగరాజు గర్జనలకు బెదరక, జ్ఞానం పెరిగేచోట; జాతివైషమ్య రాక్షసి పదఘట్టనలకు కందిపోకుండా కళలు పెంపొందేచోటు, పాలకుల క్రూరతర కరాసికి లొంగి పోకుండా స్వేచ్ఛాలక్ష్మి మెదలేచోటు; అనదబిడ్డలు చూస్తూవుండగా, ప్రియమైన పుత్రులను ముద్దులాడని గుణనిధులు పుట్టినచోటూ, ఎక్కడైనా చూచావా? ఒకవేళ చూస్తే చెప్పమ్మా తప్పకుండా అక్కడే నివాసముంటా.

పయి పయి నవ్వులూ – పల్కరింపులూ – కపట బంధుత్వాలూ చూపి, ఆ తరువాత శత్రుత్వాన్ని ప్రదర్శించే – అనాగరిక స్వభావులూ, సైతానులూ, తిరుగని నేల బెత్తెడు కనిపించినా దయచేసి నాకు చెప్పమ్మా! అక్కడే నా ఇల్లు కట్టిస్తా!

కళల్ని దాచే చుప్పనాతి తనం ఇంకా దేశంలో వుంటే, ఈ దేశానికి ముక్తి వుంటుందా? ప్రపంచ సభ్యతకు మార్గం వుంటుందా? తలా, తోకాలేని తొంభై సమాధానాలు చెప్పి పేదల్ని వంచించే కళానిహంతలే ఈ ధరిత్రికి అనర్థాన్ని కలిగిస్తారు,

పతగీ! ప్రాణశక్తితో పనిచేస్తున్న ఈ దేహ యంత్రంలో ఎన్నో బిసలున్నాయి. ఒకవేళ యిందులో మరలు పాడైతే, నా విజ్ఞాన భాండాగారపు పసలు కించిత్తు గూడా పనిచేయవు. ఈ రకమైన దేహ యంత్రాన్ని తయారుచేసిన బిసగాడెవ్వడు? ఈ రహస్యాలకు బీగాన్ని ఎందుకు బంధించాడు? ఆశ్చర్యాన్ని కలిగించే యంత్రాలను కనుగొన్న విజ్ఞానులు చావు పుట్టుకల మర్మం తెలుసుకోలేక మరణించారు. మృత్యువును గెలిచే శక్తిని ప్రసాదించని చుప్పనాతి వేలు పెక్కడ దాగినాడో? అతనికీ తెరచాటు మోసాలెందుకో?

మునువు దేహంచాలించిన వారి యెముకలెరువై భూమాత పండించి యిచ్చిన నానా ఫలవృక్ష రాజములకు మాధుర్యాన్నిచ్చాయి. తను రక్తం మేఘమై కురిసి ఆనందాన్ని కల్పిస్తుంది. ఈ లోకంలో చచ్చేది యేదీలేదు, ప్రతి జీవికూడా భిన్న రూపాల్లో తిరిగి వస్తూనే వుంటుంది.

మరణించిన వారి శరీరమాంసము కొన్ని యుగాలు భూమిపై మురిగి రసాయనిక చర్యల పూర్ణ పరీక్షల్లో నిగ్గదేలి, చివరకు శిశు సమూహానికి దేహంగా విలసిల్లు తుంది. అట్లా గాకపోతే, ఈ సురుచిర దివ్యకాంతులు – నిసుంగులు – శరీరంలో ఎందుకు చోటు చేసుకొంటాయి?

పుట్టి నప్పటి నుంచే తపస్సులో పెరిగి – దేవాలయాలలో నివశిస్తూ – సకల విధపూజా పద్ధతుల్ని నేర్చావు. నీ ముత్తాతలూ – తాతలూ –జేజెమ్మలు బాధలను భవిస్తుంటే, దేవతలూ రాజీపెట్టరా? పేదవాళ్ళ మొర యెవరికైనా కర్ణ క్లేశమేనమ్మా!

మాతృ భాషలకు తగిన మర్యాదల నిచ్చే సర్వ కళాశాల సాగే చోటు, ప్రజల్ని

కబళించే వివిధ మతదేవతా దైనందిన గ్లానిలేని చోటు, నవ్య నవనీత సమానమైన కవుల కమ్మని వాక్కు నిర్భయంగా ఆవిర్భవించే చోటు, కన్న సంతానానికి వైషమ్యాన్ని నేర్పని తల్లిదండ్రులు విరాజిల్లే చోటు, విసపు నవ్వుల లాహిరీ వేసగాండ్ర పాదముద్రల మరక లేర్పడని చోటు, తోడూ – నీడాలేని దుర్భలులకు వాసయోగ్యము గదమ్మా!

బాల్యం నుంచీ జాతీయ పౌరుష జ్వలనాన్ని సవరించే కావ్య రాజాలు లేక, విక్రమ క్రమ శిక్షణను వెన్నతో పెట్టే జిజియా బాయి వంటి మాతృదేవతా మూర్తులు లేక, ఒకే బొట్టు ఒకే కట్టుబడి నేర్పి పాలింప జాలే దేవతలు లేక, కులమంతా తెంపులు తెంపులై కక వికాలవుతూ వుంటే వారించి కాపాడే ప్రభువులేక, బుద్బుద ప్రాయమైన మూన్నాళ్ళ పదవులకూ – ప్రతిష్టలకూ – ప్రాకులాడి, ప్రజలచే నమ్మించుకోలేక, నమ్మలేక మా జాతి జీవితాలు చితికిపోయాయి.

సోదరీ! యీనాడుకూడా మతగురువులు ఆకాశ సింహాసనాధ్యాసీనత్వం చూపి, ఇది తప్పకుండా సంభవిస్తుంది సత్యమని రూపిస్తూ ఆశలు చూపుతారు. కాని, పాతచింతకాయ పురాణ కథలు నమ్మటం సాధ్యంగాదు. నాలో పెల్లుబుకుతున్న రోషా వేశాలను చంపి దాసత్యాన్ని స్థిరీకరించే పరంధామం నాకెందుకమ్మా!

పుట్టకముందే నా తలకు పులిమిన జాతి – మత సంకుచితత్వంవల్ల నా సహజ కౌశలాలు బుగ్గయిపోయాయి. తాను కట్టిన కట్టుబాటుల్ని విప్పలేని ఆ గురుడెవడో? ఏమో? ఉట్టికే యెక్కలేని నన్ను స్వర్గసీమల్లో ఉయ్యాలలూగిస్తాడట!

ఖగమానినీ తిలకమా! నన్ను సృష్టించినవాడే నా వెనుక జన్మ మెత్తుతాడా? నోరూ, వాయిలేని నన్ను పదివేలరూపాలతో కంగారుగావిస్తాడా? తనకు బంగారు రంగారు గుడి గోపురాలు కోరుకుంటాడా? కానుకలు స్వీకరిస్తాడా? ఇవన్నీ మోసగాళ్ళైన భక్తులు పన్నే పన్నాగాలమ్మా!

అన్నమాటను మార్చుకోలేని శాస్త్రాలు స్వాభిమానాన్ని విడిచి మరోమాట మాట్లాడుతాయా? కులముంచుకొని నన్ను కొలవండి,' అనే దేవరలు నా కన్నీటిని కడుగగలరా? మానవదాస్యాన్ని మరగిన ప్రజలు ప్రేమతో నా చెలిమిని కాంక్షిస్తారా? కాల్పనిక కథాసమ్మూర్చితమైన ధాత్రి సత్యాన్ని వూహించగలుగుతుందా? ఏనాడో వుడుకురక్తం చచ్చుబడిపోగా చేతులెత్తి మొక్కే స్వీయజాతికొరకు వీరసూక్తుల్ని అరగించుకొనిలేచి, ఎదురొడ్డి శత్రువుల్ని అదమగలదా? చెప్పమ్మా?

ధర్మ సంస్థాపన కోసం ధరణిపై అవతరిస్తానని నాడు విష్ణువు చెప్పాడు. కాని, ఆనాడు జన్మించి నెత్తికెత్తిందీ లేదు. ఈనాడు జన్మించక పోతే మునిగిపోయిందీ లేదు.

పక్షి సుందరీ! భారతదేశంలో దైవతంగాని పదార్థం ఏదీ కనబడలేదు, వర్ణం కంటె మించిన పిశాచం కూడా ఏదీ కంటబడలేదు. సత్కులం కంటె మించిన మరొక కళ కూడా ఏదీ నేత్రగొచరం కాలేదు; పంచముడి కంటె మించిన నీచపు జంతువు ఏదీ దృగ్గోచరం కాలేదు.

మా హక్కులన్నీ దొంగలు దోచుకొన్నప్పటికీ, మానవత్వము పశుత్వమై చిక్కులు పెట్టే కాలంలో కూడా క్షమా సిద్ధాంతాన్ని నేర్పటానికి – నా పక్కా పౌరుషాగ్నిని చల్లార్పటానికీ శల్య సారథ్యం చేస్తూ మతరూప క్రూరసింహం నా పక్కనే వుండి పళ్ళు నూరుతుంది.

ప్రపంచం మెచ్చుకొనేట్టు బి.ఏ; ఎం.ఏ; మొదలైన బిరుదులు సంపాదించామని తెగనీలిగే మా మాలమాదిగలు, కులలోభం రెట్టిస్తూ వుంటే తెగలుగా ఏర్పడి వివాదాలతో తలమునకలౌతున్నారమ్మా! కాని, యెవరూ సంధి చేద్దామనే భావించటం లేదు. కుల కక్షలతో సతమతమయ్యే ఈ దుర్జనులకు మతబోధ లెందుకమ్మా!

అసలే ముక్కులేదు; పైగా దానిమీద పడిసెం పట్టిందన్నట్టు మా బానిసలు తమలో తాము ఎక్కువ తక్కువలు భావించుకొని తన్నుకొని చస్తున్నారు. ఇది చాలా సిగ్గుచేటుగా వుంటుంది. అంటరాని తనం నిర్మూలనకై అహరహం పాటుపడే గాంధికి ఈ విషయం తెలియదు. ఇందతా మాలోసాగే అంతర్నాటకారాటం.

భయంగొలిపే కృత్రిమ కథావేదాంత శాస్త్రాలకు చేతులెత్తి నమస్కారాలుచేసే అమాయక ప్రజలున్నారు. వాళ్ళు సేవిస్తూవుంటే సుఖ సముద్రంలో ఈతలుగొడుతూ కాలక్షేపం చేస్తూన్నారు కవి ప్రకాండులు. ఈ కవిలోకంలో ఎన్నడైనా ప్రాతఃకాంతులు చిమ్మే కవితా సూర్యుడు పుడతాడంటావా?

అమ్మా! నటుడిలాగా కాలపరిణామ విధేయులై ఎదురులేకుండా పెత్తనం వెలగబెట్టే ఘోర మతశాసనాలు ఈ దరిద్రుడిపై అధికారం చెలాయిస్తూ వున్నాయి. నలుగురేది చెపితే అదే ధర్మంగా చెలామణి అవుతుంది. నలుగురు కలిస్తే, అబద్ధంకూడా నిజమవుతుంది గదా!

బయటికెక్కడికీ పొక్కనీయకుండా కర్ణుని శక్తి సామర్థ్యాలను రణరంగంలోనే పూడ్చిపెట్టారు. అయినా, ఈనాడెక్కడ చూచినా అది తలయెత్తి ప్రోజ్జ్వలంగా వెలుగందుతుంది. కక్షలూ కార్పణ్యాలూగల ఒక కాలం నిజాన్ని దాచివుంచినా, తరువాత కాలందాన్ని బయటకులాగి వెలుగులోకి తీసుకురాకుండా వుండదు.

అర్జునుడి పరువు నిలపటంకోసం కృష్ణుడానాడామాటన్నాడుగానీ, నిజంగా పార్థుడు కర్ణుణ్ణి గెలవటమనేది నవ్వులపాటన్న సంగతి నలుగురికీ తెలుసు.

నేనెంత వద్దన్నా వదలకుండా వెంటబడి, నిర్భంధించి దైవ సిద్ధాంతం నా సంపూర్ణ ప్రతాపపౌరుష జీవన ప్రవంతిలో చిక్కని చచ్చుమందు చిలికింది. ఇక నీలాంటి గబ్బిలాలుచేసే హితోపదేశాలు ఎన్నివేలైనా, అవన్నీ గాలికాహారమే.

మునిపక్షీ! దేశమంతా తిరిగి వచ్చావుగదా! నీవు చూచిన ప్రదేశంలో ఎక్కడైనా దుర్గుణ జ్వాలను సంహరించే శాస్త్ర సముదాయం కనిపించిందా? పరమత సహనంనేర్పే పాఠశాల యేదైనా పరికించావా? వర్ణభేదాల జాడ్యమంటకుండా శాంతిగా వుండే రాజ్యం వీక్షించావా? మనిషిని జూచి మనిషి సహనంతో వుండేచోటు కనుగొన్నవా? నేను చిందులాడి, డప్పులుగొట్టి, అలసి – సొలసి – సత్తికొలుపు కొలిస్తే, చివరికి ఫలితం లోకులు భాగాలు వేసుకొనిపోయే నీచమైన భూమినైనా చూచావా?

క్రూరలు – కుచ్చితులు – అయిన దొంగలు నా హక్కులు దోచుకొన్నారు. నన్ను ఊరిబయటకు నెట్టారు. ఇప్పుడేమో ఓదారుస్తున్నారు. గాంధారేయులైన ఈ కపటులు లక్కయిండ్లు చాలా నిర్మిస్తున్నారు. తమ స్వార్థంకోసం నిర్మించుకొంటున్న మారు తమ్ములను నమ్మటాఇనికి వీలులేదు.

శరీరంలోని రక్తబిందువుల్ని ఖర్చుపెట్టి, సత్కవి కళాద్రవ్యాన్ని వెచ్చించి, మలచిన ముగ్ధమనోహర శిల్పాలు విమర్శకబ్రువుల కల్తీ వ్రాతలవల్ల కీర్తిని కోల్పోతున్నాయి. ఈశ్వరుని ధర్మాధర్మ నిర్ణేతృత్వాన్ని కొంతమంది అనుమానిస్తారు. కాని, అసూయపరుల నాల్కలు సత్యాన్ని చాటుతాయా?

ప్రజల్ని పీల్చి పిప్పిచేసే దురాచారాలను కాలమట్టని విద్యా బలమెందుకు? విద్య అంటే, మౌఢ్యశార్దూలాని కింపయిన భోజనమా? మోసపు వ్రాతకూతలకు రక్షాబంధమా! మానవత్వాన్ని ప్రసాదించలేని ఈ చదువెందుకో, ఈ చదువులన్నీ కేవలం మైరేయపు మైకాలు.

అమ్మా పక్షిణీ! చిరకాలం నుంచి యిక్కడ విభిన్న జాతి, మత, కుల విభేదాలు తిష్ట వేసుకొని కాపురం చేస్తున్నాయి. ఇంత భిన్నత్వం తాండవించే ఈ నేలలో, సుస్థిరత యేర్పడుతుందని చెప్పే మాటల్ని సందేహిస్తున్నా. హిందువులు, ముస్లిములు కలిసి ఐక్యంగా స్వరాజ్యరధాన్ని కడదాకా లాగుతారా? ఉత్తర దక్షిణ దిగ్గజాలు రెండూ కలిసిమేతలు మేసే తావుందంటావా?

ఎవడో వీర వసంత రాయడనే దేవుడు పుట్టి, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, సహస్ర ముఖాల చాటుతాడని చెప్పి, బేజారై కూలబడ్డ నా గుండెలో భయాన్ని చిమ్ముతున్నారీయ నృత ప్రచారకులు. మూఢ విశ్వాసాలకు పిచ్చి తలకాయలే కారణమమ్మా!

దయా విహీనమైన ఈ లోకంలో నన్నే పుణ్యాత్ముడో పుట్టించాడు; అతడే

ముప్పూటలా పొగలేని ఆకటి సొదను కూడా నా పొట్టలో ముట్టించాడు. అట్టిట్టై తపిస్తూ, ఆహారం కోసం అంగలార్చే నా భుక్తిని కాజేయటం కోసం దేవతలు కూడా పుట్టల రూపంలో – చెట్ల రూపంలో గుట్టల రూపంలో – బహు విధాకారాలతో పుట్టుకొని వచ్చారు.

మనస్సును దహించివేసే బాధ నా దరిద్రుడట్లా వెళ్ళగక్కాడు. గబ్బిలం కూడా నులివెచ్చని బాష్పాలు నిండిన కన్నులతో సానుభూతి చూపెట్టి ప్రదక్షిణించి – గుడిలోని ఆహార సంపాదన కింటికి పోయింది. అంతటితో తూర్పు దిక్కుటుయ్యాలలో స్వతంత్ర విభాకరచాలుడు కనిపించాడు.

మునిపక్షి రాకపోకల వల్ల, ఆ దరిద్రుడి శరీరంలోని రక్తమాంసాలు ఖర్చైపోయాయి. స్వతంత్ర భారత ఫలితాన్ని అతడు చవిచూస్తాడో? చనిపోతాడో మరి?

క్రూరుల్‌కుత్సితు లస్మదీయములు హక్కుల్ దోచుకొన్నారు న
న్నూరింబయటకు నెట్టినా రిపుడు నన్నోదార్చుచున్నారు గాం
ధారేయుల్ నెలకొల్పినారు బహుసంస్థల్ లక్కయిండ్ల క్కటా
మారుందమ్ములు నమ్మజాలనివి స్వాత్మశ్రీ సమారంభముల్

– జాషువ

క్రూరులు – కుచ్చితులు – అయిన దొంగలు నా హక్కులు దోచుకొన్నారు. నన్ను ఊరిబయటకు నెట్టారు. ఇప్పుడేమో ఓదారుస్తున్నారు. గాంధారేయులైన ఈ కపటులు లక్కయిండ్లు చాలా నిర్మిస్తున్నారు. తమ స్వార్థంకోసం నిర్మించుకొంటున్న మారు తమ్ములను నమ్మటానికి వీలులేదు.

– చార్వాక రామకృష్ణ

నవయుగ కవి చక్రవర్తి

జాషువ 42 వ వర్ధంతి సభ

మరియు

లోకాయత నాస్తికోత్తముడు

కీ॥శే॥ చార్వాక రామకృష్ణ **'వచన గబ్బిలం'** ఆవిష్కరణ సభ

కార్యక్రమ వివరాలు :

సమయం : 24-7-2013, బుధవారం, ఉదయం 10 గం॥లకు

వేదిక : ఆంధ్ర లయోల కళాశాల, హాలు 1ఎన్7
(ప్రిన్సిపల్ ఆఫీసు దగ్గర) విజయవాడ

అధ్యక్షులు : రెవ. ఫాదర్ డా॥ జి.ఎ.పి. కిషోర్ ఎస్.జె., ప్రిన్సిపల్ ఆంధ్ర లయోల కాలేజ్

ఆవిష్కర్త : దుగ్గిరాల సత్యనారాయణ రెడ్డి గారు (విశ్రాంత జిల్లా జెడ్జి)

ఉపన్యాసకులు : ఆచార్య ఎండ్లూరి సుధాకర్, (నన్నయ్య తెలుగు విశ్వవిద్యాలయము, రాజమండ్రి)
ఎన్.జె. విద్యాసాగర్ గారు (ఎడిటర్, బాస, గుంటూరు)
డా॥ నూకతోటి రవి కుమార్ (ఎం.ఎ., పిహెచ్.డి)

నవసమాజా కాంక్షితులందరకు ఆహ్వానం

కవి కోకిల జాషువగారు పాతతరం విద్యావంతులు, ప్రగతివాదులందరుకు సుపరిచితులు. చార్వాక రామకృష్ణ గారు రాష్ట్రంలో హేతువాద, నాస్తిక, కమ్యూనిస్టు ఉద్యమాలకు పరిచయస్తులే. వీరిరువురూ కీర్తి శేషులే.

వినిమయ విలువ వరదలో కొట్టుకొని పోతున్న నేటి యువతరానికి రామకృష్ణ, జాషువాల సాహిత్య సాగు, వారి జీవితాలు తెలియాలి.

జాషువ :

1895 సెప్టెంబర్‌లో గుఱ్ఱం వీరయ్య-లింగమాంబలకు, గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించాడు. దళిత లింగమాంబను పెళ్లి చేసుకొన్నందుకు యాదవ వీరయ్య కుల వెలికి గురయ్యాడు. క్రైస్తవ మతాంతరణ చెంది 'ఫాదర్' వృత్తి పొంది, దళితుడై జీవించాడు. సాహితీ క్షేత్రమున, కృషీ వలుడు కావాలనే వజ్రసంకల్పంతో అనేక బాధల నెదుర్కొంటూ, తల్లి, దండ్రుల పూర్తి ప్రోత్సాహంతో జాషువ ఉభయ భాషాప్రవీణుడయ్యాడు. ఉపాధ్యాయ వృత్తితో జీవిక ప్రారంభించి, కొంత కాలం మూకీ సినిమాల వ్యాఖ్యాతగా రాష్ట్రమంతా తిరిగి చివరకు ఆకాశవాణిలో కుదురుకున్నారు. "ఆలు బిడ్డలకునై ఆస్తి పాస్తులు పెడ త్రోవలో పాదమిడను నేను" అని ప్రకటించి ఆచరించిన ఆదర్శనీయుడు జాషువ గారు. కరుణా రసమయ అసమాన సాంఘిక కావ్యాలు తెలుగు కవితామ తల్లికి అందించిన కవికోకిల జాషువా గారికిదే మా నమస్సుమాంజలి.

జాషువ గారి గబ్బిలంకు సరితూగగల పద్య కావ్యము నభూతో నభవిష్యత్. కాని ఆ కావ్యము జ్ఞానపీఠ అవార్డు పొందకపోవటం రాజ్యమేలుతున్న వర్గకుల వ్యవస్థ కుచ్చితత్వ ఫలితమ్మే! జాషువ గారు మొత్తం మీద ఆరు డజన్ల పద్యకావ్యాలు మరియు ఖండ కావ్యాలు రచించారు. కాని ఒక్కరచనలో కూడా స్త్రీని కించపరిచే పదమొక్కటియు లేదని పరిశోధకులు వక్కాణిస్తున్నారు.

చార్వాక రామకృష్ణ :

జాషువ గారి విఖ్యాత కావ్యం గబ్బిలం ను బి. రామకృష్ణగారు వచన కావ్యంగా మలచి ఒక శిష్యుడి ఆర్థిక సహకారంతో 1996లో ప్రచురించారు. మూలం యొక్క రసం, రసజ్ఞతలకే మాత్రం భంగం వాటిల్ల నివ్వలేదు. నేటి కాలపు చదువరులకు కూడా యిది సులభోదాయకం.

పునర్వికాస ఉద్యమం - సాంఘిక సంస్కరణ ఉద్యమం - స్వాతంత్రోద్యమం - కమ్యూనిష్టు ఉద్యమం లు సాగుతున్న కాలంలో గుంటూరు జిల్లా తుళ్లూరులో 1939 జులై 1న బొడ్డు పెదవెంకయ్య పున్నమ్మగార్ల ఆరొవ సంతానముగ జన్మించినవాడె రామకృష్ణ. పరిస్థితులు బాలుడు రామకృష్ణలో హేతువాద జిజ్ఞాసను రగిల్చి ఉభయ భాషాప్రవీణున్ని చేసి, ఉపాధ్యాయ వృత్తి స్వీకరణవైపుకు నడిపింది. రంగారెడ్డి జిల్లా తాండూరులో 1964లో బోధనా వృత్తిలో ప్రవేశించారు. ఆ తర్వాత గుంటూరు జిల్లా తాడికొండ సంస్కృత కళాశాలలో చేరారు. విద్యార్థి దశనుండి మతతత్వ మూఢాచారాల వ్యతిరేక ఆచరణ శీలియగు రామకృష్ణగారు కళాశాల యాజమాన్యంతో భావపర రాజీపడ నిరాకరించి ప్రిన్సిపాలు ఉద్యోగాన్ని 1973లో విడిచారు. అప్పటికే ఆయన గృహస్తు, ఇద్దరు పిల్లల తండ్రి!

దేశీయ భౌతిక వాదమగు చార్వాకంతో కూడిన విద్యను పిల్లలకు బోధించటం ద్వారా తెలుగు నాట భావ విప్లవ విత్తులను వెదజల్లాలనే కృతనిశ్చయంతో రామకృష్ణగారు శత్రుదాడులకు, ప్రకృతి వైపరీత్యాలకు వెరవక, 1974 నుండి 2005 వరకు, అనేక ఒడుదుడుకులను తట్టుకొంటూ, స్వచ్ఛంద సంస్థల ప్రలోభాలను తిరస్కరించి, తన వారనుకునె ప్రగతిశీల వాదులు కూడా అపార్థం చేసుకొంటూన్నపటికీ, వెనుకంజవేయక, పాఠశాలను – నాస్తిక ఉద్యమాన్ని సాగించారు. లక్షలున్నప్పుడు పొంగిపోక ఒక రూకయు లేనపుడు కుంగిపోక నిజమైన కర్మజీవిగ జీవించి 2007 ఏప్రిల్ 18న తనువు చాలించి చరిత్రలో చార్వాక రామకృష్ణగ నిలిచిపోయారు బొడ్డు రామకృష్ణ గారు. ఈయన రచనలు యిప్పటకి పదునెనిమిది ప్రచురితమయ్యాయి.

కుల–వర్గ దుర్మార్గాచారం–మత మూఢాచారం–రాజకీయ కపటాచార–అధికార లంచాచారం– ఈ వ్యవస్థలన్ దునుమాడగల చైతన్య తైల చిత్రంబగు జాషువ పద్యకావ్యమగు **గబ్బిలం** వచనాకృతియే రామకృష్ణ విరచత **వచన గబ్బిలం.**

ఈ పుస్తక ద్వితీయ ముద్రణ ఆవిష్కరణ మరియు జాషువా గారి 42వ వర్ధంతి సభకు అందరికీ హృదయపూర్వక ఆహ్వానం.

ఇట్లు

పాయసి ప్రచురణలు

రామకృష్ణ గారి రచనలు

1. చార్వాక తెలుగు వాచకం – 5
2. చార్వాకుడు (నాటకం)
3. బి. రామకృష్ణ రచనలు (శతకాలు, వ్యాసాలు)
4. చార్వాకం
5. గుడ్డినమ్మకాల గుట్టుమట్టులు.
6. సంజయ రాయబారం
7. వచన సూతపురాణం – 12 భాగాలు
8. వచన గబ్బిలం
9. జంబుకుడు (నాటకం)
10. ఉత్తర గబ్బిలం (కావ్యం)
11. నేతబిడ్డ (పద్యాలు)
12. చార్వాక తెలుగువాచకం (1,2,3,4 భాగాలు)
13. మతమంటే ఏమిటి?
14. నాస్తికత్వ సిద్ధాంతం
15. వేమన విప్లవం
16. మూఢవిశ్వాస వనకుఠారం – 1
17. ప్రశస్తపాదుడు (నాటకం)
18. అరెరే...రంగనాయకమ్మగారూ.... మీకూ నాస్తికత్వం తెలుసా...?

vachana gabbilam

charvaka ramakrishna

1939 - 2007

"అన్ని సమస్యలకూ పరిష్కారం ఆర్థికత లోనే వుంది అని ఆర్థికతకు పట్టం గట్టటం తప్పిదమే అన్న విషయాన్ని మార్క్స్, ఏంగిల్స్‌లు ఒప్పేసుకున్నారు.

మరి మీరు ఒప్పుకుంటారా?

ఈ మాట అంటేనే ఒంటినిండా తేళ్ళూ - జెర్రులూ పాకుతాయేమో!

కానీయండి చేసేదేముంది.

ఏంగిల్స్ తన అవసానదశలో 1892 సెప్టెంబర్ 21న జోసెఫ్ బ్లాక్‌కు ఉత్తరం రాస్తూ ఇట్లా అన్నాడు -

'చారిత్రక భౌతికవాదం ప్రకారం వాస్తవిక జీవితంలోని ఉత్పత్తి, పునరుత్పత్తి చివరగా నిర్ణాయక శక్తి అవుతుంది. మార్క్సుగాని, నేనుగాని అంతకు మించి ఏమీ చెప్పలేదు. అందువల్ల దీనికి - ఎవరైనా - ఆర్థిక అంశం ఒక్కటే నిర్ణాయకశక్తి అని అర్థం తీస్తే దాన్ని అర్థరహితమైన శుష్క సమానంగా మార్చివేసిన వారవుతారు. రాజకీయ, న్యాయ, తాత్విక సిద్ధాంతాలు, మత దృక్పథాలు మరియు చిట్టెంకట్టిన వ్యవస్థలుగా అవి అభివృద్ధి చెందటమూ కూడా చారిత్రక పోరాటాల దారిపై ప్రభావాన్ని చూపుతాయి; చాలా సందర్భాల్లో ప్రత్యేకంగా వాటి రూపాన్ని నిర్ణయిస్తాయి."

- చార్వాక (బి.) రామకృష్ణ